www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 27 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ వైశాఖ శుద్ధ చవితి
24-30 ఏప్రిల్ 2023
వెల : ₹15/-




# సేవ
## భారతీయ ఆదర్శం

2,700 మంది స్వచ్ఛంద సేవకులు నిర్వహిస్తున్న
43,000 పథకాల గురించి ఇక్కడ సమీక్షించుకున్నారు


జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# జానపదానికి జేజేలు..

జానపద నృత్యం బిహుతో అస్సాం మరొకసారి గిన్నిస్ బుక్ రికార్డును సాధించింది. ఒకే వేదిక మీద నర్తకులు (నాసోనీలు), ధూలియాలు (డప్పు కళాకారులు) **11, 304** మంది కలసి ఈ రికార్డును సృష్టించారు. ఏప్రిల్ **13**న గౌహతిలోని సరుసాజయ స్టేడియంలో ఈ కార్యక్రమం జరిగింది. సాయంత్రం **5.30** నుంచి **6.30** వరకు ఒక గంట మాత్రమే ఈ కార్యక్రమం జరిగింది. దీనితో అస్సాం సంస్కృతి సంప్రదాయం ప్రపంచ ప్రజల దృష్టికి వెళుతుందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. **14**వ తేదీన మరొకసారి ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట ఈ కార్యక్రమం జరిగింది.




ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక
మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.
రండి.. జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా చేరుదాం! చేర్పిద్దాం!!

**పాఠకుల విన్నపం మేరకు**
**జాగృతి చందా పెంపు ముందు ప్రకటించినట్లు**
**2023 ఏప్రిల్ 1 నుండి కాకుండా 2023 జూన్ 1 నుండి అమలులోకి వస్తుంది. కనుక ఏప్రిల్, మే మాసాలలో జాగృతి చందా కట్టేవారికి పాత రేట్లే (1 సం. రూ. 650/-, 5 సం.ల రూ. 3000/-) వర్తిస్తాయి.**

ఇట్లు:
కుర్రా దుర్గారెడ్డి,
అసోసియేట్ ఎడిటర్

**జూన్ 1 నుండి..**

ఒక సంవత్సర చందా
**రూ.850/-**

విడి ప్రతి
**రూ.20/-**

ఐదు సంవత్సరాల చందా
**రూ.4000/-**

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyd- 27. Ph : 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్

కె. హరీష్ సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : సిహెచ్. కుమార్

**హిం**దూద్వేషం, మైనారిటీల బుజ్జగింపు, వేర్పాటువాదం, పిడివాదం కలగలసిన విధ్వంసక ధోరణి పేరే ద్రవిడవాదం. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే), స్టాలిన్ నాయకత్వంలోని తమిళనాడు ప్రభుత్వం ఈ వాదానికి చిరకాలంగా రాజపోషకులు. హిందూ వ్యతిరేకతే పరమావధిగా అవి దశాబ్దాలుగా తమిళనాడును ఏలుతున్నాయి. అందుకే హిందువుల ఐక్యత కోసం, హక్కుల కోసం పోరాడుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఒక్క ప్రదర్శన (పథసంచలనం) అనుమతికోసం ఆరుమాసాలు పడిగాపులు పడవలసివచ్చింది. ఈ దేశంలో హిందువుల కోసం పనిచేసే ఆర్ఎస్ఎస్ ఏటా జరుపుకునే కార్యక్రమం కోసం హైకోర్ట్, సుప్రీం కోర్టల చుట్టూ తిరగ వలసి వచ్చింది. ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 2, 2022న తమిళనాట జరగవలసిన పథ సంచలనం సుప్రీంకోర్ట్ అనుమతించిన తరువాత ఎట్టకేలకు ఏప్రిల్ 16న 45ప్రాంతాలలో జరిగింది. ఇది ఆర్ఎస్ఎస్ ప్రబోధించే జాతీయవాద విజయం.

చెన్నై, మధురై, కాంచీపురం, చెంగల్పట్టు ప్రాంతాలలో పథ సంచలనం జరిగింది. ఇంత బృహత్తర కార్యక్రమం నిర్వహించినప్పటికి ఒక్క అవాంఛనీయ ఘటన కూడా జరగలేదు. ప్రతి పథ సంచలనంలోను 400 నుంచి 500 మంది స్వయంసేవకులు గణవేష్‌తో పాల్గొన్నారు. కానీ ఏదో ఉపద్రవం పొంచి ఉన్నదన్న భయాలను రేకెత్తిస్తూ డీఎంకే ప్రభుత్వం రాష్ట్రాన్ని ఖాకీవనం చేసేసింది. తిరుచిరాపల్లి పథ సంచలనంలో 500 మంది స్వయంసేవకులు పాల్గొంటే, 1200 పోలీసులు మోహరించారు. ఈ పథ సంచలనంలోనే శివాజీ 350వ పట్టాభిషేక కార్యక్రమం, వల్లలార్ 200వ జయంతి, డాక్టర్ అంబేద్కర్ జయంతి ప్రదర్శనలను కూడా జోడించారు.

విజయదశమికి ఏటా ఆర్ఎస్ఎస్ పథ సంచలనం నిర్వహించడం దేశ మంతటా ఉంది. కొవిడ్ వల్ల 2020, 2021 సంవత్సరాలలో నిర్వహించ లేదు. ఇదే సాకుగా ఎంకే స్టాలిన్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో తలపెట్టిన పథ సంచలనానికి అనుమతి నిరాకరించింది. దీనితో న్యాయపోరాటం

**శాలివాహన 1945 వైశాఖ శుద్ధ చవితి**

**లోపలి పేజీలలో...**



ముఖపత్ర కథనం

**సేవ: భారతీయ ఆదర్శం**

6లో



జాతీయం

**కుర్చీ కోసం కుమ్ములాట!**

12లో



ధారావాహిక నవల

**వరాహమిహిర**

- పాలంకి సత్య

18 / 20లో

# జాగృతి

## సంపాదకీయం

తప్పలేదు. డీఎంకే ప్రభుత్వం పెట్టిన అడ్డంకులను చెత్తబుట్ట దాఖలు చేసిన మద్రాస్ హైకోర్ట్ సెప్టెంబర్ 22, 2022న పథ సంచలనానికి అనుమతించ వచ్చునని తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టును ఆశ్రయించిన సర్కారుకు అక్కడా తల బొప్పికట్టింది. హైకోర్ట్ ఆదేశాలు సరైనవేనని ప్రకటిస్తూ, జస్టిస్ వి. రామ సుబ్రమణియన్, జస్టిస్ పంకజ్ మిట్టల్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం పథ సంచలనానికి అనుమతిస్తూ ఏప్రిల్ 11న ఆదేశాలు జారీ చేసింది. ఆ కార్యక్రమానికి అనుమతి ఇవ్వరాదంటూ తమిళనాడు ప్రభుత్వం చేసిన అప్పీలు, అందులో చెప్పిన కారణాలు ఎంత హాస్యాస్పదమో, జుగుప్సాకరమో సుప్రీం


## జాతీయవాద విజయం

కోర్ట్ వ్యాఖ్యలతోనే అర్థమవుతుంది. నిషిద్ధ పీఎఫ్ఐ వల్ల ఆర్ఎస్ఎస్ సభ్యులకు ప్రమాదం పొంచి ఉంటుంది కాబట్టి, శాంతిభద్రతల సమస్య తలెత్తుతుంది కాబట్టి అనుమతించబోమని ప్రభుత్వ వాదన. నిషిద్ధ సంస్థ వల్ల బాధితులు ఆర్ఎస్ఎస్ వారే అని చెబుతూనే వారి మీదే తిరిగి నిషేధాస్త్రం ప్రకటించడం ఇక్కడి విశేషం. ఇదంతా పీఎఫ్ఐ నిషేధంతో దిగాలుపడిపోయిన ముస్లిం మతోన్మాదులను సంతృప్తి పరచడానికి డీఎంకే ప్రభుత్వం నిస్సిగ్గుగా తీసుకున్న నిర్ణయం. ఈ అంశాన్ని సాక్షాత్తు అత్యున్నత న్యాయస్థానం గమనంలోకి తీసుకున్నది. మొదట అనుమతి కోరిన అక్టోబర్ 2, 2022న క్రైస్తవులు ఎక్కువగా చర్చికి వెళతారు కాబట్టి పథ సంచలనానికి అనుమతించలేమని ప్రభుత్వం చెప్పడం చూస్తే ఈ ద్రవిడవాదాలు, కమ్యూనిజాలు, మానవహక్కుల ఉద్యమాలు హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతి పెద్ద సంస్థకు ఇచ్చిన మర్యాద ఏమిటో అర్థం కావడం లేదా? స్వతంత్ర భారతదేశంలోనూ హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులు మాత్రమేనని గుర్తు చేయడం కాదా? నిజానికి పథ సంచలన్ స్వయంసేవకులకు ఇచ్చే తర్ఫీదులో భాగంగా సామర్థ్యం పెంపునకు ఉద్దేశించినదేనని ఆర్ఎస్ఎస్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. స్వయం సేవకులలో అన్ని వర్గాలవారు, అన్ని స్థాయిలలోని వారు ఉంటారని వెల్లడిం చింది. రోజు కూలీలు, విద్యార్థులు, కార్మికులు, ఉన్నత పదవులలో ఉన్నవారు స్వచ్ఛందంగా భాగస్వాములవుతారని ఆ ప్రకటనలో ఉంది. సంఘ్ పథ సంచలనం అంటే అసాధారణ క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకోసం నిర్వహించే ప్రదర్శన. హిందూ ఐక్యతను చాటడమే పథ సంచలనం అసలు లక్ష్యం. హిందూ సమాజం క్రమశిక్షణతో, సమయ పాలనను అనుసరిస్తూ, వ్యవస్థీకృ తంగా నడవగలదని ప్రజానీకానికి వెల్లడించడం కూడా దీని ఉద్దేశమే.

హైకోర్ట్, సుప్రీం కోర్ట్ అనుమతించినా కొన్ని ఆంక్షల నడుమ పథ సంచలన్ నిర్వహించవలసి వచ్చింది. ముస్లింల అడ్డాల గుండా ప్రదర్శన సాగరాదన్నది వాటిలో ఒకటి. అక్కడ ఉన్న ముస్లిం ప్రార్థనామందిరాల మీద స్వయంసేవకులు రాళ్లు విసురుతారట. అవన్నీ మాకు అనవసరం, శాంతిభద్రతలు కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని నిక్కచ్చిగా సుప్రీంకోర్ట్ తెగేసి చెప్పింది. దేశంలో ఎక్కడైనా ఏ మతం వారైనా, వర్గం వారైనా ప్రదర్శన నిర్వహించుకోవచ్చునని పునరుద్ఘా టించింది. 2017నుంచి ఇలాంటి పథ సంచలనాలు జరుగుతున్నాయి. రాళ్లు విసిరిన ఒక్క ఉదంతం చూపమని బీజేపీ ప్రతినిధి అడిగితే ద్రవిడవాదులు తెల్లముఖాలువేశారు. పీఎఫ్ఐ ఉగ్రవాదసంస్థ అని, అది తప్పుచేసిందనీ ఒప్పుకుంటున్న డీఎంకే ప్రభుత్వం ఆ సంస్థను నిషేధించమని ఏనాడూ అడగలేదు. కానీ ఆర్ఎస్ఎస్ ప్రదర్శన మీద ఆంక్షలు విధించింది. ఇదంతా మైనారిటీలలో ఉన్న ఆధిపత్య భావనను భద్రంగా కాపాడడం కాదా? పీఎఫ్ఐ ఉపయోగించిన తుపాకుల కంటే, స్వయంసేవకులు ధరించే 'దండ'తోనే ఎక్కువ ప్రమాదమని భావించే ఈ చెత్తబుర్రలకు మరమ్మతు తక్షణావసరం.

★

24 ఏప్రిల్ 2023, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**కలల ప్రపంచం**

– వెంకట శివకుమార్ కాకు





రాష్ట్రంలో ఎన్నికల హడావిడి (తెలంగాణ) – 14
ఏపీ బీజేపీకి జవసత్వాలు (వేదిక) – 16
'నాటో'లో లుకలుకలు (అంతర్జాతీయం) – 24
భారతీయ సమైక్యతా మూర్తి ఆదిశంకరులు (ప్రత్యేక వ్యాసం) – 26
అగ్నిదళంలో అతివల ప్రతిభ (మహిళ) – 28
రాహుల్ పొగ... వలసల సెగ (సందర్భం) – 37
మిస్టర్ ఐపీఎల్ ధోనీ (క్రీడ) – 43
నిరాశకు గురిచేస్తున్న దక్షిణాది పాన్ ఇండియా చిత్రాలు (సినిమా) – 50




# సేవ:

ఐదేళ్ల విరామం తరువాత జరిగిన రాష్ట్రీయ సేవా సంగమ్ జాతీయ సదస్సు ఏర్పాట్ల కోసం మార్చి 9న శ్రీకారం చుట్టారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని కేశవ విద్యాపీఠ్ ప్రాంగణంలో భూమిపూజ, వినాయక స్థాపనతో పనులు మొదలైనాయి. సేవా సంగమ్ జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పన్నాలాల్ భన్సాలీ ఆధ్వర్యంలో ఏర్పాట్లన్నీ సమయానికి, సక్రమంగా పూర్తయ్యాయి. జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయనే పాల్గొన్నారు కూడా. ఏప్రిల్ 7,8,9 తేదీలలో ఈ సదస్సు జరిగింది. ఈసారి సంగమ్ సదస్సు నినాదం 'స్వావలంబన భారత్–సుసంపన్న భారత్'.



ఏర్పాట్లు పూర్తయిన తరువాత మార్చి 21న ఢిల్లీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సంగమ్ ఆశయాల గురించి ఇంకాస్త వివరంగా చెప్పారు భన్సాలీ. సమరసత కలిగిన, సమర్థ, స్వావలంబన కలిగిన భారత్ నిర్మాణమే సంగమ్ ఆశయం. ఇందుకోసం రాష్ట్రీయ సేవాభారతి సాయంతో ఇలాంటి సమున్నత ఆశయంతో పనిచేస్తున్న ఇతర సంస్థలను అనుసంధానం చేయడంలో సంగమ్ కీలకంగా వ్యవహరిస్తుంది. కొవిడ్ మహమ్మారి చుట్టుముట్టిన కాలంతో పాటు, దేశం ఎప్పుడు సంక్షోభాలను ఎదుర్కొన్నా రాష్ట్రీయ సేవాభారతి ముందు వరసలో ఉండి సేవలు అందించింది. అలాంటి సంక్షోభాలలో మొదటిగా అవసరమయ్యే ఆహార సరఫరా, మందుల పంపిణీ, ఆర్థిక సాయం చేయడంలో రాష్ట్రీయ సేవాభారతి అగ్రశ్రేణి సంస్థగా వ్యవహరించింది. కొద్దికాలంగా ఆరోగ్యవంతమైన బాలల కోసం పౌష్టికాహారం పంపిణీ అన్న అంశం మీద సేవాభారతి దృష్టి సారించిందని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి రేణు పాథక్ చెప్పారు. ఇక ఏప్రిల్ 7న జైపూర్ సదస్సుకు ఆర్‌ఎస్‌ఎస్ పరమపూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ కూడా హాజరై దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రీయ సేవా సంగమ్ ఆశయం ఏమిటి? ఎలా పనిచేస్తుంది? ఎవరి కోసం పనిచేస్తుంది? జాతి జీవనంలో, ఆ జీవనానికి సంబంధించిన సాంస్కృతిక, సామాజిక గమనంలో కచ్చితమైన మార్పు తేవడంలో కీలకంగా కృషి చేస్తున్న సామాజిక సంస్థలకు సంగమ్ మార్గదర్శనం చేస్తుంది. ఈ పనిలో రాష్ట్రీయ సేవా భారతి ఉపాధ్యక్షులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏప్రిల్ 7న ప్రారంభమైన మూడవ 'రాష్ట్రీయ సేవా సంగమ్'కు రాజస్థాన్ రాజధాని జైపూర్ వేదిక అయింది. జైపూర్ శివార్లలో జామ్‌దోలీలోని కేశవ విద్యాపీఠ్‌లో మూడు రోజుల పాటు సేవాసంగమ్ కార్యక్రమాలు నిర్వహణ తీరుపై విస్తృత సమీక్ష జరిగింది. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 2700 మంది ప్రతినిధులు ఈ అద్భుతమైన సేవాసంగమ్‌లో పాల్గొని నూతనోత్తేజం పొందారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నుంచి స్ఫూర్తిని, అనుభవాన్ని పొందిన వేలాది మంది కార్యకర్తలు దేశవ్యాప్తంగా సుమారు 43 వేల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, వైద్యం, స్వావలంబన, ఆత్మనిర్భరత, వ్యక్తి నైపుణ్యం పెంపొందించడానికి 'సేవాభారతి' సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యకలాపాలు జరుగుతున్నాయి. అనాథ



వేదుల నరసింహం
సీనియర్ జర్నలిస్ట్

"సేవా పరమో ధర్మః"
"మానవ సేవయే మాధవసేవ"
"సేవా వ్రత్ వే అంతర్ మన్ మే సచ్చే కదమ్ బడ్‌తే జాయే।
హర్ ఆంగన్ మే సుఖద్, సుమంగల్, సమరస జీవన్ సరసాయేం"

ఈ గీతంతో 'బాలాసాహెబ్ దేవరస్ సభా మండపం' పులకించిపోయింది. రాష్ట్రీయ సేవా సంగమ్ జాతీయ సదస్సులో పాల్గొన్న 2700 మంది స్వచ్ఛంద సేవకులు హృదయాల నుంచి వచ్చిన పాట అది. సేవను భగవదాదేశంగా భావించే కర్మయోగుల గుండె సవ్వడి అది. సోదర భారతీయుల కోసం, జాతి హితం కోసం జాతీయత పట్ల ఏకాభిప్రాయం కలిగినవారంతా ఈ సదస్సుకు హాజరయ్యారు. ఒకటీ రెండూ కాదు, వందా రెండు వందలు కాదు.. వారంతా చేపట్టి నిర్వహిస్తున్న 43,000 సేవా కార్యక్రమాల గురించి అక్కడ సమీక్ష జరిగింది. ఇంకా ముందుకు వెళ్లి, మరిన్ని సేవా పథకాలు చేపట్టే అవకాశాల గురించి చర్చించారు. అందుకే ఈ సదస్సు అపురూపం, అసాధారణం. అన్ని కార్యక్రమాలు సేవ కోసం సేవ అన్నట్టే జరుగుతున్నాయి. సేవ, దయ, చదువు పేరుతో మత మార్పిళ్లు, కొన్నిచోట్ల వేర్పాటువాద బీజాలు వేసే క్రైస్తవ మిషనరీల వలె కాకుండా దేశం కోసం, జాతీయ భావంతో సాటి భారతీయుల కోసం ఆ సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టాయి. సేవ పేరుతో ఇక్కడి సామాజిక వ్యవస్థకు తూట్లు పొడవడం కాదు. సేవ అంటే ఇక్కడ సాంస్కృతిక విధ్వంసం చేయడం కాదు. సేవ ఇక్కడి కుటుంబ వ్యవస్థను, విశ్వాసాలను పెకలించేది కాదు.

అందుకే పరమపూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ఒక మాట అన్నారు. అది– దేశానికి సేవ అంటే అందులో దేశభద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఉండాలని ప్రతి భారతీయుడు గుర్తించాలి. రాష్ట్రీయ సేవా సంగమ్ ఇదే ఆశయంతో సాగుతున్నది.

# భారతీయ ఆదర్శం

బాలబాలికలకు ఆశ్రమాలు, సేవాబస్తీలలోని బాలబాలికలకు ఉచిత విద్యాబోధన, ఆరోగ్యసేవలు అందిస్తున్నారు. సేవా బస్తీలలోని పిల్లలకు సంస్కారాలు అందించే లక్ష్యంతో బాల సంస్కార కేంద్రాలు నడుస్తున్నాయి. ఆరోగ్యసేవల నిమిత్తం సేవా బస్తీలలో క్లినిక్‌లు, సంచార వైద్యశాలలు నడుపుతున్నారు. ఇలా... సమాజంలోని పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సేవాభారతి సంస్థ కృషి చేస్తున్నది. ఈ సంస్థ ఆధ్వర్యంలో నడిచే సేవా ప్రాజెక్టుల నుంచి ఎంపిక చేసిన ప్రతినిధులు ఈ 'రాష్ట్రీయ సేవా సంగమ్'లో పాల్గొనడం విశేషం.

ఆర్‌ఎస్‌ఎస్ పూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఉజ్జయినిలోని వాల్మీకి ఆశ్రమ నిర్వాహకులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంత్ బాలయోగి ఉమేశ్‌నాథ్ మహరాజ్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు అజయ్ పిరమిల్, నర్సింరాం పులేరియా విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రీయ సేవాభారతి అధ్యక్షులు పన్నాలాల్ బన్సల్, పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబళే, సేవాభారతి మార్గదర్శకులు భయ్యాజీ జోషి తదితర జ్యేష్ఠ ప్రచారకులు మూడు రోజులపాటు జరిగిన వివిధ కార్యక్రమాలల్లో కార్యకర్తలకు



# 'మానవ కల్యాణానికి సేవ ఉత్తమ మార్గం'

– డాక్టర్ మోహన్ భాగవత్

'సేవ' మాధ్యమం ద్వారా 'వసుధైవ కుటుంబకం' అనే కలను సాకారం చేసుకోవచ్చునని, అయితే దీనికోసం కార్యకర్తలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజ వ్యాప్తి కావాలని రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ పూజనీయ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. జంతువులకు, మానవులకూ కూడా 'సంవేదన' ఉంటుందని ఆ 'సంవేదన'… కృత్… కారుణ్యం… సేవ… సమరసతగా మారినప్పుడే సమాజానికి ఉపయుక్తంగా ఉంటుందని డాక్టర్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో హిందూ ఆధ్యాత్మిక సంస్థలు, క్రైస్తవ మిషనరీల కన్నా ఎన్నో రెట్లు ముందుంటున్నాయని ఆయన స్పష్టం చేశారు. రాజస్థాన్ రాజధాని జైపూర్ సమీపంలోని జామ్‌దోలీలో గల కేశవ విద్యాపీఠ్ ప్రాంగణంలో ఏప్రిల్ 7వ తేదీన మూడవ రాష్ట్రీయ సేవా సంగమను డాక్టర్ మోహన్ భాగవత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మిషనరీ సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో ఆసుపత్రులు, విద్యాసంస్థలు నిర్వహిస్తున్నాయి. అయితే హిందూ ధార్మిక సంస్థలు నిస్వార్థంగా, ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వహించటం అభినందనీయం. సేవ ద్వారా ఆరోగ్యకరమైన మనుషులను, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు' అని అన్నారు.




సేవ చేయడానికి 'సంవేదన' చాలా ముఖ్యమని డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించి ప్రపంచాన్ని భావాత్మకంగా ఏకం చేయడానికి సేవామార్గం అత్యుత్తమమైనదని అన్నారు. సజ్జనశక్తిని జాగృతం చేయడం ద్వారా సమాజ కల్యాణానికి కృషి చేయాలని ఆయన సూచించారు. జీ–20 గ్రూపు దేశాల మధ్య సంబంధాలను 'కరణ' ఆధారంగా పటిష్టం చేయవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.

"నా దగ్గర ఏది ఉందో అది అందరిది.. అందరూ నా వారే" అనే భావన ఉన్నప్పుడు ఇతరులను ఆదుకోవడం సులభ సాధ్యమవుతుందని డాక్టర్ భాగవత్ అన్నారు. ఆర్.ఎస్.ఎస్ ప్రారంభం నుంచి సంఘ స్వయంసేవకులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ ఆర్.ఎస్.ఎస్. ప్రారంభానికి ముందు నుంచే సమాజంలో జరిగే అనేక సేవా కార్యక్రమాలలో భాగస్వాములయ్యేవారని గుర్తు చేశారు. ఆయన శతజయంతి సంవత్సరం 1989 నుంచి సేవా కార్యక్రమాలను వ్యవస్థీకరణ చేయడం జరిగిందని చెప్పారు. ఎవరైనా వెనుకబడి ఉంటే అది సమాజానికి మంచిది కాదని అంటూ, సంచార జాతులు స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నాయని, ప్రస్తుతం వారు తగిన చిరునామా, ఓటు హక్కు లేక అనేక అవస్థలు పడుతున్నారని, ఈ వర్గాలకు సేవా కార్యక్రమాల ఫలాలు అందాలని డాక్టర్ మోహన్ భాగవత్ సూచించారు.

**'విశ్వమంగళ సాధన' మన లక్ష్యం కావాలి**

'విశ్వమంగళ' సాధన కోసం మనమంతా కృషి చేయాలని, అందుకు అవసరమైన సద్గుణాలను పెంపొందించుకోవాలని ఏప్రిల్ 8వ తేదీన ప్రతినిధుల సదస్సులో మోహన్‌భాగవత్ సూచించారు. సంఘస్థాన్‌లో మనం ప్రార్థన చేస్తున్నప్పుడు 'విధాయాస్య ధర్మస్య సంరక్షణమ్… పరమ్ వైభవన్ నేతు మేతత్ స్వరాష్ట్రమ్' అని ఆకాంక్షిస్తామని, ఆ దిశగా సమాజాన్ని నడిపించడానికి అందరం కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత పేరు ప్రఖ్యాతుల కోసం ఆశించకుండా నిస్వార్థంగా సమాజానికి సేవచేయడానికి ముందుకు రావాలని డాక్టర్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 9వ తేదీన జరిగిన ముగింపు కార్యక్రమంలో సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబళే ప్రసంగించారు. ★

మార్గదర్శనం చేశారు.

**ఆపన్నులకు అండగా….**

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు తాము నిర్వహిస్తున్న ముఖ్యమైన 'సేవా' కార్యక్రమాల గురించి వివరించారు. ఇతర ప్రతినిధులతో అభిప్రాయాలను కలబోసుకున్నారు. ఒకరి అనుభవాలను మరొకరు పంచుకున్నారు. ఈ సంస్థలు ఒక యజ్ఞంలా దేశంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను పరిశీలిద్దాం–

**మాధవసేవా సమితి, ఉజ్జయిన్**

ఉజ్జయినిలోని 'మహాకాళేశ్వర్'ని దర్శించడానికి ప్రతిరోజు వందల మంది భక్తులు వస్తూ ఉంటారు. వీరందరికి తగిన వసతి కల్పించడానికి 'మహాకాళేశ్వర్ భక్తి నివాస్' నిర్మాణం జరిగింది. అదేవిధంగా మాధవ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం, ఉచిత వైద్య పరీక్షల కేంద్రం, హోమియోపతి మందుల వితరణ, కంటి పరీక్షలు, యోగా కేంద్రం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రాష్ట్రీయ సేవాభారతి కార్యకర్తలు దేశ వ్యాప్తంగా 16,184 విద్యా కేంద్రాలు, 10,513 ఆరోగ్యపరీక్ష, చికిత్సా కేంద్రాలు, 9,543 సామాజిక కేంద్రాలు, 6, 805 ఉపాధి కేంద్రాలు నిర్వహిస్తున్నారు.

**మాతా, శిశు సంరక్షణ కేంద్రం : కొంకణ్ ప్రాంతం, గోవా**

పసిపిల్లలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో కొంకణ్ ప్రాంతంలో మాత శిశు సంరక్షణ కేంద్రాలు నడుపుతున్నారు. ఈ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించటంతోపాటు అవసరమైన వారికి వైద్య పరీక్షలు కూడా నిర్వహించి మందులు అందజేస్తారు.

**వైదేహీ ఆశ్రమం - కిశోరీ వికాస్ కేంద్రం : హైదరాబాద్**

హైదరాబాద్‌లోని వైదేహీ ఆశ్రమంలో అనాథ బాలికలకు విద్య, ఉపాధి కల్పనతోపాటు వివాహాలు కూడా చేయడం విశేషం. కిశోరీ వికాస్ కేంద్రం కార్యకర్తలు ప్రతివారం సేవాబస్తీలలో బాలసంస్కార కేంద్రాలు నడుపుతున్నారు. ప్రతి ఏటా 'రన్ ఫర్ ఛైల్డ్' నిర్వహించడం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువస్తున్నారు.

**వనవాసీ ఉపాధి కల్పనా కేంద్రం : మాల్వా ప్రాంతం**

మాల్వా ప్రాంతంలో గిరిజనులకు ఉపాధి కల్పించడానికి వివిధ వృత్తులలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. విద్యుత్ పరికరాల మరమ్మతులు, కుట్టు శిక్షణ, డ్రైవింగ్‌లో శిక్షణ, పర్యావరణ అనుకూల విగ్రహాల నిర్మాణం, మొబైల్ ఫోన్ల మరమ్మతులు, రాఖీల తయారీ వంటి అనేక వృత్తులలో గిరిజనులకు

# సేవా సంగమ్ అద్భుతం : మీడియా

**ఈ** రాష్ట్రీయ సేవాసంగమ్ అద్భుతంగా జరిగిందని స్థానిక మీడియా పేర్కొంది. మూడురోజులపాటు జరిగిన వివిధ కార్యక్రమాలను జైపూర్ నుంచి వెలువడుతున్న అన్ని పత్రికలు వివరంగ ప్రచురించాయి. అన్ని పత్రికలు ఏప్రిల్ 6,7,8 తేదీలలో ప్రత్యేక సంచికలను ప్రచురించాయి. మీడియాలో వచ్చిన సేవాసంగమ్ వార్తల క్లిప్పింగులను ప్రధాన సభామండం బయట ప్రదర్శించారు.

'అధికార్', 'మహానగర్ టైమ్స్' వంటి దినపత్రికలు ప్రత్యేక సంచికలను ప్రతినిధులకు అందజేయడంతో ఆ వార్తలను చూసి దేశం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు




ఆనందించారు. 'మహానగర్ టైమ్స్' పత్రిక తమ ప్రత్యేక సంచికలలో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలకుల విశేష కృషిని అభినందిస్తూ పూర్తి పేజీ వ్యాసాలను ప్రచురించింది. డాక్టర్ హెడ్గేవార్, బాలాసాహెబ్ దేవరస్ జీ, రాజేంద్రసింహ్‌జీ హయాంలో జరిగిన సంఘ కార్యవిస్తరణను ప్రముఖంగా ప్రచురించింది. సేవా సంగమ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వివిధ ప్రకల్పాల ఛాయాచిత్ర ప్రదర్శనను, ఆయా స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన దేశీయ ఉత్పత్తులపై ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. పర్యావరణ హితమైన ఉత్పత్తుల గురించి ప్రజలకు తెలియజేయడానికి ఇంటర్వ్యూలను తీసుకొని 'బాక్స్ ఐటమ్'లుగా స్థానిక పత్రికలు ప్రచురించాయి. 'ప్రభాత్ అభినందన్', 'జయపూర్ టైమ్స్', 'విరాట్ వైభవ్', 'దైనిక నవజ్యోతి', 'సమాచార జగత్', 'రాష్ట్రదూత్', 'సీమా సందేశ్' తదితర చిన్నా, పెద్ద పత్రికలు రాష్ట్రీయ సేవా సంగమ్‌కు విస్తృత ప్రచారం కల్పించాయి. ఆర్.ఎస్.ఎస్.ను తీవ్రంగా వ్యతిరేకించే 'ది హిందూ', 'హిందూస్తాన్ టైమ్' వంటి పత్రికలు కూడా 'సేవాసంగమ్' వార్తలను ప్రచురించడం విశేషం. జాతీయ, స్థానిక టెలివిజన్ ఛానళ్ళు, సోషల్ మీడియాలో కూడా విస్తృత ప్రచారం లభించింది. ★

శిక్షణ ఇచ్చి వారు ఉపాధి పొందే విధంగా కృషిచేస్తున్నారు.

**జమ్ము-కశ్మీర్** : జమ్ముకశ్మీర్ ప్రాంతంలో సేవాభారతి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పిల్లలకు అవసరమైన ఆరోగ్య టీకాలు వేయిస్తున్నారు. ఈ సంవత్సరం రెండు విడతలుగా చేపట్టిన టీకా కార్యక్రమంలో సుమారు లక్షా 50 వేల మందికి టీకాలు వేశారు.

**స్టూడెంట్స్ ఫర్ సేవా** : అహ్మదాబాద్‌లోని స్టూడెంట్స్ ఫర్ సేవ – ఎస్ఎఫ్ఎస్ సంస్థ యువతరంలో చైతన్యం కలిగించి, వారిని వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తోంది. ఎస్.ఎఫ్.ఎస్ కార్యకలాపాలు అన్ని రాష్ట్రాలకు విస్తరించాయి.

**సమతోల్ ఫౌండేషన్ , ముంబయి**

ముంబయిలోని సమతోల్ ఫౌండేషన్ అనాథ, వీధి బాలలను గుర్తించి వారికి విద్య, వైద్య సేవలు అందిస్తోంది. అనాథ బాలలకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి కోసం బాల సంస్కార కేంద్రాల ద్వారా సంస్కారాలు అందించే కార్యక్రమం చేపట్టింది.

**చేతనా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్- మంగుళూర్**

మంగుళూర్‌లో బాలల మానసిక, విద్య వికాసం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాలలకు విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు సంస్కారాలు అందిస్తున్నారు. కేరళలోని మొబైల్ దహన వాటిక విశేష సేవలను అందిస్తోంది. కొవిడ్ మహమ్మారితో మృతి చెందినవారి దహన సంస్కారాల కోసం ఈ మొబైల్ దహన వాటిక ఏర్పాటు చేశారు. ప్రజలు ఒక్క ఫోన్‌కాల్ చేస్తే ఈ దహన వాటిక వాహనం అక్కడకు చేరుకొని 'గ్యాస్' ఆధారంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తుంది. ప్రస్తుతం కేరళలో ఇటువంటి పది మొబైల్ దహన వాటికలు నిర్వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతంలో మత్స్యకారుల గ్రామాలు అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇలా దేశంలోని అన్ని ప్రాంతాలలో స్థానిక అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమాజంలోని దాతల నుంచే విరాళాలుగా సేకరించడం విశేషం. రాష్ట్రీయ సేవాసంగమ్ విజయవంతం చేయడానికి 820 మంది కార్యకర్తలు అహోరాత్రులు కృషిచేశారు. ప్రతినిధులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి అవసరమైన వసతులు ఏర్పాటుచేయడం ద్వారా అందరి ప్రశంసలు అందుకున్నారు.

ఈ సదస్సు సేవ అనే పదానికి కొత్త తాత్త్వికతను, అర్థాన్ని అందించింది. ఆపన్నులకు సేవ చేయడం భగవంతుని సేవించడంగానే భావించాలని చెప్పింది. మానవ సేవే మాధవ సేవ అన్న మహోన్నత వాక్యంలోని పరమార్థం ఇదే కూడా. త్యాగం, సేవ భారతీయ ఆదర్శాలు అంటారు వివేకానందులు. సేవ కూడా వ్యాపారమైపోతున్న తరుణంలో, సేవ కూడా మాఫియాల చేతులలోకి వెళుతున్న పాడుకాలంలో సేవాభావన గురించి చర్చించుకోవడం తక్షణ కర్తవ్యమే. అది జైపూర్ సదస్సు చేసింది. ★



# ఆకట్టుకున్న ఛాయాచిత్ర ప్రదర్శన

సేవాసంగమ్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ఫొటోలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ప్రదర్శించారు. ఒక ప్రాంతంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు ఇతర ప్రాంతాలవారు తెలుసుకోడానికి ఈ ప్రదర్శన ఉపకరించింది. హనుమత్ జయంతి రోజు, ఏప్రిల్ 6వ తేదీ సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సుధాంశు మహారాజ్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. పూజ్యశ్రీ మహామండలేశ్వర్ స్వామి కేశ్వరానంద్ మహారాజ్, జైపూర్ రాజకుటుంబానికి చెందిన పార్లమెంటు సభ్యులు శ్రీమతి దియాకుమారి, ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ ప్రచారకులు ప్రేమ్‌చంద్ గోయల్, అశోక్ చాగ్లా తదితరులు పాల్గొన్నారు.

సుధాంశు మహారాజ్ మాట్లాడుతూ, 'సేవ' అనే దీపం దేశ వ్యాప్తంగా వెలుగులు ప్రసరించడం అభినందనీయమని పేర్కొన్నారు. లద్దాఖ్ నుంచి దక్షిణాది వరకు అన్ని ప్రాంతాల నుంచి ప్రతినిధులు సేవా సంగమ్‌లో పాల్గొంటున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా 'సేవా' జ్యోతి ప్రజ్వరిల్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆదివాసులు నివసించే ప్రాంతాలలో తాను పర్యటించినప్పుడు వనవాసుల ఆత్మీయత, ధర్మరక్షణ పట్ల వారికున్న చిత్తశుద్ధి గమనించానని చెప్పారు. సంఘ కార్యకర్తలు తను, మన, ధన రూపంలో సమాజ సేవలో పునీతులవుతున్నారని అన్నారు. సేవ చేయడంలోనే భగవంతుని సాక్షాత్కారం లభిస్తుందని అన్నారు. సేవాసంగమ్ లక్ష్యం 'స్వావలంబీ భారత్'ను సాధించడమే. ఈ లక్ష్య సాధనకు అవసరమైన స్ఫూర్తి 'ఛాయాచిత్ర ప్రదర్శన' ద్వారా లభించింది. ★



# తెలుగు రాష్ట్రాల నుంచి 153 మంది

అటు అరుణాచల్‌ప్రదేశ్ నుంచి ఇటు గుజరాత్ వరకు, జమ్ము-కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రతినిధులు సేవా సంగమ్‌లో పాల్గొనడం విశేషం. సేవాభారతి ఆధ్వ ర్యంలో నడుస్తున్న 698 సంస్థల నుంచి మొత్తం 460 మంది మహిళలతో సహా 2408 మంది ప్రతి నిధులు ప్రాతినిధ్యం వహించారు. ఆరోగ్యభారతి, రాష్ట్ర సేవికాసమితి, సక్షమ్, విద్యాభారతి, విశ్వ హిందూపరిషత్, సేవా ఇంటర్నేషనల్, వనవాసి కల్యాణ్ పరిషత్, భారత్ వికాసపరిషత్ వంటి పది హేను సంస్థల ప్రతినిధులు కూడా సేవా సంగమ్‌లో భాగస్వాములయ్యారు. కేరళ ప్రాంతం నుంచి అత్యధికంగా 198 మంది ప్రతినిధులు హాజర య్యారు. తెలంగాణ నుంచి 96 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 57మంది కార్యకర్తలు ఈ భవ్యమైన శిబిరంలో పాల్గొన్నారు. 'రాష్ట్రీయ సేవాసంగమ్' ప్రతినిధులకు స్థానిక కార్యకర్తలు ఇచ్చిన ఆత్మీయ ఆతిథ్యం అబ్బురపరచింది. రైళ్లు, విమానాలలో విచ్చేసిన ప్రతినిధులకు స్వాగతం పలకడం నుంచి వసతి, భోజన సదుపాయాల వరకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతులు, భాషలు కలగలిపిన 'సేవా సంగమ్' అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది. ★



# సర్దార్ వల్లభాయ్ పటేల్ 1948 సెప్టెంబర్ 13నే పోలీసు చర్యకు ఎందుకు నిర్ణయించారు?

**(రాంపల్లి మల్లికార్జునరావు రచించిన 'నైజాం విముక్త స్వాతంత్ర్య పోరాటం - నిప్పులాంటి నిజాలు' పుస్తకం నుంచి)**

1948 సంవత్సరం ఏప్రిల్ మాసంలో ముంబైలో కాంగ్రెస్ అఖిల భారత సమావేశం జరిగింది. స్వతంత్రం ఇంకా పొందని హైదరాబాద్ స్టేట్ నుంచి కాంగ్రెస్ నాయకులు కొండా వెంకటరంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, రాజా పన్నాలాల్ పిట్టీ, మందుముల నర్సింగరావు మొదలైనవాళ్లు అక్కడికి వెళ్లారు. అక్కడ నెహ్రూను కలుసుకొని హైదరాబాదులో జరుగుతున్న అల్లర్లు, వాటి పరిస్థితుల గురించి వివరించి చెప్పారు. హైదరాబాద్ సమస్యను హిందూ ముస్లిం సమస్యగా నెహ్రూ మాట్లాడటం ఆ నాయకులు ఎవరికీ రుచించలేదు. వారు చాలా నొచ్చుకున్నారు. ఈ సమయంలో కె.ఎం.మున్షీ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులకు "మీరు వెళ్లి సర్దార్ వల్లభాయ్ పటేల్‌గారిని కలవండి. వారు పరిష్కార మార్గం చూపించవచ్చు" అని సలహా ఇచ్చాడు. ఆ బృందం పటేల్‌ని కలిసింది. రాబోయే కొద్ది నెలల్లోనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ధైర్యం చెప్పి పంపించాడు పటేల్. అదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టి.

ఎందుకంటే అంతర్గతంగా, బహిర్గతంగా వస్తున్న అనేక రకాల ఒత్తిడులను వమ్ముచేసి తెలంగాణ ప్రజలను రక్షించింది సర్దార్ వల్లభాయ్ పటేల్. నిజాం ప్రభుత్వంపై నిర్ణయం తీసుకునేందుకు కేంద్రం జాప్యం చేస్తున్నవేళ తగిన అవకాశం కోసం పటేల్ వేచి చూసాడు.

**1948 సెప్టెంబర్ 17కి ముందు నిజాం చేసిన రెండు పనులు**

1. హైదరాబాద్ స్టేటును పాకిస్తాన్‌లో కలపాలని సంప్రదింపులకు రంగం సిద్ధం చేసాడు.

2. 1948 ఆగస్టు 21న లాయక్ అలీతో భద్రతామండలిలో భారత్ హైదరాబాద్ స్టేట్‌పై యుద్ధానికి సిద్ధమౌతున్నదని ఫిర్యాదు చేయించాడు.

**సానుకూల పరిణామాలు**

1. ఢిల్లీలో నిజాంకు అత్యంత ఆప్తమిత్రునిగా మెలగుతున్న మౌంట్ బాటెన్ 1948 జూన్ 21న గవర్నర్ జనరల్‌గా దిగిపోయి, లండన్ వెళ్లిపోయాడు. రాజగోపాలాచారి గవర్నర్ జనరల్ అయ్యారు.

2. 1948 ఆగష్టు 3న హైదరాబాద్ స్టేట్‌లో జరుగుతున్న మారణకాండపై కె.ఎం.మున్షీ, హోంశాఖకు రిపోర్ట్ పంపించాడు.


3. హైదరాబాద్ స్టేట్‌లో చోటుచేసుకొంటున్న పరిణామాల నేపథ్యంలో 'నెహ్రూ, రాజగోపాలాచారితో హైదరాబాద్ విషయం నాకు తెలుసు, నేను చూసుకుంటాను అన్న మాటలకు పటేల్ స్పందిస్తూ నాకు కశ్మీర్; హైదరాబాద్; అసలు ముస్లిం స్వభావం నాకు బాగా తెలుసు అని అన్నారు. ఈ విషయాలు నేను చూసుకుంటాను అని అన్నారు. ఆ విషయాన్ని 1948 ఆగష్టు 25న పటేల్ చండీఘడ్‌లో బహిరంగ సభలో మాట్లాడుతూ జునాగఢ్‌కు పట్టినగతే హైదరాబాద్‌కూ పడుతుందని హెచ్చరించారు.

4) హైదరాబాద్‌పై సైనిక చర్య తీసుకొంటే అంతర్జాతీయంగా భారత్‌కు చెడ్డ పేరు వస్తుందేమోనని నెహ్రూ అంటే, పటేల్ దానికి "మనం అధికారంలో ఉన్న దేశంలో ఇంతటి మారణకాండ జరుగుతూ ఉంటే చూస్తూ ఉరకుండలేం" అని స్పష్టంగా చెప్పటమే కాక రక్షణ కమిటీకి రాజీనామా చేసి నాకవుట్ చేసాడు.

తాత్కాలిక గవర్నర్ జనరల్ చక్రవర్తుల రాజగోపాలాచారి సర్దార్‌వల్లభాయ్ పటేల్‌ను ఒప్పించి మళ్లీ చర్చలకు తీసుకొచ్చారు. ఆ రోజే అదే సమయంలో కెనడా దౌత్యాధికారి పండిట్ నెహ్రూను కలిసి రజాకార్ల ద్వారా క్రైస్తవ మహిళలపై చేస్తున్న అత్యాచార వివరాలు తెలియజేశారు. దాని ప్రభావం నెహ్రూపై పడింది. మొత్తం మీద నెహ్రూ అనిష్టతోనే హైదరాబాద్‌పై పోలీసు చర్యకు అంగీకరించారు.

5. ఖాశిం రజ్వీ స్వయంగా వచ్చి వల్లభాయ్ పటేల్‌తో మాట్లాడిన అవాకులు, చవాకులు విన్న వెంటనే ఆలస్యం లేకుండా నిర్ణయం తీసుకొని ఖాశిం రజ్వీ హైదరాబాద్ చేరకముందే భారత సైన్యం రంగ ప్రవేశం చేసింది. ఆ చర్య పేరే ఆపరేషన్ పోలో. అది వల్లభాయ్ పటేల్ ధీర నేతృత్వం.

6. 1948 సెప్టెంబర్ 11న జిన్నా చనిపోయాడు. పాకిస్తాన్ నుండి ఎటువంటి సమస్య వెంటనే వచ్చేందుకు అవకాశం లేదు. ఇట్లా అన్నివైపుల నుండి వచ్చే ఆటంకాలను, లభించిన అవకాశాలనూ అంచనావేసి వాటిని ఎలా అధిగమించాలో, ఉపయోగించుకోవాలో ఆలోచించుకొని సర్దార్ వల్లభాయ్ పటేల్ 1948 సెప్టెంబర్ 13న చర్య మొదలుపెట్టాలని నిర్ణయించాడు. అది పటేల్ స్పష్టత. అందుకే హైదరాబాద్ స్టేట్ స్వతంత్రం పొందటంలో కీలక సూత్రధారి. అసలైన విజేత సర్దార్‌వల్లభాయి పటేల్. ★




**నైజాం విముక్త స్వాతంత్ర్య పోరాటం**
**నిప్పులాంటి నిజాలు**

**రచన:** రాంపల్లి మల్లికార్జునరావు
**ప్రతులకు : సాహిత్యనికేతన్**
3-4-852, కేశవనిలయం,
హైదరాబాద్-500027
ఫోన్ : 27563236
**సాహిత్యనికేతన్,** గవర్నర్‌పేట,
ఏలూరు రోడ్, విజయవాడ- 250002
దూరవాణి : 6303541244
**వెల:** రూ.100/-, **ప్రతులు:** 104

# కుర్చీ కోసం కుమ్ములాట!

**ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీలో భయంకర సంక్షోభం తలెత్తింది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ మధ్య భగ్గుమన్న అగ్ని ఆ పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారింది, నిజానికి, 2018 ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ఎన్నికలకు సారథ్యం వహించిన పైలట్‌ను కాదని, అశోక్ గెహ్లాట్‌ను ముఖ్య మంత్రిని చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అధిష్టానాన్ని చిక్కులోకి నెట్టివేసింది. అధిష్టానం నిర్ణయం పర్యవసానంగా మొదలైన కిస్సా కుర్సీకా ఖేల్.. చివరకు కాంగ్రెస్ ఖేల్ ఖతం అయ్యే స్థితికి చేర్చిందని పరిశీలకులు అంటున్నారు. ముఖ్యమత్రి గెహ్లాట్, ఆయన అంతర్గత ప్రత్యర్థి సచిన్ పైలట్, మధ్య తాజాగా రగిలిన వివాదం రేపటి అసెంబ్లీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది.. ముఖ్యంగా, ఆ రాష్ట్ర సర్కార్ పైలట్ సీట్లో కూర్చోవాలన్న సచిన్ పైలట్ కల నెరవేరుతుందా? అనేది ఆసక్తికర చర్చగా మారింది.**

రాజస్థాన్ అసెంబ్లీకి ఈ సంవత్సరం చివర్లో (నవంబర్, డిసెంబర్ నెలల్లో) లేదా అంతకంటే ముందుగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అంటే ఎన్నికలకు ఇంకా నిండా ఎనిమిది నెలల సమయం కూడా లేదు. మరోవంక ప్రధాన పతిపక్షం బీజేపీ ఇప్పటికే ఎన్నికల కసరత్తు ప్రారంభించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా ఇతర కీలక నేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. బూత్ స్థాయి నుంచి కార్యకర్తలను ఎన్నికలకు సిద్దం చేస్తున్నారు. ఈ వ్యాసం రాసే సమయానికి హోం మంత్రి అమిత్ షా రాజస్థాన్ పర్యటనలో ఉన్నారు. భరత్‌పూర్‌లో బూత్ ప్రెసిడెంట్ సంకల్ప సమ్మేళనంలో పాల్గొన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఇదే సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీలో మరో యుద్ధానికి తెరలేచింది. మరో 'వార్' మొదలైంది. కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు, గ్రూప్ రాజకీయాలు కొత్తకాదు. ముఖ్యంగా రాజస్థాన్ విషయంలో అయితే గత నాలుగు సంవత్సరాలుగా గెహ్లాట్, పైలట్ వర్గాల మధ్య నిత్య సంఘర్షణ డైలీ సీరియల్' గా నడుస్తూనే వుంది.

అవును, కథ పాతదే...'కిస్సా కుర్సీకా' కహానీ. గత నాలుగు సంవత్సరాలుగా వివిధ దశల్లో, వివిధ రూపాల్లో నడుస్తున్న నాటకమే, ఇప్పుడు మరో రూపంలో తెరమీదకు వచ్చింది. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, మాజీ ఉప ముఖ్యమంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు సచిన్ పైలట్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటుంది. ఇదేమీ రహస్యం కాదు. ఆ ఇద్దరి మధ్య గల శత్రుమిత్ర సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఒకరిని ఒకరు అనని మాట లేదు. ఒకరిపై ఒకరు చేయని ఆరోపణ లేదు. అశోక్ గెహ్లాట్ అయితే, సొంత పార్టీకి చెందిన పైలట్‌ను 'ద్రోహి' అని దూషించారు. అదే మాటను పైలట్ ఇంకో భాషలో అన్నారు.

నిజానికి, గడచిన నాలుగు సంవత్సరాలలో ఆ ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలు అనేకం పతాక శీర్షికలకు ఎక్కాయి. ఒకటి రెండు సందర్భాలలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం అంచుల వరకు వెళ్లి వచ్చింది. ఇలా ఇద్దరి మధ్య విభేదాలు తెరపైకొచ్చిన ప్రతి సందర్భంలోనూ కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకుంది. అయినా,ప్రతి సందర్భంలోనూ గెహ్లాట్ దే పై చేయి అయింది. కారణాలు ఏవైనా అన్ని సందర్భాలలో అధిష్టానం గెహ్లాట్‌కే జై కొట్టింది. చివరకు, కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల సంద ర్భంగా గెహ్లాట్ అధిష్టానం దూతలను (అందులో ప్రస్తుత పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూడా ఆన్నారు) అవమానించి పంపినా ఆయనపై చర్యలు తీసుకునే సాహసం అధిష్టానం (సోనియా, రాహుల్) చేయలేక పోయింది. గెహ్లాట్‌కు పార్టీఅధ్యక్ష బాధ్యత, పైలట్‌కు ముఖ్యమంత్రి బాధ్యత అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానం గత ఏడాది నిర్ణయించింది. గెహ్లాట్ అందుకు ఓకే అంటూనే తెరవెనుక చక్రం తిప్పారు. ఆఖరు నిమిషంలో గెహ్లాట్ ఎమ్మెల్యేల్లో తిరుగుబాటు జెండాఎగరేశారు. మెజారిటీ ఎమ్మెల్యేలు అధిష్టానం నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో అధిష్టానం లొంగక తప్పలేదు. గెహ్లాట్ వర్గం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలన్న పైలట్ డిమాండ్ కూడా నెరవేరలేదు. ఇదిగో అదిగో అంటూ చివరకు ఆ ఉదంతానికి ముగింపు పలికింది.

అందుకే ఇప్పుడు ఎన్నికలముందు పైలట్ ముఖ్య మంత్రి అశోక్ గెహ్లాట్‌పై మరోమారు యుద్ధం ప్రకటించారు. గత బీజేపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వసుంధర రాజే ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలన్నది ఆయన డిమాండే అయినా, లక్ష్యం ముఖ్య మంత్రి గెహ్లాట్ అనేది వేరే చెప్పనక్కరలేదు. అవును. గేహ్లాట్ టార్గెట్ గానే పైలట్ మిస్సైల్ ఫైర్‌చేశారు. పార్టీ అధిష్టానం హెచ్చరికలను బేఖాతారు చేస్తూ, ముందు ప్రకటించిన విధంగా, ఏప్రిల్ 11న తమ మద్దతుదారులతో కలిసి ఒక రోజు నిరశన దీక్షకు కూర్చున్నారు.




గత ప్రభుత్వ అవినీతిపై దర్యాప్తు జరిపిస్తామని హామీఇచ్చి అధికారంలోకివచ్చిన కాంగ్రెస్, ఆ ఊసేత్త కుండా రేపటి ఎన్నికల్లో ఏ ముఖంతో ప్రజల ముందుకు పోగలదని సచిన్ ప్రశ్నిస్తున్నారు. కానీ, నాలుగేళ్లతర్వాత, ఎన్నికలు తరుము కొస్తున్న సమయంలో పైలట్ రోడ్డెక్కడం ఏమిటీ? ఎందుకు? అంటే...అదేమీ బ్రహ్మరహస్యంకాదు. గెహ్లాట్‌ను ఆయనను వెనకేసుకువస్తున్న పార్టీ అధి ష్టానాన్ని ఇరకాటంలోకి నెట్టేందుకు పైలట్ వ్యూహాత్మకంగా పావులుకదుపుతున్నారని వేరే చెప్పనక్కరలేదు.

గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలను అస్త్రాలుగా చేసుకుని గెహ్లాట్‌ను ఆత్మరక్షణలోకి నెట్టే వ్యూహంతోనే పైలట్ పావులు కదుపుతున్నారు. గెహ్లాట్ తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే, గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించేందుకు భయపడుతున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. గెహ్లాట్ అవినీతిని ఎండగట్టేందుకు సచిన్ బీజేపీ భుజాలపై తుపాకీ పెట్టి గెహ్లాట్‌కి గురి పెడుతున్నారు.

**విజేత పైలట్**

ఇంతకూ ముందే అనుకున్నట్లు గెహ్లాట్, పైలట్ మధ్య యుద్ధం ఇప్పుడు కొత్తగా మొదలైంది కాదు. 2018 ఎన్నికలలో హస్తం పార్టీ విజయం సాధించినప్పటి నుంచీ వారిద్దరి మధ్య కిస్సాకుర్సీకా.. ఆటసాగుతూనే ఉంది. నిజానికి, ఆ ఎన్నికల్లో గెలిచింది కాంగ్రెస్ అయినా గెలిపించిన వ్యక్తి పైలట్. ఎన్నికలకు ముందు ఐదేళ్లు రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పైలట్ అహోరాత్రులు శ్రమించారు. ఆ ఐదేళ్లలో పార్టీ బరువు బాధ్యతలు మొత్తం తన భుజాలకు ఎత్తుకున్నారు. పార్టీ అధికారికంగా ప్రకటించకపోయినా, కాబోయే ముఖ్యమంత్రి పైలట్ అనే ప్రజలు భావించారు. ప్రజలు ఆయనకే ఓటేశారు. అయితే, ఫలితాలు వచ్చిన తర్వాత సీన్ మారిపోయింది. పైలట్ కట్టిన కోటలో గెహ్లాట్ కుర్చీ ఎక్కారు. పైలట్ ఉప ముఖ్యమంత్రి కుర్చీకే పరిమితమయ్యారు. అది కూడా అట్టే కాలం నిలవలేదు. గెహ్లాట్ పొమ్మనకుండానే పొగపెట్టడంతో పైలట్ తిరుగుబాటు జెండా ఎగరేశారు. క్యాంపు రాజకీయాలు నడిపారు. అయితే, గెహ్లాట్ ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని మెజారిటీ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకున్నారు. పైలట్ ఫ్లైట్ చాలావరకు ఖాళీ అయింది. కేవలం 10–15మంది ఎమ్మెల్యేలు మాత్రం ఆయన క్యాంపులో మిగిలారు. సంఖ్యాబలం లేక పైలట్ చతికిల పడ్డారు. అన్నిటినీ మించి పార్టీ అధిష్టానం, గెహ్లాట్ కొమ్ము కాయడంతో పైలట్‌పై పోరులో ఆయన పైచేయి సాధిస్తున్నారు. పైలట్ ఎప్పటికప్పుడు ఓడిపోతు న్నారు.

ఇప్పుడు కథ క్లైమాక్స్‌కు చేరిందని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగి లాభం లేదని సచిన్ పైలట్



**రాజనాల బాలకృష్ణ**
**సీనియర్ జర్నలిస్ట్**

**ఇప్పుడు బంతి పైలట్ కోర్టులో ఉందని ఆయన ఇప్పటికైనా అటోఇటో తేల్చుకోలేక పోతే చివరకు ఎటూ కాకుండా పోతారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అందుకే పైలట్ కాంగ్రెస్ చేయి వదిలి, సొంత మార్గం ఎంచుకోవడమే ఉత్తమం అనే మాట వినిపిస్తోంది. అదే సమయంలో పైలట్ బీజేపీలో చేరతారా? లేక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో చేయి కలుపుతారా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే, గుజ్జర్ ఓట్లకు గురి పెట్టి హనుమాన్ బెనివాల్ పార్టీ, బీఎస్పీ, ఎన్సీపీలతో జతకట్టే ఆలోచన కూడా ఉన్నదని అంటున్నారు.**

కొంచెం చాలా ఆలస్యంగానే అయినా నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరోమారు పాత ట్రిక్ ప్లే చేసేందుకు ఎత్తులు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. చర్చల పేరుతో కాలయాపన చేసి వేడి చల్లార్చేందుకు, సమస్య పరిష్కారానికి పార్టీ ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా చర్చలు జరపాలని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సుఖ్‌జిందర్ సింగ్ రణధవా నిర్ణయించారు. 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన పైలట్‌పై క్రమశిక్షణ చర్యలు తప్పవని దీక్షకు ముందు హెచ్చరించిన అధిష్టానం, ఇప్పుడు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని చెప్పడం సమస్యను పక్క దారి పట్టించే ఎత్తుగడగా భావిస్తున్నారు. అలాగే, గత అనుభవాలను బట్టి చూస్తే, హోంమంత్రి అమిత్ షా అన్నట్లు, పైలట్ క్షేత్ర స్థాయిలో ఎంతగా కష్ట పడినా కాంగ్రెస్ పార్టీ 'ఖజానా' నింపడంలో ఆయన గెహ్లాట్‌తో పోటీపడలేక పోతున్నారు. అందుకే, అధిష్టానం ఎప్పుడు గెహ్లాట్ పక్షం వహిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అధిష్టానం గెహ్లాట్ జోలికి రాదని, రాలేదని ఆయన వర్గం ధీమాగా వుంది. అందుకే ఆయన వర్గీయులు, మళ్లీ గెహ్లాటే ముఖ్యమంత్రి అభ్యర్థి అని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మరోవంక, ఇప్పుడు బంతి పైలట్ కోర్టులో ఉందని ఆయన ఇప్పటికైనా అటోఇటో తేల్చుకోలేక పోతే చివరకు ఎటూ కాకుండా పోతారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అందుకే పైలట్ కాంగ్రెస్ చేయి వదిలి, సొంత మార్గం ఎంచుకోవడమే ఉత్తమం అనే మాట వినిపిస్తోంది. అదే సమయంలో పైలట్ బీజేపీలో చేరతారా? లేక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో చేయి కలుపుతారా? అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే, గుజ్జర్ ఓట్లకు గురి పెట్టి హనుమాన్ బెనివాల్ పార్టీ, బీఎస్పీ, ఎన్సీపీ లతో జతకట్టే ఆలోచన కూడా ఉన్నదని అంటున్నారు.

అదలాఉంటే, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోమారు పతాక స్థాయికి చేరిన నేపథ్యం, అసలు కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందా? అంటే, అది అయ్యే పనికాదని అంటున్నారు. పైలట్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతారా? లేదా అనే విషయంతో సంబంధం లేకుండా, ఈసారి ఎన్నికల్లో హస్తం పార్టీకి ఎదురు గాలి తప్పదని అంటున్నారు. ఇక ఇప్పుడు పైలట్ చేయి వదిలి సొంత నిర్ణయం తీసుకుంటే, కాంగ్రెస్ పార్టీ మరింతగా నష్టపోతుందని, అదే సమయంలో పైలట్ పార్టీలో కొనసాగినా, అసమ్మతి రాజేసినా లేక మరో పార్టీలో చేరినా రాజస్థాన్ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీగానే మూల్యం చెల్లించవలసి వస్తుందని అంటున్నారు.

**పైలట్ నంబరు రాదు**

ఈ నేపథ్యంలో రాజస్థాన్ కాంగ్రెస్ పార్టీలో సాగుతున్న బీ ఇంటర్నల్ ఫైట్' నేపథ్యంగా, సచిన్ పైలట్ ఏ సాకుతో ధర్నా చేసినా, ఆయన నంబర్ మాత్రం రాదంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయని పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నంత వరకు సచిన్ పైలట్ ఫ్లైట్ ఓ జీవిత కాలం లేటుగా నడుస్తుందని చమత్కరిస్తున్నారు. అదలాఉంటే, రాష్ట్రంలో క్షేత్ర స్థాయి పరిస్థితిని గమనిస్తే, అంతర్గత కుమ్ములాటలతో పాటుగా, గెహ్లాట్ 3–డి(దంగే, దుర్వ్యహార్, దళిత అణచివేత) ప్రభుత్వంపట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని పరిశీలకులు అంటున్నారు. అందుకే, రానున్న రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి మూడింట రెండొంతుల ఆధిక్యత లభిస్తుందనే విశ్వాసంతో ఉన్న అమిత్‌షా, కాంగ్రెస్ నాయకులు అనవసరంగా ఆరాట పడుతున్నారని చురక వేశారు. నిజానికి ఏ విధంగా చూసినా రేపటి రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది కమలం, ఓడేది హస్తం అంటున్నారు.

**చివరగా ..**

రాజస్థాన్ ప్రభుత్వాన్ని పైలట్‌గా ముందుండి నడిపించాలన్న సచిన్ ఆశ నెరవేరుతుందో లేదో ఇప్పటికిప్పుడే చెప్పలేం. కానీ ఒకటి మాత్రం నిజం. కాంగ్రెస్ గనక ఈసారి ఆయన లేకుండా ఎన్నికల బరిలోకి దిగితే 2013లో వచ్చిన 21 సీట్లు కూడా రాకపోవచ్చనేది విశ్లేషకుల అంచనా. ★




# రాష్ట్రంలో ఎన్నికల

**తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మండే ఎండలతో పాటు రాజకీయంగానూ వేడి మొదలయ్యింది. ఎన్నికల కమిషన్ కూడా పోలింగ్ కోసం సన్నద్ధమవుతోంది. ఎన్నికల వ్యవస్థ కార్యాచరణలో నిమగ్నమయ్యింది. అసెంబ్లీ ఎన్నికలకు అవసరమైన చర్యలు తీసుకునే క్రమంలో తొలి భేటీ జరిగింది.**

ఈ ఏడాది చివర్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంపై దృష్టిసారించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని రాష్ట్రానికి పంపించింది. డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ నేతృత్వంలోని ఈసీ బృందం ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌తో పాటు.. ఇతర అధికారులతో సమావేశం అయ్యింది. ఈవీఎంల సన్నద్ధత, తనిఖీ, ఓటర్ల జాబితాలో చేర్పులు, అధికారులకు శిక్షణ తదితర అంశాలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ, సిబ్బంది శిక్షణపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం పలు కీలక సూచనలు చేసింది. జిల్లా స్థాయి ఎన్నికల అధికారులకు రెండ్రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించింది. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పింది. రిటర్నింగ్ అధికారుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించింది. వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని కూడా సూచించింది. రిటర్నింగ్ అధికారులు వచ్చే నెల నుంచే అంటే.. మే ఒకటో తేదీ నుంచే ఈవీఎంలను తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఎన్నికలలో పోలింగ్ శాతాన్ని పెంచడానికి ఇప్పటినుంచే ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ నుండి ఈవీఎంల మొదటి దశ పరీక్ష చేపట్టి, ఆయా జిల్లాలకు పంపించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**దూకుడు పెంచిన బీజేపీ**

మరోవైపు.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే రాజకీయ పార్టీలు సమరానికి సై అంటున్నాయి. ఎలాగైనా మూడోసారి విజయం సాధించాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతూంటే, అధికార బీఆర్ఎస్‌ను గద్దించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు.. కాంగ్రెస్ పార్టీ కూడా శత విధాల ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఈ సమయంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. తెలంగాణ ప్రజలు బీజేపీకి అనుకూలంగా ఉన్నారని అమిత్ షా అభిప్రాయ పడ్డారు. 2024లో జరగనున్న పార్లమెంటు ఎన్నికల కోసం ఆయన ప్రచారాన్ని దక్షిణ గోవాలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 16న పనాజీలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రసంగంలో తెలంగాణ ప్రజల మనోభావాలను ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకొంది. అంతేకాదు, ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ఒడిశాలోనూ ప్రజలు బీజేపీకే అనుకూలంగా ఉన్నారని తెలిపారు. వచ్చే నెలలో కర్ణాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ గోవా, ఉత్తరాఖండ్ వంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రమే విజయం సాధిస్తోందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. అలాంటి వ్యాఖ్యలు చేసి చిన్న రాష్ట్రాలను అవమానపరచవద్దని అన్నారు. రాహుల్ ప్రచారం చేసినప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాల్లో ఉన్న మైనార్టీ ఓట్ల ఆధారంగా వాటిని కంచుకోటలని కాంగ్రెస్ భావిస్తూ వచ్చిందని, కానీ అక్కడి ప్రజలు భద్రత, శాంతి, అభివృద్ధిని కోరుకుంటున్నారని చెప్పారు.

పనాజీ సభలో అమిత్‌షా ప్రత్యేకంగా తెలంగాణ గురించి ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. దక్షిణాదిలో ఒక్కొక్కటిగా రాష్ట్రాలను కైవసం చేసుకొని కాషాయ జెండాలు ఎగురవేయాలని బీజేపీ గత ఎన్నికలు ముగిసినప్పటి నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా తొలుత

సుజాత గోపగోని, 6302164068

# హడావిడి

తెలంగాణపై దృష్టిపెట్టింది. పలు పర్యాయాలు జాతీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించారు కూడా. ఇప్పటికీ తరచూ పర్యటిస్తూనే ఉన్నారు. అంతేకాదు.. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలను సైతం హైదరాబాద్‌లో నిర్వహించి.. ఆ పార్టీ కార్యకర్తలకే కాదు.. తెలంగాణ ప్రజలకు కూడా ఓ సంకేతాన్ని ఇచ్చారు.

**త్రిముఖ పోటీ**

రాష్ట్ర రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకుంటే.. గత ఎన్నికల్లో రెండు పక్షాల మధ్య జరిగిన పోటీ ఈసారి మూడు పార్టీల మధ్య హోరాహోరీగా సాగనుంది. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ రెండోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకుంది. అప్పుడు అధికార టీఆర్ఎస్, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఆ తర్వాత టీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారి బీఆర్ఎస్‌గా పేరు మార్చుకుంది. ఈ నాలుగేళ్లలో చోటు చేసుకున్న మార్పులు, రాజకీయ పరిణామాలతో బీజేపీ ముందుకు దూసుకొచ్చింది. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం, జాతీయ పార్టీ నాయకత్వం ప్రత్యేకంగా తెలంగాణపై దృష్టి పెట్టడం, ఏం జరిగినా, బీజేపీకి ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా వెంట వెంటనే స్పందించడం.. రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, రాష్ట్ర కేడర్‌కు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయడం వంటి పరిణామాలతో బీజేపీ రెండో స్థానంలోకి దూసుకొచ్చింది. కాంగ్రెస్ గ్రాఫ్ గతంలో కంటే తగ్గిందని, తిరోగమనంలో పడిపోయిందని ఆ పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి.

తాజా పరిణామాల నేపథ్యంలో షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు జరుగుతాయనే అభిప్రాయంతో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటి నుంచే ప్రచార పర్వానికి తెర లేపాయి. ఎన్నికల మేనిఫెస్టోలో కనిపించే తరహా హామీలను ప్రజలకు ఇస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరుతో ప్రజల భాగస్వామ్యంతో ఆందోళనలు, నిరసనలు నిర్వహిస్తున్నాయి. ప్రజల మధ్యనే ఉండాలని మూడు పార్టీలు నిర్ణయం తీసుకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు వివిధ వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాన్ని ఏకరువు పెడుతున్నాయి. మూడు పార్టీల మధ్య పోటాపోటీ ప్రచారం, విమర్శల పర్వం ఊపందుకుంది. ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని అధికార పార్టీ భావిస్తోంది. వార్షిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపులకు అనుగుణంగా పథకాల వారీగా నిధుల విడుదలపై ఇప్పుడు దృష్టి పెట్టింది. ఆర్థిక వనరుల సమీకరణ కోసం పడరాని పాట్లు పడుతోంది. మరోవైపు.. విపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ సైతం వ్యూహ ప్రతివ్యూహాలతో జనంలోకి వెళ్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని కుటుంబ పాలన, అవినీతి అంశాలతో బీజేపీ విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ బీఆర్ఎస్ తొలుత దృష్టి పెట్టేది ఆత్మీయ సమ్మేళనాలపైనే. ఉపఎన్నికల సమయంలోనూ కుల సంఘాలతో విడివిడిగా ఆత్మీయ సమ్మేళనాలు పెట్టి భవనాల నిర్మాణానికి వ్యక్తిగతంగా, పార్టీ తరఫునా ఆర్థిక సాయం చేస్తామంటూ సీనియర్ లీడర్లు రంగంలోకి దిగి హామీ ఇస్తుంటారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ తనదైన శైలిలో పార్టీ కార్యకర్తలతో సెగ్మెంట్ల వారీగా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తోంది. అసంతృప్తి, అసమ్మతి నెలకొన్న చోట వెంటనే వారికి కొన్ని హామీలు ఇచ్చి సర్దిజెప్పే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో పార్టీలో లుకలుకలు లేకుండా చేసుకోవడమే లక్ష్యంగా ఇవి జరుగుతున్నాయి. గ్రూపులు, వర్గాలతో జరిగే నష్టాన్ని నివారించుకోవడంలో భాగంగా తొలి దశలో ఇవి జరుగుతున్నాయి. వీటికి కొనసాగింపుగా రానున్నకాలంలో కుల సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు జరగనున్నాయి. భారీ బహిరంగసభలద్వారా విస్తృతంగా జనసమీకరణ చేసి పార్టీకి తగిన బలం ఉందనే అంశాన్ని ప్రజల్లోకి పంపే ప్రయత్నాలు ముమ్ముందు జరగనున్నాయంటున్నారు బీఆర్ఎస్ నేతలు.

**పటిష్ట వ్యూహంతో ముందుకెళ్తోన్న కమలం**

భారతీయ జనతా పార్టీ కార్యాచరణ చూస్తే.. ప్రతీ గ్రామాన్ని టచ్ చేసే విధంగా స్ట్రీట్ కార్నర్ మీటింగులను నిర్వహిస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ ఓటు బ్యాంకును కైవసం చేసుకోడానికి బూత్ సశక్తీకరణ్ అభియాన్ పేరుతో ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టింది. గతంలో ఎన్నడూ లేనంతగా మూడు వారాల వ్యవధిలోనే 11 వేలకు పైగా స్ట్రీట్ కార్నర్ మీటింగులను పెట్టింది. తన సొంత బలం ఏ మేరకు ఉన్నదో స్వయంగా పరీక్షించుకుంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ కూడా ప్రజల్లోకి వెళ్లడానికి ప్రజా సంగ్రామ యాత్రను ఐదు దశల్లో నిర్వహించారు. మిగిలిపోయిన సెగ్మెంట్లలో దీన్ని ఆరవ విడతగా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.



నిరుద్యోగులకు ప్రభుత్వం పట్ల ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకునేందుకు నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని వరంగల్‌లో నిర్వహించారు. దీనిని మిగిలిన ఉమ్మడి జిల్లాల్లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. కుటుంబ పాలన, అవినీతి, హామీల వైఫల్యం, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ లాంటి అంశాలతో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు ప్లాన్ చేసింది. ఆ దిశగా దూసుకెళ్తోంది కూడా.

ఇక, కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. తొలుత భారత్ జోడోయాత్ర, ఆ తర్వాత హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పేరుతో రాష్ట్రంలో పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో పాదయాత్రలు జరిగాయి. పార్టీ లీడర్లు విడిగా పీపుల్స్ మార్చ్ పేరుతో పాదయాత్రలు చేస్తున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క పాదయాత్రలతో పలు నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**పనాజీ సభలో అమిత్‌షా ప్రత్యేకంగా తెలంగాణ గురించి ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. దక్షిణాదిలో ఒక్కొక్కటిగా రాష్ట్రాలను కైవసం చేసుకొని కాషాయ జెండాలు ఎగురవేయాలని బీజేపీ గత ఎన్నికలు ముగిసినప్పటి నుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా తొలుత తెలంగాణపై దృష్టిపెట్టింది. పలు పర్యాయాలు జాతీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించారు కూడా. ఇప్పటికీ తరచూ పర్యటిస్తూనే ఉన్నారు. అంతేకాదు.. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలను సైతం హైదరాబాద్‌లో నిర్వహించి.. ఆ పార్టీ కార్యకర్తలకే కాదు.. తెలంగాణ ప్రజలకు కూడా ఓ సంకేతాన్ని ఇచ్చారు.**



# ఏపీ బీజేపీకి జవసత్వాలు

రాష్ట్రంలో వచ్చే ఏడాది జరిగే ఎన్నికల లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతానికి కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు అందిస్తున్న చేయూత, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, వైసీపీ, టీడీపీ కుటుంబపాలన, అవినీతి రాజకీయాలను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీని శక్తిమంతం చేయనుంది.

ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసీపీ ఓటమి ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తెలియ చేస్తోంది. తెలుగుదేశం పార్టీ కూడా ప్రాంతీయ పార్టీ కావడం, వైసీపీ మాదిరిగానే ఇది కూడా అవినీతి ఆరోపణలు, కుటుంబ వారసత్వ రాజకీయాలతో ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది. ఇలా ఏర్పడిన రాజకీయ శూన్యతను బీజేపీ ఉపయోగించు కోనుంది. రెండు పార్టీల వ్యవహారంతో దగా పడి, నిరుత్సాహానికి గురైన రాష్ట్ర ప్రజలకు నేనున్నానని దగ్గరకు చేర్చుకుని సాంత్వన కలిగించనుంది. ఇలా ప్రజలకు దగ్గరై 2024 ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచు కోవడం ద్వారా ఏపీ రాజకీయాల్లో ప్రధాన భూమిక నిర్వహించనుంది. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా పార్టీ కార్యక్రమాలు అమలు చేస్తోంది. మేధావులు, ప్రముఖులతో చర్చలు, పార్టీ గురించి మాట్లాడటం, చేరికలకు ప్రోత్సాహం, బూత్‌స్థాయి వరకు పార్టీ బలోపేతం, ప్రచార కార్యక్రమాలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు, ఉద్యమాలు చేయడం ద్వారా ప్రజల మద్దతు పొందేలా కార్యక్రమాల రూపొందించారు.

మేధావులు, ప్రముఖుల చేరికను ప్రోత్సహించేలా బీజేపీలోకి కార్యక్రమాలు అమలు చేస్తోంది. వారిని ఆకర్షించేలా పార్టీ చరిత్ర, పరిణామక్రమం, అభివృద్ధి, రాష్ట్రాలు, కేంద్రంలో అధికారస్థాపన, స్వచ్ఛమైన పాలన, అభివృద్ధి వంటివి వారికి వివరిస్తుంది. బీజేపీ నేడు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయవాదం, పేదల సంక్షేమం, భారతీయ సాంస్కృతిక విలువల పరిరక్షణ, పారదర్శకతను అమలుచేస్తూ, ప్రోత్సహిస్తూ రాజకీయాలు చేస్తోంది. పార్టీ నేడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, 18 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా ఎదిగింది. కేంద్రం సహా చాలా రాష్ట్రాల్లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉన్నాయి. బలమైన, నిజాయతీ గల నాయకత్వం, జాతీయవాద ఆలోచనలు, పేదల సంక్షేమం కోసం కార్యక్రమాలతో బీజేపీ దేశాన్ని సమర్థంగా పాలించే స్థాయికి ఎదిగింది. తొమ్మిదేళ్లుగా దేశంలో అభివృద్ధి కొనసాగుతోంది.

**బీజేపీ ఆవిర్భావం నుంచి రాజకీయాల్లో జాతీయ వాదాన్ని స్థాపించడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉంది. పోలింగ్ బూత్ నుంచి జాతీయ అధ్యక్షుని ఎన్నిక వరకు ప్రజాస్వామ్యాన్ని అనుసరించడం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనేది పార్టీ సంకల్పం.**

బీజేపీ ఆవిర్భావం నుంచి రాజకీయాల్లో జాతీయవాదాన్ని స్థాపించడం ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉంది. పోలింగ్ బూత్ నుండి జాతీయ అధ్యక్షుని ఎన్నిక వరకు ప్రజాస్వామ్యాన్ని అనుసరించడం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనేది పార్టీ సంకల్పం. సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ ద్వారా పేదలను ఉద్ధరించడం, వివక్ష లేకుండా వారి వారి ఆరాధన విధానాలను అనుసరించడం, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అనే సూత్రానికి కట్టుబడి ఉండటం పార్టీ లక్ష్యం. ఈ అంశాలన్నిటినీ వివరించడం ద్వారా మేధావులను ఆకర్షించడం ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా పార్టీ వైపు ఆకర్షితులై ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. ఆయన దేశంలో మొదటగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేసిన ముఖ్యమంత్రి కాగా, ఆ విధానాన్ని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. పాలన పట్ల అనుభవం ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి సలహాలు, సూచనలను ఉపయోగించుకుని పార్టీని బలోపేతం చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు.

### విస్తృత ప్రచారం

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజ పథకం, నదుల అనుసంధాన ప్రాజెక్టు, ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి సర్వశిక్షా అభియాన్... వంటివి పేదల అభ్యున్నతికి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ సంకల్పానికి ఉదాహరణలు. అలాగే పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించడం ద్వారా వారిలో పార్టీ పట్ల అవగాహన కలిగించేలా ప్రచారం చేస్తారు. ముఖ్యంగా విభజిత




వల్లూరు జయప్రకాష్ నారాయణ
ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ లక్షల కోట్ల నిధులు సాయం అందిస్తున్నారు. లోటు బడ్జెట్‌ను పూరించడమే కాక, రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను అందచేస్తున్నారు. లక్షల కోట్లతో జాతీయ రహదారులను నిర్మిస్తున్నారు. ఫ్లైఓవర్లు, వంతెనలు, కల్వర్టులు, రింగ్ రోడ్లు నిర్మిస్తున్నారు. నూతన రైల్వే లైన్లు వేస్తున్నారు. సముద్ర రవాణా ప్రోత్సాహానికి పోర్టులు అభివృద్ధి చేస్తున్నారు. మత్స్యరంగ అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. జాతీయ విద్యా సంస్థలను నిర్మించారు.

పారిశ్రామికాభివృద్ధికి విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను, చెన్నై – బెంగుళూరు కారిడార్‌ను అమలు చేస్తున్నారు. పారిశ్రామిక నోడ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. భారత్ సొంతగా చేపట్టిన ప్రాజెక్టు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రెంటిని విశాఖపట్నం – హైదరాబాద్, తిరుపతి– హైదరాబాద్‌ల మధ్య నడుపుతున్నారు. ఈ అంశాలన్నిటినీ పార్టీ ప్రచారం చేస్తుంది. మొదటి విడతగా 11 పార్లమెంటు నియోజకవర్గాలు, 77 అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో గోడలపై పార్టీ గుర్తు 'కమలం' వేసి, దాని పక్కన "జై భారతీయ జనతా పార్టీ" అని రాస్తారు. రంగులద్దే ఈ గుర్తులు దీర్ఘకాలం పాటు కనిపిస్తూ, త్వరబీజేపీలోకిగా చెరగ కుండా పార్టీ గురించి ఎప్పటికీ ప్రజలకు గుర్తుండేలా చేస్తాయి.

**ప్రభుత్వ 'వ్యతిరేకత' కలిసొచ్చేలా...**

వైసీపీ ప్రభుత్వం పాలనలో తీవ్ర వైఫల్యం చెందింది. పన్నుల భారం, పెరిగిన ధరలను అదుపు చేయలేకపోవడం, కేంద్రీకృత అవినీతి, విచ్చలవిడిగా వనరుల దోపిడి, రౌడీయిజం, గూండాయిజం, ఆశ్రిత పక్షపాతం, అదుపులేని నిరుద్యోగం, పెరిగిపోతున్న పేదరికం, అస్తవ్యస్త నిర్ణయాలు, నగదు పంపకానికి చేస్తున్న మితిమీరిన అప్పులతో కుదేలైన ఆర్థికవ్యవస్థ, పాలన అనేది లేకపోవడం, హిందువుల పట్ల చూపిస్తోన్న మత వివక్ష, సమస్యలను పరిష్కరించకపోవడం, కొత్త రోడ్ల నిర్మాణం అటుంచి, ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, కొత్త సమస్యలు సృష్టించడం, వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకోవడం, అవినీతిని ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు, మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు అపలేకపోవడం, శాంతి భద్రతలు క్షీణించడం వంటి సమస్యలను ప్రజల వద్ద ప్రస్తావించి, వాటి పరిష్కారానికి ప్రజల తరపున ప్రశ్నించేలా పోరాటాలు, ఆందోళనలు, ఉద్యమాలను చేపట్టడం ద్వారా ప్రజలకు దగ్గరై వారి మద్దతును పొంది 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేలా పని చేయాలని బీజేపీ సంకల్పం చెప్పుకుంది. ★



# 'ఇది ఇండియా కాదు, పంజాబ్'

"ఇది ఇండియా కాదా?"

"కాదు, ఇది పంజాబ్!"

"కాదు, ఇది స్వర్ణదేవాలయం"

ఇది అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలో ప్రవేశించిన ఒక బాలికకూ, అక్కడ కాపలాదారుకు మధ్య జరిగిన సంభాషణ.

తనను స్వర్ణాలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్న ఆ కాపలాదారుని ఉద్దేశించి ఆ బాలిక కాస్త గట్టిగానే ప్రశ్నించింది. ఇంతకీ ఆ బాలిక చేసిన నేరం ఏమిటి?

ముఖం మీద త్రివర్ణ పతాకాన్ని చిత్రించుకుని రావడమే.

ఇది ఆశ్చర్యం కలిగించినా నిజం. దీనికి సంబంధించిన వీడియో ఏప్రిల్ 17న వైరల్ అయింది. ఈ వాగ్యుద్ధం మధ్యలోనే ఆ బాలిక స్నేహితురాలు వచ్చి, నిన్ను ఎవరు వెళ్లకుండా అపుతున్నారు అని అడిగింది. ఇదిగో ఈ సర్దార్జీ అని ఆ బాలిక సమాధానం ఇచ్చింది. ఆ రెండో బాలిక కూడా తిరంగా జెండాను చిత్రించుకుంటే లోపలికి రాకుండా అపుతారా అంటూ కాపలాదారుని నిలదీసింది. ఇంతలోనే పలువురు కూడా ఆ కాపలాదారుతో వాగ్యుద్ధానికి దిగడం కనిపించింది. ఎందుకు మీరు దీనికే అరుస్తున్నారు అన్నాడు ఆ కాపలాదారు. కాకపోతే ఏమిటీ చీదర అని అడిగిందా బాలిక. చీదర అంటావా ముందు ఆ సెల్‌ఫోన్ ఆపు చెయ్యి అంటూ బలవంతంగా చేతులో నుంచి అతడు లాక్కున్నాడు.

వాస్తవం ఏమిటంటే, అక్కడికి కొద్దిదూరంలోనే ఉంది వాఘా సరిహద్దు. అక్కడ నిత్యం జరిగే విన్యాసం చూసేందుకు వేలాది మంది వెళతారు. అలా వెళ్లే వారంతా కూడా ముఖాల మీద, అంటే బుగ్గల మీద త్రివర్ణ పతాకం టాటూ వేసుకుంటారు.

తరువాత శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ కార్యదర్శి గురుచరణ్ సింగ్ గ్రెవాల్ జరిగినదానికి క్షమాపణ చెప్పారు. బాలిక పట్ల కాపలాదారు అవాంఛనీయంగా ప్రవర్తిస్తే అందుకు కూడా క్షమాపణలని ప్రకటించారు.

ఏమిటీ మార్పు! పంజాబ్‌లో, అది కూడా స్వర్ణాలయంలో మువ్వన్నెల టాటూ నిషిద్ధమా? ఆప్ అధికారంలోకి వచ్చిన తరువాత అమృత్‌పాల్ సింగ్ వచ్చాడు. ఇప్పుడు స్వర్ణాలయాన్ని ఖలిస్తాన్ వాదులు కబ్జా చేశారా? ఈ పరిణామం కూడా ఆప్ విధానాల ఫలితమే కావచ్చు. ఏమైనా ధైర్యంగా ఇది భారత్, ఇది స్వర్ణాలయం అని ప్రకటించిన ఆ బాలికను దేశం మెచ్చుకోవాలి.

ఇది భారత్ కాదు, పంజాబ్ అన్న మాట ఆ కాపలాదారు నోటి నుంచి ఎందుకు వచ్చిందో మాత్రం గురుద్వారా ప్రబంధక్ కమిటీ సమాధానం చెప్పవలసి ఉంటుంది.

లాలా లజపతిరాయ్.. భగత్‌సింగ్.. ఉద్దమ్‌సింగ్.. మీ వంటి మహనీయులందరికీ క్షమాపణలు. ★

# మాయా యుద్ధంలో



**రా**వణాసురుడు–మండోదరి దంపతుల కుమారుడు మేఘనాథుడు. ఇతడు అస్త్ర విద్యలో మేటి. రామాయణంలో మొదటిసారిగా ఇతడి గురించి తెలిసేది హనుమపై బ్రహ్మాస్త్ర ప్రయోగం చేసినప్పుడే. ఆ తర్వాత రామరావణ యుద్ధంలో తాన ప్రయోగించిన అస్త్రాలతో రామలక్ష్మణులను కట్టడి చేయడాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు అతడు ఎంతటి పరాక్రమవంతుడో!

రావణ ప్రథమ పుత్రుడుగా జన్మించినప్పుడు అరిచిన అరుపు, మేఘం ఉరిమిన పిడుగు శబ్దంలా ఉండటం వల్ల 'మేఘనాథుడు' అని నామకరణం చేశారు. స్వర్గానికి వెళ్లి ఇంద్రుడిని జయించినందున 'ఇంద్రజిత్తు' అయ్యాడు. బ్రహ్మ అనుగ్రహం పొంది బ్రహ్మాస్త్రాన్ని సంపాదించాడు. యుద్ధసమయంలో ఆకాశంలోకి వెళ్లి మేఘాలలో యుద్ధాలు చేయగలగడం ఆతని నైపుణ్యం. ఎంతో ప్రతిభావంతుడైన ఇంద్రజిత్తు, శనిస్థానం దోషం కావడంతో పాటు అధర్మాన్ని ఆశ్రయించడంవల్ల యుద్ధంలో అకాలమరణం పొందాడు.

రామలక్ష్మణుల శౌర్యం, రాక్షసుల పరాజయం చూసిన ఇంద్రజిత్తు, ప్రత్యక్ష యుద్ధంలో వీరిని జయించడం సాధ్యం కాదని, కనపడకుండా యుద్ధం చేద్దామనుకున్నాడు. అంగదుడి దెబ్బకు వెనుకడుగు వేసిన ఆతను తిరస్కరణీ విద్యాబలంతో ఆకాశంనుంచి అదృశ్యరూపంలో ఉండి మాయాయుద్ధం చేస్తాడు.

చివరకు నాగాస్త్ర సమూహాలను ప్రయోగించడం ద్వారా రామ లక్ష్మణులను కట్టిపడేశాడు. బాణాల దెబ్బలకు వారి దేహాల నుంచి నెత్తురు కారింది. రాముడు విల్లు సహా నేలమీద పడిపోయాడు. అన్న నేలకొరగడం చూసి లక్ష్మణుడు కూడా ప్రాణం మీద ఆశ వదిలి బాణశయ్య మీద పడుకున్నాడు. వానరులంతా వారిని సమీపించి దుఃఖపడ్డారు. రామలక్ష్మణులు మరణించారని ఇంద్రజిత్తు, తండ్రి రావణుడికి చెప్పగా, ఆతడు ఆసనం మీద నుంచి లేచి, సంతోషంగా కొడుకును కౌగలించుకుని, "ఎలా చంపావు? ఏమి ఉపాయం చేశావు?" అని అడగగా, తన అస్త్ర ప్రయోగం గురించి వివరించాడు. రామ లక్ష్మణులవల్ల కలిగిన భయం పోయిందని రావణుడు




❋ 'మొక్క'బడి ❋

# వ్యాధి నిరోధకతకు నేలవేము

**నే**లవేము వేప కన్నా చేదుగా ఉంటుంది. కాండంలోను, ఆకులోను ఔషధగుణాలు పుష్కలంగా ఉంటాయి. దీనిని అంటువ్యాధులు, కొన్ని ఇతర వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తున్నారు. ఎక్కువగా ఆకులు, మూలాలను ఉపయోగిస్తారు. ఇది చక్కెర వ్యాధిని అరికడుతుంది. కాలేయ వ్యాధులు రాకుండా చూస్తుంది. వైరల్/విష జ్వరాలు రాకుండా కాపాడుతుంది. చికున్ గున్యా మూలాన కీళ్లనొప్పులు వచ్చిన వారికి ఉపశమనం కలిగిస్తుంది. తేలుకుట్టిన వారికి నేలవేము ఆకు తినిపిస్తే తగ్గిపోతుంది. ఈ ఆకుల చేదు తెలిసేంతవరకూ తినిపిస్తుండాలి. ఈ వృక్షాన్ని అలంకరణకు అధికంగా వాడితే ఈ మొక్క ఫలాలను నీటి వనరుగా వాడతారు.

**ఇతర ఉపయోగాలు**

జీర్ణ సమస్యలను దూరం చేయడానికి నేలవాము రసాన్ని సేవించవచ్చు. ఇది పొట్టను కడిగేయడానికి బాగా ఉపయోగపడుతుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు, కాలేయాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా దీని వినియోగం ద్వారా లివర్ ఇన్ఫెక్షన్ రాకుండా కాపాడుకోవచ్చు.

**వ్యాధుల సంక్రమణ నుండి రక్షణ..**

నేలవేములో యాంటీ బయోటిక్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. ఆయుర్వేద వైద్యుల సలహా మేరకు దీన్ని తీసుకోవడం వల్ల గొంతు ఇన్ఫెక్షన్, ఫ్లూ, జ్వరం వంటి సమస్యలు దూరమవుతాయి.

దీనిని ఇంట్లో కుండీలలో కూడా పెంచుకోవచ్చు. ఇది సుమారు వంద సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. పిలకలు కత్తిరిస్తుంటే గుమ్మటంలా పెరుగుతుంది. సెప్టెంబర్ నాటికి పూత వస్తుంది. ఆ సమయంలో మొక్కను కత్తిరించి నీడన ఆరబెట్టి భద్రపరచుకోవచ్చు. 10–15 సెంటీమీటర్ల ఎత్తున మొక్కను

దోర్బల పూర్ణిమాస్వాతి

# మేటి మేఘనాథుడు

సంతోషంగా కొడుకును పొగిడాడు.

రెండవసారి మూర్ఛిల్లిన లక్ష్మణుడు, హనుమ తెచ్చిన మూలికల ప్రభావంతో కోలుకుని ఇంద్రజిత్‌పై యుద్ధంకొనసాగించాడు. పరస్పరం విజయకాంక్షతో సర్వశక్తులను ఒడ్డి పోరాడారు. దివ్యాస్త్రాలను దివ్యాస్త్రాలతోనే ఖండించారు. వారు మాటల బాణాలతో కూడా పోరాటం చేశారు. ఇంద్రజిత్తు మాయాయుద్ధాన్ని లక్ష్మణుడు ఎత్తి చూపి నిరసించాడు."నాగాస్త్రబంధంలో చిక్కుకుని విలవిలలాడి పోయారు... గుర్తు లేదా?' అని ఇంద్రజిత్తు దెప్పిపొడిచాడు. అతడి ప్రగల్భాలకు ఒళ్లు మండిన లక్ష్మణుడు వ్యూహాత్మకంగా ఇంద్రజిత్తు సారథి తల నరికాడు. గత్యంతరం లేక ఇంద్రజిత్తు స్వయంగా సారథ్యం చేస్తూ పోరాడాడు. వెంటనే లక్ష్మణుడు అతడి రథాశ్వాలను నేలకూల్చి, ధనుస్సును ఖండించాడు.

ఇంద్రజిత్ మరొక విల్లును చేపట్టగా, లక్ష్మణుడు దానినీ భగ్నం చేశాడు. తరువాత కవచాన్ని ఛేదించాడు. ఇంద్రజిత్తు ప్రయోగించిన శక్తిని లక్ష్మణుడు ముక్కలు చేశాడు. ఇంద్రజిత్తు కోపించి యామ్యాస్త్రాన్ని ప్రయోగించాడు.

లక్ష్మణుడు కుబేరుడు ప్రసాదించిన దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. అవి రెండు నిప్పులు గక్కుతూ పోరాడి నేలపడ్డాయి. లక్ష్మణుడు ప్రయోగించిన ఇంద్రాస్త్రం రివ్వున దూసుకుపోయి ఇంద్రజిత్తు తల నరికింది. పలు గ్రంథాలలో పేర్కొన్నట్లు, ఏడు యజ్ఞయాగాలు చేసిన ఏకైక యోధుడు.

14సంవత్సరాలు నిద్రలేని,ఆ కాలమంతా బ్రహ్మచర్యం పాటించిన వారి చేతిలో మాత్రమే మరణమని ఇంద్రజిత్తు వరంపొందాడు. ఆ అర్హతలు కలిగిన లక్ష్మణుడి చేతిలో ఇంద్రజిత్తు మరణించాడు.

మహాపరాక్రమ సంపన్నుడైన ఇంద్రజిత్తు తన శక్తి యుక్తుల్ని ధర్మం కోసం కాకుండా, అధర్మం కోసం ఉపయోగించడంతో చివరకు నేల కూలక తప్పలేదు. మహా పతివ్రత అయిన ఇంద్రజిత్తు భార్య సులోచన స్వయంగా యుద్ధ రంగానికి వెళ్లి, రాముని అనుమతితో భర్త కళేబరాన్ని తీసుకుని సహగమనం చేసింది. ★



కత్తిరిస్తే... మళ్లీ చిగుళ్లు వస్తాయి. 60 రోజుల్లో రెండోసారి కోసుకోవచ్చు. చూర్ణం చేసి దాచుకోవచ్చు. తులసి మాదిరిగానే.. దీన్ని రోజూ రెండు పచ్చి ఆకులు లేదా కాండం, ఆకుల పొడి లేదా వాటి కషాయం ఎలా వీలైతే అలా వాడొచ్చు. నిజానికి ఇది అందరికీ తెలిసినదే కానీ ఫలానా అని తెలియక పిచ్చి మొక్కగా చూస్తాం కానీ, తెలిస్తే దీనిని ఔషధంగా వాడుకోవచ్చు. గిరి జనులు నేలవేము చెట్లను ఇంట్లో వేలాడగట్టుకొని వాడుకుంటూ ఉంటారు.



❄ తాత్వి'కత' ❄

# సమస్య పరిష్కారానికి ఆత్మహత్య శరణ్యం కాదు

ఒకడికి జీవితం మీద విరక్తి పుట్టి, ఆత్మహత్య చేసుకుందామనుకుని రైలు పట్టాలపై పడుకున్నాడు. ఆ సమయానికి ఓవైపు నుంచి మైకులో నుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. రైలు వచ్చేలోపు అక్కడికి వెళ్లి ఆ మాటలు విందామనుకున్నాడు. ఆ మాటలు వినిపించే దిశగా అడుగులు వేశాడు. ఓ పది పన్నెండు అడుగుల దూరంలో నుంచే ఆ ప్రసంగం వినిపిస్తోంది. అక్కడికి చేరుకున్నాడు. మాటలు విన్నాడు. ఆ మాటలు చెవిన పడటంతోనే ఆత్మహత్య చేసుకోవాలనుకునే నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఇంతకూ ఆ మాటలు ఏమిటంటే...

జీవితంలో మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమస్య ఉంటుంది. సమస్యంటూ లేని వారు లేరు. ఒక్కొక్కరికీ ఒక్కో సమస్య. ఒక సమస్య నుంచి బయటపడదామనుకునేసరికి మరొక సమస్య సిద్ధంగా ఉంటుంది తనలోకి తీసుకోవడానికి. అది సర్వసహజం.

ఎత్తుపల్లాలు ఉన్నట్లే మనిషికి కష్టాలు సుఖాలు వస్తూనే ఉంటాయి. ఏవీ స్థిరంగా ఉండవు. పగలూ రాత్రిలా, చీకటి వెలుతురులా ఒకటి తర్వాత ఒకటి వస్తూ, పోతూంటాయి. వాటినెవరూ ఆపలేరు. అంతమాత్రాన భయపడి పోవడమో, నీరస పడిపోవడమో చేయకూడదు. సమస్యల నుంచి తెలివిగా, సమయోచితంగా బయటపడటం ప్రధానం. కష్టానికి తల ఒగ్గి డీలా పడిపోయే కన్నా మనసుని దృఢ పరచుకోవడం అవసరం. ఆ కష్టాన్ని ఓ అనుభవ పాఠంగా మలచుకోవాలి. భవిష్యత్తులో అటువంటి సమస్య వచ్చినప్పుడు ఎలా ముందుకుపోవాలో ఆలోచించాలి. ఓ విజయం సాధించిన తర్వాత తదుపరి ఏం చేయాలో ఆలోచించాలి. చెయ్యవలసినవి విప్లవాత్మకంగా వీరోచితంగా చేసి జీవిత పయనాన్ని కొనసాగించాలి. ★

# వరాహమిహిర

18



అతడి కష్టాన్ని గమనించిన హెలీనా "నేను రాసిపెట్టనా?" అన్నది. అతడామె వంక నిస్పహాయంగా చూసి "పాఠాలు గురు ముఖతః నేర్చు కోవడమే కానీ, రాసే అవసరం ఎక్కువగా లేదు". అందునా ఈ ఆకులపై రాయడం నాకు సాధ్యం కావడం లేదు.


"ఈజిప్టు వాసులు మాత్రమే ఈ ఆకులను ఉపయోగిస్తారు. గ్రీస్, రోమ్‌లలో వీటి వాడకం అంత ఎక్కువగా లేదు. చిరకాలంగా ఇక్కడ ఉన్నందువల్ల నేను రాయగలను".

వేరే మార్గం కనిపించని మిహిరుడు ఆమె మాటలు అంగీకరించి తాను రాయబోయే గ్రంథంలోని మొదటి శ్లోకం చెప్పాడు. ఆమె అతని వంక ఆశ్చర్యంగా చూసింది. ఆమెలో ఆ ఆశ్చర్యం ఎందుకో మిహిరునకు మొదట అర్థం కాలేదు. ఆ తర్వాత ఆమె ఆంతర్యం అవగతమైంది. ఆమెకు సంస్కృత భాషతో పరిచయం లేకపోవడమే కాదు. ఆ భాష ఉన్నదని తెలిసే అవకాశం కూడా లేదు. మిహిరుడామెకప్పుడు భరతభూమి గురించీ, సంస్కృత భాష గురించీ వివరంగా చెప్పాడు. విషయమర్థమైన హెలీనా తనకు సంస్కృత భాష లిపిని నేర్పిస్తే, నేర్చుకుని, లేఖన చేయగలనన్నది.

నాలుగు దినములైనా గడవక ముందే ఆమె దేవనగరి లిపిని నేర్చుకుని, మిహిరుడు శ్లోకాలు చెబుతుండగా రాయడము ప్రారంభించింది.

**దినకర వసిష్ట పూర్వాన్ వివిధ**
**మునీంద్రాన్ ప్రణమ్య భక్త్యాదౌ**
**జనకం గురుంచ శాస్త్రే**
**యేనాస్మిన్ నః కృతోబోధః**

మొదటి శ్లోకం రాసి మిహిరునికి చూపించింది.



పాలంకి సత్య

"ఒక తప్పు కూడా లేదని" అతడు మెచ్చుకున్నాక హెలీనా శ్లోకార్థం అడిగినది.

"సూర్యుడు, వసిష్ఠుడు మొదలైన అనేక మునులకు, నాకు విద్య నేర్పిన నా జనకులకు నమస్కరించి" అంటూ మిహిరుడు చెప్పిన తర్వాత ఆమె మీరు మీ తండ్రి వద్దనే చదువుకున్నారా?" అని అడిగినది.

"అవును" అని మిహిరుడు సమాధానమిచ్చాడు. ప్రశ్న అడిగే సమయంలో ఆమె గొంతు బొంగురు పోయిన సంగతి శాస్త్ర రచనలో మునిగి ఉన్న వరాహ మిహిరుడు గమనించలేదు.

* * *

వరాహ మిహిరుడికి కాలం చక్కగా గడచి పోతున్నది. ఉదయమే స్నాన, జపాది కర్మలు, తర్వాత యవన గురువుల వద్ద విద్యాభ్యాసం, ఇంటికి వచ్చి స్నానం, పూజ నిర్వర్తించి, భోజనం చేయడం, ఆపైన రోమను ఖగోళశాస్త్ర గురువుల వద్ద పఠనం, సాయం సమయములో హెలీనా సహాయంతో గ్రంథ రచన.

ఒకనాడు రోమను గణితంలో ఉన్న తప్పును గురించి శ్లోకరూపంలో మనసులో అనుకుంటూ ఇంటికివచ్చాడు. యవన సిద్ధాంతం, రోమను సిద్ధాంతం చెప్పి,రోమనులు చెప్పిన దానిని అనుసరించకూడదన్న భావంతో శ్లోకం రచించాడు. హెలీనా ఇంటలేదు. ఏదో ఒక పనిమీద వెళ్లి ఉండవచ్చునేమో. తానే రాసుకోవాలని అనుకుంటున్న మిహిరునికి ఏడుపు వినిపించింది. ఇంటి యజమానురాలు దుఃఖిస్తున్నట్లున్నది. ధనం తక్కువ అయినదా? హెలీనా ఆ పని మీదనే వెళ్లినదా?

మిహిరుడామె వద్దకు వెళ్లి "అమ్మా, ఏమైంది? ఏదైనా దుర్వార్త తెలిసిందా?" అని అడిగినాడు.

"ఏమీలేదు" అని ఆమె అన్నది.

"అమ్మా, నన్ను మీ కుమారునిగా భావించండి. మీ కష్టం తెలిస్తే వీలయిన సహాయం చేయగలను". ధనం అవసరమన్న భావం మిహిరునితో ఉంది.

"ఇది ఒకరు తీర్చగలిగిన కష్టం కాదు. ఎవరికీ ఇంతవరకూ చెప్పక పోవడానికి అదే కారణం. నా రహస్యం తెలిస్తే అవమానమే కానీ ప్రయోజనం లేదు".

మిహిరుడు మౌనంగా కూర్చున్నాడు.

కొంతసేపైన తర్వాత ఆమె "పరదేశవాసివి. నీకు తెలిసినంత మాత్రాన నష్టం లేదు. కానీ ఎవరికీ తెలియనీయవద్దు" అన్నది.

మిహిరుడేమీ మాట్లాడలేదు.

"నా పేరు పాంపేయా. నేను రోమ్ పాలకునికి ఒకప్పటి భార్యను. నన్ను నా భర్త పరిత్యజించాడు. పాలకుని భార్యగా సకల సంపదలతో, గౌరవ మర్యాదలతో జీవించిన నేను నిరుపేదగా, భర్త పరిత్యక్తగా రోమ్‌లో ఉండలేకపోయాను. నేను ఏ తప్పు చేయలేదు. అయినా శిక్ష తప్పలేదు".

"భగవంతుని లీలలు అర్థం కావు కదా".

"దేవతల ప్రసక్తి ఎందుకు? జరిగిన సంగతి తెలిస్తే నీవా మాటను అనవు".

మిహిరుడు మౌనం వహించాడు. పాంపేయా కనుల ముందు కదలాడిన ఆమె గత జీవితం వాగ్రూపంలో మిహిరుని కనులముందు నిలిచింది.

"నేను రోమ్ పాలకుడు జూలియస్ సీజర్‌కు ఒకప్పుడు భార్యను. నా మాతామహుడైన సుయిల్లా వలన సీజర్ చిన్న వయసులో అనేక కష్టాలు అనుభవించాడు. రోమ్ వదలి పోవలసివచ్చింది. మా తాతగారి మరణాంతరమే తిరిగి రాగలిగాడు. వచ్చిన తర్వాత అనేక విజయాలు సాధించాడు. అతని భార్య మరణించిన అనంతరం నాతో పెళ్లి కావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

కొంతసేపు ఆగిన పాంపేయా తర్వాత జరిగినది చెప్పసాగింది.

ఒకనాడు దేవీపూజ చేస్తూ బంధుమిత్రులైన స్త్రీలను ఆహ్వానించాను. పురుషులకు ప్రవేశం లేని గృహాంతర్భాగంలోనికి క్లోడియస్ అనే పురుషుడు స్త్రీ వేషధారియై ప్రవేశించాడు. అతడు లోనికి వచ్చిన విషయం ఎలానో బయటపడింది. నన్ను ఆకర్షించి, తన ప్రేయసిగా చేసుకునేందుకు వచ్చాడన్నది పుర జనుల నమ్మకం. అంతటా ఈ విషయం చర్చనీ

యాంశమైంది. క్లోడియస్‌ను న్యాయస్థానానికి రప్పించారు. కానీ నా భర్త అతని గురించి ఏ విధమైన ఆరోపణా చేయలేదు. వ్యతిరేకంగా సాక్ష్యమీయలేదు. క్లోడియస్ నిర్దోషి అని విడిచిపెట్టారు. కానీ, కానీ…"

కొంతసేపు ఆగిన పాంపేయా "నా భర్త బహిరంగంగా నా భార్య ప్రవర్తన మీద ఎటువంటి సందేహాలకూ తావు ఇవ్వకూడదు" అని చెప్పి నన్ను పరిత్యజించాడు. జరిగిన అవమానం తట్టుకొనలేక, నావద్ద ఉన్న కొద్దిపాటి ధనంతో అలెక్సాండ్రియాకు వచ్చి నిరుపేద జీవితం గడుపుతున్నాను. ఎంత మరచిపోదామన్నా, నా భర్త కఠిన ప్రవర్తనను మరచిపోలేక, అప్పుడప్పుడు దుఃఖిస్తూ ఉంటాను" అన్నది.

వరాహమిహిరుడు మృదువుగా "అమ్మా! కొన్ని నిర్ణయాలు ఎంత కఠినమైనవైనా, ఎంత క్రూరంగా కనిపించినా పాలకులు తీసికొనక తప్పదు. మా భూమిలో మేము దైవంగా ఆరాధించే శ్రీరామచంద్రుడు ఇటువంటి పరిస్థితులలోనే తన ప్రియసతిని అడవులకు పంపవలసి వచ్చింది" అన్నాడు.

పాంపేయా తన దుఃఖాన్ని కొంతవరకూ



మరచిపోయి,ఆశ్చర్యంగా "నిజమా?"అని అడిగినది.

మిహిరుడు "అవును" అన్నాడు.

పాంపేయా ఎందుకు? అని అడిగినది.

"కానీ ఆ మహాపురుషుడి చరిత్ర వింటే మీరు పూజించాలనే అనుకుంటారు"

పాంపేయా రామ చరితం చెప్పమని అడిగింది. మిహిరుడు మొదలుపెట్టే సమయానికి హెలీనా తాను క్రయము చేసిన వస్తువులతో వచ్చి అక్కడ కూర్చున్నది. వరాహ మిహిరుడు సంక్షిప్తంగా రామకథను చెప్పసాగాడు. దశరథ మహారాజుకి ముగ్గురు భార్యలనీ, వారికి రామలక్ష్మణ, భరత, శత్రుఘ్నులనే కుమారులు కలిగారనీ చెప్పాడు. నెమ్మది, నెమ్మదిగా పాంపేయా, హెలీనాల మదికి కథ హత్తుకునేలా చెప్పి, సీతాదేవిని రావణుడు అపహరించడం, రావణ సంహారం, సీతను విడిపించి, అయోధ్యకు తిరిగివచ్చి శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యేదాకా చెప్పాడు.

"ఇంతటితో కథ సుఖాంతమైనదని అనకుంటాం. కొంతకాలానికి సీత గర్భవతి అయింది. శ్రీరామ చంద్రుడు ఎల్లవేళలా చారులను పంపి, ప్రజల కష్ట సుఖాలూ, తన పాలనపై జనుల అభిప్రాయాలూ తెలుసుకునేవాడు. లంకలో కొద్దికాలం నివసించిన స్త్రీని రాముడు స్వీకరించడం కొందరికి నచ్చలేదని ఆయనకు తెలిసింది. ప్రజాభిప్రాయమునకు విలువ నిచ్చి, ఆమె కోరిక మేరకు అడవులకు పంపాడు. వ్యక్తి సౌఖ్యంకన్నా సంఘశ్రేయస్సు గొప్పదని ఆయన భావన."

"సీత ఏమయిది?" హెలీనా కుతూహలంగా ప్రశ్నించింది.

"ఆమె ఒక రుషి ఆశ్రమంలో తల దాచుకుని, ఇద్దరు పిల్లలను కన్నది. కానీ అయోధ్యలో రామచంద్రుడామెకై పరితపించిపోయాడు. యాగం చేయవలసిన సమయం వచ్చినది. అది భార్యా సమేతంగా నిర్వహించాలి. ఆమె స్వర్ణ ప్రతిమను చేయించి, యాగం చేశాడు. చివరగా ఆమె కుమారులకే రాజ్యమిచ్చాడు".

పాంపేయా కనులు మూసుకుని, ఒక్క క్షణ ముండిపోయింది. ఆపైన కనులు తెరచి, "హెలీనా; ఆలస్యమవుతున్నది.వెళ్లి వంట ప్రారంభించు" అంది.

హెలీనా వెళ్లాక మిహిరునితో నెమ్మదిగా మాట్లాడింది.

"నీవు చెప్పిన కథలోని రాజును మీరెందుకు దేవునిగా పూజిస్తారో తెలిసింది. ప్రజాభిప్రాయానికి విలువనిచ్చి, ఆయన భార్యను పరిత్యజించాడు. నా భర్త కూడా చేసినదే అదే అనిపిస్తుంది. సామ్య మంత వరకే. నన్ను వదలిపెట్టిన తర్వాత పునర్వివాహానికి ముందు ప్రేయసీమణులకు కొదవ లేదు. రాజ్యాలు కొల్లగొట్టి తెచ్చిన విలువైన వస్తువులు ఆ ప్రియ భామలకే ఇచ్చేవాడు. అయినా ఓర్చుకున్నాను. చివరకు సీజర్ ఇక్కడనే ఉండి, ఈజిప్టు రాణి క్లియోపాత్రాతో సరస జీవితం సాగిస్తున్నాడు."

మిహిరుని నోట అనుకోకుండా ఒక ప్రశ్న వచ్చింది. "ఈ దేశపు రాణి పేరు క్లియోపాత్రా అని తెలియదే. స్త్రీలు సింహాసనార్హతను పొందగలరా?"

అప్పుడే అక్కడకు వచ్చిన హెలినా "మీకు నూతన శాస్త్ర విషయ పఠనం, గ్రంథరచన, రాత్రి నక్షత్ర పరిశీలన తప్ప భూమ్మీద జరిగే సంఘటనలతో పనిలేదు" అన్నది.

"అదేమి మాట?"

"ఈ దేశమేలే రాజు ఎవరు?"

మిహిరునికి తెలియదు. తెలుసుకునే ప్రయత్న మతడేనాడూ చేయలేదు. విద్యాభ్యాసం త్వరగా ముగించుకుని, భరతభూమికి తిరిగి పోవాలన్నదే అతని తలపు.

హెలీనా తిరిగి ప్రశ్నించింది. "ఈ దేశమేలే రాజు ఎవరు?"

"ఇప్పుడే ఈ దేశాన్ని క్లియోపాత్రా అనే రాణి ఏలుతున్నదని తెలిసింది. క్లియోపాత్రా అంటే జనకునకు శోభ తెచ్చునది అని గ్రీకు భాషలో అర్థం.

"భాషాపాండిత్యాలకు లోటు లేదు" అని హెలీనా నవ్వింది. ఆపైన "ఈజిప్టునకు ఏలికలిద్దరు. క్లియో పాత్రా, టోలమీ. వారిద్దరూ సోదరీ సోదరులు మాత్రమే కాక భార్యాభర్తలు."

"సోదరీసోదరుల నడుమ వివాహమా?'' వినడానికే తల్లడిల్లిపోయాడు. యవనులు మ్లేచ్ఛులని ఎన్నో మారులు ఎందరో అనగా విన్నాడు. కానీ ఇంత విశృంఖలత్వమా?

"ఆ వివాహం ఈ మధ్యనే జరిగింది. రోమ్ పాలకుడు..." అంటూ చెప్పబోతున్న హెలీనాను ఆపి వంట పూర్తి చేయమని ఆదేశించింది పాంపేయా.

* * *

మరునాడు నగరంలో ఉత్సవం జరుగుతున్నందున చదువుకు అవకాశం లేదు. వరాహ మిహిరుడు తాను ముందునాడు మనస్సులో అనుకున్న శ్లోకాలను చెప్పగా హెలీనా లిఖించినది.

"అయిదుగురు వ్యక్తుల అభిప్రాయాలను క్రోడీకరించి గ్రంథరచన చేస్తున్నారు. గ్రీకు సిద్ధాంతానికి పౌలిశ సిద్ధాంతమన్న పేరేల?"

"పారసీక దేశంలో నాకు గ్రీకు ఖగోళ శాస్త్రం నేర్పిన గురువుగారి నామధేయం పౌలే. ఆయన పేరును పౌలిశ సిద్ధాంతమని రాశాను. నాకు పారసీక దేశంలో అనేకమంది గ్రీకులతో పరిచయం. కానీ సోదరీసోదరుల పరిణయం.. ఏనాడూ వినలేదు."

''అది యవన సంప్రదాయం కాదు. గ్రీకులలోనూ ఆ సంస్కృతి లేదు. అలెక్సాండరు విశ్వ విజేత కావలెనన్న కాంక్షతో వరుసగా రాజ్యాలను జయిస్తూ వచ్చాడు. అతని మరణాంతరం గ్రీకు సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. పారసీక ప్రాంతాన్ని సెల్యూకస్ తీసుకొన్నాడు. ఈజిప్టు టోలమీ వశమైంది. అలెక్సాండరు దండయాత్రకు ముందు ఈజిప్టును ఏలినవారే ఫారోలు. రాజవంశీకుల రక్తం ఇతరుల రక్తంతో కలసి కలుషితం కాకూడదట. అందుకే అలాంటి పెళ్లిళ్లని తప్పనిసరి చేశారు. ఈజిప్టు తమ వశమైనాక గ్రీకు ఏలికలకూ ఆ సంప్రదాయం తప్ప లేదు. కానీ సామాన్య ప్రజలలో అలాంటి వివాహాలు నిషిద్ధమే".

"నీకీ విషయలెట్లా తెలిసినవి?"

"పరిచారికకు తెలియరాదని మీఅభిప్రాయమా?"

"లేదు... నేనట్లు అనుకొనలేదు. నేను నేర్చుకొనవలెనన్న మార్గమేది?"

"అలెక్సాండ్రియాలోని గ్రంథాలయంలో చాలా పుస్తకాలున్నాయి. ఈజిప్టు, గ్రీసు, రోమ్‌ల చరిత్రను అక్కడ చదివి తెలిసికొనవచ్చును".

మిహిరుడామెను మరికొంత సమాచారమడిగే లోపుగా పాంపేయా "హెలీనా" అని పిలిచినది.

* * *

అలెక్సాండ్రియాలోని పుస్తక భాండాగారం చూసిన వరాహ మిహిరునకు కళ్లు తిరిగినట్లయింది. నాలుగు లక్షల గ్రంథాలుండవచ్చు. అక్కడనున్న వారిని వివరాలడిగి, చరిత్ర చదవసాగాడు. నిత్య కర్మలు, యవన, రోమక ఖగోళ శాస్త్రాభ్యాసం, గ్రంథ రచనలకు చరిత్ర పఠనం తోడైంది. మరణా నంతరం కూడా తాము జీవిస్తామన్న నమ్మకంలో ఫారోలు తమకై తాము పెద్ద కట్టడాలు నిర్మించుకొన్నారట. రాజులంతా చనిపోయారు కానీ ఆ కట్టడాలు మాత్రం మిగిలాయి. భరత భూమికి తిరిగి ప్రయాణమయ్యే ముందు వాటినొకసారి చూడగలిగిన బాగుండునా? ఇదేమి కోరిక? భగవదాలయాలను చూడాలి కానీ మరణించిన వారి గుర్తులనా?

* * *

వారవ గడచిన తర్వాత వరాహ మిహిరుడు పాంపేయాతో రోమును గురువుల వద్ద నా విద్యాభ్యాసం పూర్తయివది. ఒక నెలలో గ్రీకు ఖగోళ శాస్త్ర పఠనం కూడా ముగియవచ్చును. చదువు పూర్తయిన వెంటనే మా ఇంటికి తిరిగి పోగలను. మీకు ముందుగా చెప్పడం నా ధర్మం" అన్నాడు.

పాంపేయా తల ఊపింది. కానీ మనసులో భయ పడింది. మిహిరుడిచ్చిన ధనంతో గృహ నిర్వహణకి లోటు లేకుండా గడచిపోతున్నది. ఇకపై ఎలా?


మిహిరుడామె ముఖకవళికలను గమనించలేదు. తన గ్రీకు గురువు ఇంటికి వెళ్లి చదువుకొనడం ప్రారంభించాడు. పాఠం పూర్తయిన తర్వాత గురువు తనకు గ్రామాంతరము వెళ్లవలసిన పని పడినదనీ, నాలుగైదురోజులకు కానీ తిరిగి రాలేననీ, మిహిరుడు తన వద్దకు రావలసిన పని లేదనీ చెప్పాడు. మిహిరుడు గురువును "నేను మీతో రావచ్చునా? ప్రయాణ మధ్యలో ఆగినప్పుడు చదువుకుంటాను" అన్నాడు.

(సశేషం)

# తుది శ్వాస వరకు సంఘంతోనే

సంఘ శిబిరాలలో తక్కువ వ్యయంతో, చక్కని భోజనపదార్థాలు స్వయంసేవకులకు అందించి, అందరి ఆదరాభిమానాలు పొందిన కోట సూర్య నారాయణరావు ఏప్రిల్ 11వ తేదీన తుదిశ్వాస విడిచారు. స్వయంసేవక్‌గా ఆయన జీవితం దాదాపు ఏడున్నర దశాబ్దాలు. పరిస్థితి ఏదైనా శాఖకు వెళ్లడం మానని రావు చివరిరోజు కూడా ఇంట్లోనే ప్రార్థన చేశారు. ఇదొక అపూర్వ విషయం.


1942లో వారి పెద్ద సోదరుడు కోట వర ప్రసాదశర్మ ద్వారా సూర్యనారాయణరావు సంఘ్‌లో ప్రవేశించారు. ఆనాడు సంఘ హేమంత శిబిరాలు జరిగినప్పుడు వంటశాలలో తగినన్ని పాత్రలు ఉండేవి కావు. పుష్కరాలలో పలువురు స్వయం సేవకుల సాయంతో పూజాపునస్కారాలు చేయించి, ఆ నగదుతో విజయవాడలో సంఘ కార్యాలయంలో భోగాది దుర్గాప్రసాదరావు ప్రేరణతో శిబిరాలకు కావలసిన వంట పాత్రలు రావు కొని ఇచ్చారు. చాలా సంఘ శిబిరాలలో భోజన ప్రముఖ్ ఆయనే. తక్కువ వనరులతో రుచికరమైన వంటలు చేయించే వారు. కోట వీరభద్రయ్య, వెంకట సుబ్బమ్మ దంప తులకు 3 వ సంతానంగా 1929లో రావు జన్మిం చారు. పేద కుటుంబంలో అతి కష్టం మీద ఎస్.ఎస్. ఎల్.సి వరకు విద్య కొనసాగించారు. ఆ తర్వాత బాపట్ల వ్యవసాయ కళాశాలలో 1948-49 గుమాస్తాగా పనిచేశారు. 1951లో కస్టమ్స్ సెంట్రల్ ఎక్సైజ్ కేంద్ర ప్రభుత్వ శాఖలో స్వయం కృషితో ఉద్యోగం సంపాదించారు. సూర్యనారాయణరావు స్వయంసేవకులను ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించేవారు. నిత్యం ఘట పని చేసేవారు. ఆయన నిష్ట గల స్వయంసేవక్.



సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శిగా కొత్త పాఠశాలలను స్థాపిం చారు. ముఖ్యంగా గుం టూరు జిల్లాలోని శిశు మందిరాల వ్యాప్తికి కృషి చేశారు. మాచర్ల, అమ రావతి, పాత గుంటూరు, నకి రేకల్, సత్తెనపల్లి, నరసరావు పేట, సంపత్‌నగర్ పాఠశాలలు ప్రారంభించి, వాటి సొంత భవనాల కోసం కృషి చేశారు. మొదటగా విజయవాడ సత్యనారాయణపురంలోని శిశుమందిర స్థాపకులలో ఒకరైన కందర్ప రామచంద్ర రావు, యస్ యల్ యం ఆచార్యలతో కలిసి పనిచేశారు.

కస్టమ్స్ శాఖలో ఉద్యోగం చేస్తూ నిజాయితికి చిరునామాగా నిలిచారు. స్వంత ఇల్లు కట్టుకో డానికి చాలా కష్టపడడమే అందుకు తార్కాణం. చాలాకాలం గోడలు లేని ఇంట్లో తడికలు అడ్డం పెట్టుకొని 9 మంది సంతానంతో కాపురం చేశారు. అప్పటి విభాగ్ ప్రచారక్ ఈరంకి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రచారక్ మురళీకృష్ణ మార్గదర్శకత్వంలో అయోధ్య ఉద్యమంలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా నుండి వెళ్లిన కరసేవకులకు నేతృత్వం వహించారు చిత్రకూట్ వద్ద అరెస్ట్ అయ్యారు. మరలా 1992లో మన్నవ ప్రసాదరావు, జిల్లా కార్యావాహ కాకాని పృథ్వీరాజు జట్టుతో కలిసి కరసేవ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

## జాతీయవాద పాత్రికేయులు కృష్ణవర్మ కన్నుమూత



సీనియర్ పాత్రికేయులు దండు కృష్ణవర్మ ఏప్రిల్ 15న విజయవాడలో తుదిశ్వాస విడిచారు. 1950 మే 20న జన్మించిన కృష్ణవర్మ పాత్రికేయ రంగంపై మక్కువతో వృత్తిని ప్రారంభించారు. చెన్నై నుండి వెలువడిన ఇండియాటుడే తెలుగు పత్రికలో కొన్నేళ్లపాటు సహసంపాదకుడిగా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రంగా పలు దిన, వార, మాస పత్రికలలో సేవలందించారు. 'జాగృతి' వారపత్రికకు విలేఖరిగా సేవలందించారు. జాతీయవాద భావాలు మెండుగా ఉన్న కృష్ణవర్మ ఏ పనిచేసినా ఎంతో నిబద్ధత కనబరిచేవారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో పాత్రికేయుడిగా తనవంతు బాధ్యతలను నెరవేర్చారు. కొంతకాలంగా విజయవాడలో ఉంటున్న ఆయన కన్నుమూశారు. వారికి ఆత్మకు సద్గతులు లభించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

# సమరసతా నిర్మాణానికి సోపానాలు

**నెల్లూరు :** సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులతో నెల్లూరులోని అతిథిగ్రాండ్‌లో ఇటీవల ఇష్టాగోష్ఠి సమావేశం. జరిగింది. వీరికి అరుంధతీ వసిష్ఠుల చిత్రపటాలు కానుకగా ఇచ్చి, సత్కరించారు. సమరసత వేదిక కార్యక్రమాల వివరాలను జిల్లా అధ్యక్షులు శ్రీధర్ వివరించారు. దంపతుల అను భవాలు వినిపించిన తరువాత పూజ్యశ్రీ కమలానంద భారతి స్వామి ఆశీఃప్రసంగం చేశారు. ప్రాచీన కాలంలోను, నేడు కూడా వర్ణాంతర వివాహాలు ధర్మసమ్మతమేనని, కులవ్యవస్థలో ఉన్న అస మాన తలను, ఇతరదోషాలను తొలగించుకోవాలని ఆయన అన్నారు. అఖిల భారత సామాజిక సమరసతా జాతీయకన్వీనర్ శ్యామప్రసాద్ మాట్లాడుతూ కులాలు ఏవైనా హిందువులం అందరం సోదరులం అన్నది మన విధానమనీ, కులాల హెచ్చుతగ్గులను, అస్పృశ్యతను రూపి మాపి సోదరభావం నిర్మాణం చేయడానికి సామాజిక సమరసతా వేదిక కృషి చేస్తోందని, నేడు కులాంతర వివాహాలు చేసుకున్న



వారి అనుభవాలను విని, వారిని సన్మానిస్తున్నామని అన్నారు. సన్మాన కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి కేశవులు, మహిళా జిల్లా కన్వీనర్ రమాదేవి, రాష్ట్రమహిళాకన్వీనర్ కోడూరు జయప్రద, కోడూరు సత్యం ఈ కార్యక్రమం నిర్వహించారు.

సంఘం, సమరసత వేదిక కులాంతర వివా హాలను సమర్థిస్తున్నాయి. సమాజంలో సమరసత ఏర్పరచడంలో కులాంతర వివాహాలు ఒక సాధనం కాగలవని మన నమ్మకం. స్వయంసేవక కుటుంబా లలో అనేక మంది కులాంతర వివాహాలు చేసుకుని చక్కగా గృహస్థ జీవితాన్ని సాగిస్తున్న వారు ఉన్నారు. ఇంతవరకు మనం ప్రచారం చేయలేదు. అలాంటి ఆదర్శ దంపతులతో ఇష్టా గోష్ఠి సమావేశమే ఇది.

ఇందులో చర్చకు వచ్చే అనేక విషయాలు నూతన దంపతులకు దిక్సూచి కాగలవు. సంఘ్ సామాజిక దృక్పథం బహిరంగపరచడానికి ఈ ఇష్టా గోష్ఠి సమావేశం ఉపయోగ పడగలదని నిర్వాహకుల నమ్మకం. **కేశవులు, వేదిక జిల్లా కార్యదర్శి**

# 'నాటో'లో లుకలుకలు!

**డెబ్భైల్లో అమెరికా ఆధిపత్యానికి నాటి సోవియట్ యూనియన్ రూపంలో సవాల్ ఎదురైంది. 90ల్లో సోవియట్ యూనియన్ పతనం కావడంతో పెద్దన్నకు ఎదురులేకుండాపోయింది. నిన్న మొన్నటి వరకూ దాదాపు ఇదే పరిస్థితి. నాటి సోవియట్ స్థానాన్ని ఇప్పుడు కమ్యూనిస్టు చైనా భర్తీ చేస్తోంది. ప్రపంచ రాజకీయాల్లో వాషింగ్టన్ ఆధిపత్యాన్ని బీజింగ్ సవాల్ చేస్తోంది. తాజాగా బద్ధశత్రువులైన సున్నీ, షియా దేశాలైన సౌదీ అరేబియా, ఇరాన్ మధ్య రాజీ కుదర్చడం ద్వారా పశ్చిమాసియాలో అమెరికా ప్రాధాన్యాన్ని చైనా గణనీయంగా తగ్గించింది. పశ్చిమాసియా దేశాలతో ఇజ్రాయెల్‌ను సన్నిహితం చేసేందుకు కూడా బీజింగ్ ప్రయత్నాలు ప్రారంభించింది. తాజాగా 'నాటో'(నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్)లో కీలక దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్.. అమెరికాకు వ్యతిరేకంగా గళం ఎత్తడం వెనక కూడా చైనా పాత్ర ఉందన్నది జగమెరిగిన సత్యం.**

నాటి సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అప్పట్లో అమెరికా నాయకత్వంలో 'నాటో' పురుడు పోసుకుంది. సోవియట్ యూనియన్ ఎక్కడ తమపై దాడి చేస్తుందన్న భయంతో యూరప్‌లోని చిన్నా చితకా దేశాలు నాటోలో చేరాయి. కూటమిలోని ఏ దేశంపై దాడి జరిగినా సభ్య దేశాలన్నీ మద్దతుగా నిలబడాలన్నది నాటో నిబంధన. దీంతో యూరప్‌లోని అప్పటి సోవియట్ యూనియన్ ఇరుగు పొరుగు దేశాలు చాలావరకు నాటోలో చేరాయి. తాజాగా ఫిన్లాండ్ కూటమిలో చేరింది. దీంతో సభ్య దేశాల సంఖ్య 31కు చేరింది. ఇప్పుడు స్వీడన్ కూడా కూటమిలో చేరేందుకు పావులు కదుపుతోంది. అయితే కూటమిలోని మరో సభ్య దేశం టర్కీ (తుర్కియే) అందుకు మోకాలడ్డుతోంది. ఫిన్లాండ్ చేరికపై కూడా టర్కీ అభ్యంతరం చెప్పినప్పటికీ అమెరికా జోక్యంతో వెనక్కితగ్గింది. కూటమిలోని ఏ ఒక్క సభ్య దేశం అభ్యంతరం చెప్పినా కొత్త దేశం చేరిక ఆగిపోతుంది. ఫిన్లాండ్ కూటమిలో చేరడంతో ఆ దేశం సురక్షితంగా మారిందని నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోలెన్ బర్గ్ తెలిపారు. ఫిన్లాండ్ తమ కూటమిలో చేరినంత మాత్రాన మాస్కో భద్రతకు ఎటువంటి ముప్పు లేదని, తాము సదా శాంతినే కోరుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఫిన్లాండ్ కోరితే తప్ప ప్రత్యేకంగా ఆ దేశానికి అదనపు బలగాలు పంపబోమని వెల్లడించారు. ఇప్పుడు ఫిన్లాండ్ నాటో ఇనుప కవచ భద్రతతో ఉందన్నారు.

ఫిన్లాండ్‌తో రష్యాకు దాదాపు 1340 కిలోమీటర్ల సరిహద్దుంది. ఈ సరిహద్దు ఇప్పుడు నాటోలోకి అందుబాటులోకి రావడం రష్యా భద్రతకు సవాల్‌గా మారనుందని దౌత్యవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫిన్లాండ్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. నాటో విస్తరణ తమ దేశ భద్రత, ప్రయోజనాలను ఉల్లంఘించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. తాజా చర్య తాము ప్రతీకారం తీర్చుకునే దిశగా పురిగొల్పుతుందని పేర్కొన్నారు. ఫిన్లాండ్‌లోకి ఎటువంటి అదనపు భద్రతా బలగాలను, ఆయుధాలను పంపినా ఆ దేశ సరిహద్దుల్లో తమ బలగాలను బలోపేతం చేస్తామని ఆయన హెచ్చ రించారు. అయితే ప్రస్తుతానికి తమకు ఫిన్లాండ్‌తో ఎటువంటి ప్రాదేశిక తగాదాలు లేవని, ఇదే పరిస్థితి భవిష్యత్తులోనూ కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, డెన్మార్క్, బెల్జియం, ఇటలీ, లగ్జెంబర్గ్, కెనడా, ఐస్ లాండ్, నెదర్లాండ్స్, నార్వే, పోర్చుగల్,అల్బేనియా, బల్గేరియా, క్రొయేషియా, చెక్ రిపబ్లిక్, ఎస్తోనియా, గ్రీస్, లాత్వియా, లిథువేనియా, మాంటెనిగ్రో, నార్త్ మాసిడోనియా, పోలండ్, రుమేనియా, స్పెయిన్, టర్కీ, ఇటలీ, స్లొవేకియా,హంగరీ, ఫిన్లాండ్... కూటమిలోని సభ్య దేశాలు.

వాస్తవానికి ఫిన్లాండ్, స్వీడన్ తటస్థ దేశాలు. ఈ దేశాలు సహజంగా ఎటువంటి కూటముల్లో చేరవు. అయితే ఉక్రెయిన్‌పై రష్యా సైనికచర్య నేపథ్యంలో ఆ దేశాలు తమ విధానాన్ని మార్చుకున్నాయి. తమ దేశాల భద్రతకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు నాటోలో చేరడమే పరిష్కార మార్గమని అవి భావించాయి. అయితే ఫిన్లాండ్ విషయంలో అమెరికా ఒత్తిడికి తలొగ్గిన టర్కీ స్వీడన్ విషయంలో మాత్రం పట్టుదలగా ఉంది. కుర్దిష్ ఉగ్రవాదులకు మద్దతు పలుకుతూ వారు తమ వీధుల్లో ప్రదర్శనలు చేసుకోవడానికి స్వీడన్ అనుమతించ డంపై టర్కీ అధ్యక్షుడు తయ్యద్ ఎర్డగన్ గుర్రుగాఉన్నారు. ఇదిలాఉండగా మరో సభ్య దేశమైన హంగరీ కూడా స్వీడన్ చేరికకు ఆమోదం తెలపాల్సి ఉంది. అయినప్పటికీ నాటోలో స్వీడన్ కూడా త్వరలో సభ్య దేశంగా చేరనుందని నాటో ప్రధాన కార్యదర్శి స్టోలెన్‌బర్గ్ తెలిపారు. జులైలో జరిగే నాటో సదస్సులో ఆ దేశం చేరుతుందని నాటో అమెరికా రాయబారి జూలియన్ స్మిత్ ఆశాభావం వ్యక్తంచేశారు.

కూటమిలో 31 దేశాలు ఉన్నప్పటికీ అమెరికాదే ఆధిపత్యం. దాని మాటే చెల్లుబాటవుతుంది. మిగతా దేశాల పాత్ర నామమాత్రమే. ఇప్పుడు కూటమిలోని కీలక దేశాలైన జర్మనీ, ఫ్రాన్స్‌ల నుంచి అమెరికాకు సవాల్ ఎదురవుతోంది. ఈ రెండు దేశాలు బహిరంగంగానే అగ్రరాజ్యం నిర్ణయాలను తప్పుపడుతు



న్నాయి. వాషింగ్టన్ నిర్ణయాలకు దూడూ బసవన్నలా తలూపే ప్రసక్తి లేదని తేల్చి చెబుతున్నాయి. కూటమిలో తాము గౌరవప్రదమైన సభ్య దేశాలుగా ఉండాలని భావిస్తున్నాం తప్ప ఒకరికి తొత్తులుగా ఉండాలనుకోవడం లేదని పరోక్షంగా అమెరికా నుద్దేశించి వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ దేశాల వ్యాఖ్యల వెనుక బీజింగ్ పాత్ర ఉందన్నది బహిరంగ రహస్యం. ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయల్ మెక్రాన్ చైనాలో పర్యటించారు. ఆ దేశ అధినేత షి జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం ఆయన చేసిన




**మెక్రాన్ వ్యాఖ్యలు, జర్మనీ వైఖరి నాటో కూటమి లోని కొన్ని దేశాల విధానాలు కలకలం రేపుతున్నాయి. మెక్రాన్ వ్యాఖ్యలను యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ప్రతినిధి తోసిపుచ్చారు. ఆయన తమ దేశ వైఖరి గురించి మాట్లాడాలి తప్ప మొత్తం యూరప్ గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. అమెరికాతో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కోరుకునే బదులు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కోరుకుంటే మంచిది.. అని పోలండ్ ప్రధాని పేర్కొన్నారు.**

వ్యాఖ్యలు అమెరికాను ఇరుకున పెట్టే విధంగా ఉన్నాయి. నిర్మొహమాటంగా వాషింగ్టన్ వైఖరిని ఆయన ఖండించారు. 'తైవాన్ విషయంలో అమెరికా – చైనాల మధ్య యూరప్ ఇరుక్కోవలసిన అవసరం లేదు. ఈ విషయంలో చైనానో, అమెరికానో అనుసరించాల్సిన అవసరం మాకు లేదు. యూరప్ ఎవరికీ బానిస కాదు. సంబంధం లేని విషయాల్లో ఇరుక్కునే ప్రమాదాన్ని యూరప్ ఎదుర్కొంటోంది. మాకు వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అవసరం' అని మెక్రాన్ కుండబద్దలు కొట్టారు. అనంతరం నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా ఆయన ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం విశేషం. అమెరికా మిత్రదేశం అయినంత మాత్రాన దాని చేతిలో పావుగా, బానిసగా ఉంటామని అర్థంకాదు.. అని తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. వాషింగ్టన్ పెద్దన్న పాత్ర వల్ల తమకు నిర్ణయాల్లో స్వేచ్ఛ లేకుండా పోతుందని అన్నారు.

నాటోలోని మరో కీలక దేశం జర్మనీ కూడా ప్యారిస్ బాటలోనే ఉంది. ఇటీవల జర్మనీ అధ్యక్షుడు కూడా చైనా వెళ్లివచ్చారు. ఆ దేశ అధినేత షి జిన్ పింగ్‌తో భేటీ అయ్యారు. నాటో సభ్య దేశంగా, యూరప్‌లో కీలకశక్తిగా ఉన్న జర్మనీ రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్‌కు భారీగానే సాయమందిస్తోంది. అదే సమయంలో రష్యా పట్ల అంతగా కఠిన వైఖరిని అవలంబించడం లేదు. దానికి సొంత కారణాలు న్నాయి. ఇంధన తదితర రంగాల్లో జర్మనీ భారీగా రష్యాపైనే ఆధారపడటం ఇందుకు ప్రధాన కారణం. జర్మనీ సంకీర్ణ సర్కారులోని భాగస్వామ్య పార్టీలు కూడా మాస్కో పట్ల అంత విముఖంగా ఏమీ లేవు. రష్యాతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా అవి ఇష్టపడటం లేదు. రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచు కున్న జర్మనీ ఆయుధ సంపత్తిని సమ కూర్చుకోగానే ఫ్రాన్స్ మాదిరిగా తన గళాన్ని పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమిలోని స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ కూడా ఫ్రాన్స్, జర్మనీ బాటలో ప్రయాణించే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఇటలీని రష్యా మిత్రదేశంగా కూటమి అనుమానిస్తోంది. కూటమిలోని మరో కీలక ముస్లిం దేశం టర్కీ కూడా అమెరికా, రష్యాలకు సమానదూరం పాటిస్తోంది. వాస్తవానికి నాటోలో ఫిన్లాండ్ చేరికను టర్కీ గట్టిగా వ్యతిరేకించింది. చివరికి అమెరికా ఒత్తిడితో అయిష్టంగానే అంగీకరించింది. జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌లు ఇంతకుముందే యూరోపియన్‌తో చైనా బంధాన్ని బలపరిచాయి. స్థూలంగా చూస్తే అమెరికా మాదిరిగా నాటోలోని కొన్ని సభ్య దేశాలు చైనాతో ఘర్షణను కోరుకోవడం లేదు.


మెక్రాన్ వ్యాఖ్యలు, జర్మనీ వైఖరి నాటో కూటమి లోని కొన్ని దేశాల విధానాలు కలకలం రేపుతున్నాయి. మెక్రాన్ వ్యాఖ్యలను యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ప్రతినిధి తోసిపుచ్చారు. ఆయన తమ దేశ వైఖరి గురించి మాట్లాడాలి తప్ప మొత్తం యూరప్ గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. అమెరికాతో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కోరుకునే బదులు అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కోరుకుంటే మంచిది.. అని పోలండ్ ప్రధాని పేర్కొన్నారు. మొత్తానికి అమెరికా, దాని మిత్రదేశాల మధ్య విభేదాలు రగిలించడంలో చైనా సఫలమైందని చెప్పవచ్చు. తద్వారా ప్రపంచ రాజకీయాల్లో అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేసే ప్రయత్నాల్లో కీలక అడుగులు వేస్తోంది. ★



# భారతీయ సమైక్యతా మూర్తి ఆదిశంకరులు

**ఆదిశంకరులు కేవలం ఆధ్యాత్మిక గురువు, మతాచార్యుడు కాదు. సంస్కర్త. పీడిత జన బాంధవుడు. భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో మేరునగధీరుడు. సనాతన వైదిక ధర్మానికి విఘాతం కలుగుతూ, అంధవిశ్వాసాలు ప్రబలుతున్న సమయంలో జగత్తును జాగృత పరిచేందుకు ఆవిర్భవించిన చైతన్యదీప్తి. సమాజంలో సమానత్వం గురించి వేల సంవత్సరాల క్రితమే బోధించి, ఆచరించిన మహనీయుడు. శాంతియుత సమాజ స్థాపకులు. సంప్రదాయాలు వేరైనా పరమార్థం ఒక్కటేనని చాటి చెప్పిన విశ్వగురువు. నేటి కేరళ రాష్ట్రంలోని పూర్ణానదీ తీరంలోని కాలడి (కాలటి) గ్రామంలో వైశాఖ శుద్ధ పంచమి నాడు జన్మించి జగద్గురువుగా ఎదిగిన ఆయన జీవిత ప్రస్థానం కేవలం ముప్పయ్ రెండు సంవత్సరాలే అయినా యుగయుగాలకు తరగనంతటి ఆధ్యాత్మిక సంపదను ప్రోది చేశారు. తరచి చూస్తే ఆ ఆధ్యాత్మిక బోధనల వెనుక కాలాలకు అతీతంగా, ముఖ్యంగా నేటి యువతకు ఉపకరించే ఎన్నో అంశాలు దాగి ఉన్నాయి.**

సర్వమానవ కల్యాణానికి కంకణం కట్టుకున్న భారతీయ ఆచార్య ప్రవక్తలలో అగ్రగణ్యులు శంకర భగవత్పాదులు. ఆయన అవతారం జ్ఞానప్ర దాయ మైనది. సమాజంలో అస్తవ్యస్తత ఏర్పడినప్పుడు, ధర్మానికి హాని కలిగినప్పుడు, పరిస్థితులను చక్క దిద్దేందుకు భగవంతుడు ఏదో రూపంలో అవత రిస్తాడని భారతీయుల విశ్వాసం. శంకరుల అవతార తత్త్వం అలాంటిదేనని ఆస్తికుల నమ్మకం. సాక్షాత్ మహేశ్వరుడి అంశతో జన్మించిన ఆయన మూడేళ్ల వయసునాటికి దేశభాషలలో, ఐదేళ్లకు సంస్కృతంలో, ఏనిమిదేళ్లకు వేదశాస్త్రాలలో ప్రావీణ్యం సంపా దించారు. సర్వదా, సర్వధా సమాజ హితాన్ని శ్వాసించిన ఆయన శాంతియుత సమాజ స్థాపకులు. సంప్రదాయాలు వేరైనా పరమార్థం ఒక్కటేనని చాటి చెప్పిన మహామనీషి. వేళ్లూనుకుంటున్న దుష్ట సంప్ర దాయాలు, మూఢ విశ్వాసాల నుంచి సమాజాన్ని సక్రమ మార్గంలో నడపాలని, ఆధ్యాత్మిక భావనను పెంపు చేయాలని పసివయసులోనే సంకల్పించిన ఆయన అందుకు సన్యాసాశ్రమమే ఉత్తమమార్గంగా భావించారు. అదీ లోకేశ్వరుని సంకల్పంగానే పరిగణించారు.



నాలుగు ఆశ్రమాలలో దేశభ్రమణానికి సన్యాసమే అనుకూలం. బ్రహ్మచారి గురువు అంతేవాసిగా, గృహస్థు భార్యాబిడ్డలను గమనిస్తూ, అతిథి అభ్యాగ తులను సేవిస్తూ ఉండాలి. వానప్రస్థులు తపో ధ్యానాలతో గడపాలి. కానీ సన్యాసి ఏ ఒక్క చోట మూడు రాత్రులకు మించి గడపకూడదని శాస్త్రం. అందువల్ల లోకసంచారంలో భాగంగా అజ్ఞాన తిమిర వినాశనానికి, వేదాంతోపదేశానికి సన్యాసాశ్రమమే అత్యుత్తమైనదంటారు. అయితే, సన్యాసదీక్ష స్వీకరణకు మాతృమూర్తి అనుమతి తప్పనిసరి. ఒక్కగానొక్క కుమారుడి యతిదీక్ష నిర్ణయాన్ని తల్లి ఆర్యాంబ తొలుత అంగీకరించలేదు. ఒకనాడు తల్లితో కలిసి నదీస్నానానికి వెళ్లిన బాల శంకరుని కాలును నీటిలోని మొసలి పట్టుకుని ప్రవాహంలోకి లాక్కువెళుతుండగా, 'ఈ మకరి బారి నుంచి విముక్తి పొందాలంటే సన్యసించేందుకు అనుమతించు తల్లీ! నేను అల్పాయుష్కుడనని జ్యోతిష్యులు మొదటే చెప్పారు. సన్యాస జీవితం అంటే మరోజన్మ కనుక, ఈ గండం నుంచి బయటపడితే మరికొంత కాలం జీవిస్తాను' అని తల్లిని ప్రార్థించి ఆమె ఆమోదాన్ని పొందాడు. ఆ 'మరికొంత కాలం జీవితం' కూడా లోకోద్ధరణ కోసమేనన్నది ఈశ్వర సంకల్పం.

'మోక్ష మార్గాలన్నిటిలో జ్ఞానమార్గం అత్యంత ఉన్నతం, శ్రేష్ఠం. 'జ్ఞానాదేవతు కైవల్యం'... జ్ఞానం వల్ల మాత్రమే ముక్తి (కైవల్యం) లభిస్తుంది. జ్ఞానం అంటే కేవలం పాండిత్యం కాదు. 'జ్ఞ' అంటే తెలుసు కోవడం. దేనిని తెలుసుకోవడం? అనే ప్రశ్నకు 'సర్వం బ్రహ్మమయమనే సత్యాన్ని తెలుసుకోవడం అని శంకరవాణి. 'జ్ఞానం' అంటే సూర్యుడు అనీ పేర్కొ న్నారు. సూర్యోదయంతో అంధకారం విడిపోయినట్లు జ్ఞానమనే సూర్యకిరణాలతో అజ్ఞాన తిమిరం అంతరిస్తుందని వ్యాఖ్యానించారు. అలా జ్ఞానం ద్వారా పొందిన మోక్షం అక్షయం. ఏ విద్యకైనా గురువు అనుగ్రహం తప్పనిసరి. ముఖ్యంగా, జ్ఞాన సముపార్జనకు గురుకటాక్షం అవసరం. కుంటివాడు నడవగలిగినా, మూగవాడు మాట్లాడగలిగినా, విద్యా గంధం లేనివాడు పండితుడు కాగలిగినా గురుకృప వల్లనే. గురువు అనుగ్రహంతోనే ఆత్మవిద్యను సాధించుకోవాలి. అందుకు గురువును త్రికరణ శుద్ధిగా సేవించాలి' అని ఉద్బోధించారు. ప్రత్యక్షంగా కనిపించే గురువును కాదని కంటికి కనబడని శాస్త్రాధ్యయనం ద్వారా జ్ఞాన సముపార్జన యత్నం చేతిలోని నీటిని వదులుకొని మేఘంలోని జలాన్ని నమ్మినట్లే ఉంటుందన్నది పెద్దల మాట. అందుకే ఆయన శివాంశ సంభూతులైనా పాద చారులై గురువు కోసం అన్వేషణ సాగించి, నర్మదా నదీతీరంలో ఒక గుహలో ఉన్న గోవింద భగవత్పాదులను ఆశ్రయిం చారు. ఆ బాలుని అద్వైత జ్ఞానానికి, ఏకసంథాగ్రాహిత్వానికి ముగ్ధుడైన గోవిందులు ఆయనను శిష్యునిగా అంగీకరించారు. అలాంటి స్ఫూర్తిరూపి శిష్యుడిగా లభించడం భాగ్యంగా భావించి, బ్రహ్మ సూత్రాలు, మహా కావ్యాల విశేషార్థాలను వివరించారు. భావి 'జగద్గురువు' గురువును భక్తి శ్రద్ధలతో సేవించారు.

సమాధినిష్ఠలోని గురుదేవులను, పరిసర వాసులను ఉప్పొంగే నర్మద నది నీటి నుంచి కాపా డేందుకు జలాకర్షణ మంత్ర పఠనం ద్వారా నదిని తన కమండలంలో ఒడిసిపట్టిన గురుభక్త శిఖామణి, లోకహితైషి. పరమగురువు గౌడపాదులు (గోవింద భగవత్పాదులు గురువు) ఆదేశానుసారం బ్రహ్మ

సూత్రాలకు భాష్యం రాశారు. 'బ్రహ్మసూత్రాలకు తమరు భాష్యం రాస్తే బాగుంటుంది కదా?'అని గోవిందపాదులు ఒక సందర్భంలో వ్యాస భగవానుడికి మనవి చేశారట. అందుకు వ్యాస మహర్షి 'అందుకు మరొక మహాత్ముడు ఉద్భవించబోతున్నాడు' అని సమాధానమిచ్చారట. అది జ్ఞప్తిలో ఉన్న గోవిందులు 'నాయనా శంకరా! ఇది నీ కర్తవ్యం' అని ఆశీర్వపూర్వకంగా ఆదేశించారని ఐతిహ్యం.

'ప్రపంచాన్ని జయించిన వాడు విజేత కాదు.. తనను తాను జయించిన వాడే విజేత' అని స్వానుభవం పూర్వకంగా తెలుసుకున్న 'సత్యవేది' శంకరులు. కాశీ పురవీధుల్లో నాలుగు శునకాలతో ఎదురైన మనిషిని (ఛండాలుడు) 'దూరంగా తప్పుకో' అని కోరినప్పుడు 'తప్పుకోమన్నది నన్నా? నాలోని ఆత్మనా? ఆత్మకు అంటు ఉంటుందా? ఇరువురి శరీరాలు పంచభూతాల వల్ల ఏర్పడినవే. రెండు దేహాలు అన్నమయమే? అందరి శరీరాల్లోని ఆత్మ ఒక్కటే. మరి తేడా ఎక్కడ? మురుగు కాల్వపైనా, గంగాజలం పైనా సూర్యకాంతి ఏకకాలంలో ప్రతిఫలిస్తోంది. పసిడి కలశంలో ఉన్నా, మట్టికుండలో ఉన్నా నీటికి భేదం లేదు కదా?' అన్న ఆయన ప్రశ్నలు శంకరుల హృదయానికి జ్ఞాన కిరణాలుగా తాకాయి.

**సమస్త మానవాళిని సంసార దుఃఖ విముఖులను చేయాలని, సమాజంలో భక్తిమార్గాన్ని మరింత వ్యవస్థీ కృతంచేయాలన్న సంకల్పంతో మాతృమూర్తిని ఒప్పించి యతిదీక్ష స్వీకరించిన శంకరులు ఆమె అంతిమదశలో పుత్రధర్మం నిర్వర్తించారు. తల్లి అంతిమదశలో తిరిగి వస్తానని మాట ఇచ్చిన ప్రకారం, దేశాటనలో ఉన్న ఆయన కాలడి చేరు కున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించే అర్హత సన్యాసులకు లేదన్న ఊరివారి వాదనను కాదని స్వగృహంలోనే చితిని పేర్చి తల్లి పార్థివదేహానికి యోగాగ్నితో అంతిమసంస్కారం, ఉత్తర క్రియలు నిర్వహించారు.**

ఆ అపరిచితుడిని విశ్వేశ్వ రుడిగా గ్రహించి ప్రణమిల్లారు. శంకరులు శిష్యగణంతో 'భజ గోవిందం ...'స్మరణతో రామేశ్వరం పురవీధులలో సాగుతుండగా, అక్కడి శాక్తేయులు అభ్యంతరం చెప్పారట. భవానీ పూజాసక్తులకు తప్ప అన్యులకు ఊరిలోకి ప్రవేశం లేదనీ స్పష్టం చేశారట. అందుకు ఆయన చెరగని చిరునవ్వుతో 'భవానీ ఆరాధనే ముక్తిదాయకమనే మీ భావన సరైనది కావచ్చు. కానీ, అందరిలో ఉన్నది బ్రహ్మపదార్థమనే విషయాన్ని గుర్తెరిగి మీ పూజాదికాలు సాగించు కోండి. ఇతరులను, ఇతర పూజాదికాలను నిందించడం సరికాదు. అందరూ ఒకటే అనే దివ్య భావనతో చేసేదే నిజమైన ఆరాధన'అన్న హితవుతో ఆధ్యాత్మిక సమానత్వానికి పాదులు వేశారు.

గురుకులంలో విద్యాభ్యాస సమయంలో భిక్షకు వెళ్లిన ఆయనకు బ్రాహ్మణ స్త్రీ తమ ఇంట ఉన్న ఉసిరికాయను సమర్పించారు. ఆమె పేదరికానికి హృదయం ద్రవించి 'కనకధారా స్తవం'తో శ్రీమహాలక్ష్మిని ప్రసన్నం చేసుకోవడంతో ఆ ఇంట బంగారు ఉసిరికాయలు వర్షించాయని, ఇది ఆయన అద్భుత కార్యాలలో మొదటిదని చెబుతారు.

**షణ్మతస్థాపకాచార్యులు**

శంకరులు దేశభ్రమణ సమయంలో సుమారు ఆరు పదుల సంప్రదాయాలను గమనించారు. వాటిలో కొన్నిటిని మంచి (వైదిక) సంప్రదాయాలు, మరికొన్ని దుష్ట (అవైదిక)సంప్రదాయాలుగా గుర్తించారు. శ్మశానాలలో శవపూజలు, నరబలులు, జంతు బలులు, కపోలాలు, ఎముకలను ధరించి సంచరిస్తూ, ఎలాంటి సిద్ధాంతాలులేని అనాగరిక ఆచారాలను ఖండించారు. అవాంఛనీయ ఆచారాలను తొలగించి పూజా విధానాన్ని పరిపుష్టం చేశారు. దేశంలోని అనేక క్షేత్రాలు సందర్శించారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల నుంచి సాధారణ ఆలయాల దాకా ఒక యంత్రమో, ఆచారమో వారి అనుగ్రహమేనని చెప్పుకోవడం నేటికీ కనిపిస్తుంది. నేడు భక్తకోటి చేస్తున్న దేవీదేవతా స్తుతులలో అనేకం ఆయన గళం నుంచి ఆశువుగా జాలువారినవే. కనకధారా స్తోత్రం, సౌందర్య లహరి, శివానందలహరి, మహిషాసుర మర్దనీ స్తోత్రం లాంటివి ఆయనపెట్టిన ఆధ్యాత్మిక భిక్షే.

'సకల జీవరాశుల్లో మనిషి బుద్ధిజీవి. జీవరాశి క్షేమంపట్ల అనురక్తుడై ఉండాలి. సృష్టికి అంతా సమానమే. అందులో ఏ లోపం లేదు. ఉన్నదంతా మనిషి నడత, చూపులోనే. దానిని సరిచేసుకుంటే సమస్యే ఉండదు' అని వేదాంత భావనను అతి సులభ రీతిలో బోధించారు. అన్ని జన్మలలోకి మానవ జన్మ దుర్లభమైందని, అలాంటి జన్మను ప్రసాదించిన భగవంతుని గురించి ఆలోచనలేకుండా జీవితాన్ని గడపడం నిరర్థకమని ఉద్బోధించారు. భగవదారాధన జీవితంలో ఒక భాగం. నిజమైన భక్తికి ఆర్భాటాలు అవసరం లేదన్నది శంకర 'సూక్తి'. సర్వం పరమాత్మ అనే భావనతో భక్తి అనేది సంపూర్ణ విశ్వాసంతో నిండి ఉండాలి. జ్ఞాని అయిన భక్తుడు తన హృదయాన్ని భగవత్ మందిరంగా చేసి సర్వేశ్వరుడుని అందులో ప్రతిష్ఠిస్తాడు. ఈ పూజా విధానంలో ధూప దీప నైవేద్యాలతో నిమిత్తం లేదు. మనసునే వాటికి ప్రత్యామ్నాయంగా భావించాలి. అయితే కుదురులేని



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**


మనసుతో నిరాకార ఈశ్వరుడిని అర్చించడం కష్టసాధ్యంగా భావించి విగ్రహారాధనను సమర్థించారు. విష్ణువు, శివుడు, ఆదిత్యుడు, అంబిక, గణ నాథులను పూజించే పంచాయతన విధానాన్ని ప్రవేశ పెట్టారు. సామాన్యులలో భక్తిని మరింత ప్రచోదనం చేసేందుకు ముమ్మారు దేశవ్యాప్త పర్యటన చేశారు. ఎన్నో ఆలయాలను పునరుద్ధరించారు. నూతన ఆలయాల నిర్మాణానికి కృషి చేశారు. దేశం నలుదిశల పీఠాలు నెలకొల్పి, తన ముఖ్యశిష్యులను వాటికి అధిపతులుగా నియమించారు. ఉత్తరాదిన బదరీనాథ్‌లో జ్యోతిర్మఠం (తోటకాచార్యులు), తూర్పున పూరీలో గోవర్ధనమఠం (పద్మపాదుడు), పశ్చిమాన ద్వారకా మఠం (హస్తామలకుడు), దక్షిణాదిన తుంగానదీ తీరంలో శృంగేరి (సురేశ్వరా చార్యులు) మఠం అలా స్థాపితమైనవే . కైలాసగిరి నుంచి తెచ్చిన స్ఫటిక పంచలింగాలలో కేదార్‌లో ముక్తిలింగం, నేపాళంలో వరలింగం, చిదంబరంలో మోక్షలింగం, శృంగేరిలో భోగలింగం, తమ కంచి కామకోటి పీఠంలో యోగ లింగాన్ని ప్రతిష్ఠించి పూజించారు.

సమస్త మానవాళిని సంసార దుఃఖ విముఖులను చేయాలని, సమాజంలో భక్తిమార్గాన్ని మరింత వ్యవస్థీకృతంచేయాలన్న సంకల్పంతో మాతృమూర్తిని ఒప్పించి యతిదీక్ష స్వీకరించిన శంకరులు ఆమె అంతిమదశలో పుత్రధర్మం నిర్వర్తించారు. తల్లి అంతిమదశలో తిరిగి వస్తానని మాట ఇచ్చిన ప్రకారం, దేశాటనలో ఉన్న ఆయన కాలడి చేరు కున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించే అర్హత సన్యాసులకు లేదన్న ఊరివారి వాదనను కాదని స్వగృహంలోనే చితిని పేర్చి తల్లి పార్థివదేహానికి యోగాగ్నితో అంతిమసంస్కారం, ఉత్తర క్రియలు నిర్వహించారు. 'వేద బహిష్కృతులైన మీ స్థితి అలాగే ఉండనీయండి. మీకూ పరుల సహాయం అందకుండనే ఉంటుంది. మీ మీ ఇళ్ల దగ్గరే దహన సంస్కారాలు చేసుకోండి' అని మాతృవియోగ ఆవేదనతో అన్న నిష్ఠుర పలుకులు స్థానికులకు శాపమైంది. 'న మాతుః పరం దైవతమ్'..తల్లిని మించిన దైవం లేరన్న శాస్త్ర వాక్యానుసారం లోకాన్ని ఎదిరించి మాతృరుణం తీర్చుకున్న తృప్తి మిగిలింది.

**'సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం అస్మదాచార్య పర్యంతం వందే గురుపరంపరాం!!'**

# అగ్నిదళంలో

ఎండలు భగ్గుమంటున్నాయి. అగ్నిప్రమాదాలు తలెత్తి, ప్రాణాల్ని హరిస్తున్నాయి. ఎప్పుడు ఏ వార్త వినాల్సి / చూడాల్సి వస్తుందోనని జనం గుండెలు దడదడలాడుతున్నాయి. వేసవి, అగ్ని అనగానే మనందరి ఎదుటా ఠక్కున నిలచేది అగ్నిమాపక శాఖ. 'మాపక' అంటే కొలమానం అనే సాధారణ అర్థమున్నా, అగ్ని ప్రమాదాల్ని నిరోధించే, నివారించే విభాగంగానే దానికి పేరు. కారణమేదైనా, ఒకే క్షణంలో అంటుకునే అగ్గిరవ్వ... అంతా చూస్తుండగానే సమస్తాన్నీ భస్మీపటలం చేసేస్తుంది. ఎవరో ఒకరి, ఏదో ఒక అజాగ్రత్త ఎందరెందరి జీవితాలనో చీకటిమయంగా మార్చేస్తుంది. మన దేశానికి సంబంధించి, అగ్ని ప్రమాద నిరోధక ఉత్సవాలు ఏటా ఏప్రిల్‌లో ఏర్పాటవడం పరిపాటి. ఇంటా బయటా నిప్పును ఆర్పే బృందంలో సర్వసాధారణంగా పురుషులనే చూస్తుంటాం. కానీ, మహిళలూ ఉన్నారని ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆయా చోట్ల స్వచ్ఛందంగా / ఉద్యోగపరంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారనీ మనలో కొంతమందికే తెలుసు!



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

భారత్‌లో అగ్నిమాపక విభాగం ఏనాడో ప్రారంభమైంది. తెల్లదొరల పాలనలోనే అది రూపుదిద్దుకుంది. ఆ రీత్యా, శాఖ ఆవిర్భవించి ఇప్పటికి రమారమి ఎనిమిది దశాబ్దాలు. గతంలో ముంబయిలో ఒక ఓడకు నిప్పంటుకున్నప్పుడు అగ్నిమాపక విభాగ సిబ్బంది ప్రాణాలకు తెగించి రంగంలోకి దూకి పరిస్థితిని అదుపులోకి తేగలిగారు. ఆ నియంత్రణ పాటవాన్ని గుర్తు చేసుకుంటూ, మనమంతా వార్షిక ఉత్సవాలు జరపుకంటున్నాం. నిజానికి, ప్రమాదాల నివారణకన్నా వాటి నిరోధం మీదనే చూపుసారిస్తుంటారు. అందుకే స్వాతంత్ర్య అనంతరం మన బాలబాలికల పాఠ్యపుస్తకాల అంశంగా 'అగ్ని నుంచి భద్రత' చోటు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం విస్తృత ప్రచారోత్సవాలనీ నిర్వహిస్తూ వస్తోంది. ఇళ్లు, కార్యాలయాలతోపాటు విద్యా సంస్థలు, వైద్య నిలయాలు, పరిశ్రమలు, కర్మాగారాలు, దుకాణ సముదాయాల్లోనూ ప్రత్యేకించి మండుటెండల్లో అగ్ని ప్రమాదం పొంచి ఉంటుంది. అవే కాకుండా రైల్వేస్టేషన్లు, గోదాములు తదితర బహిరంగ ప్రదేశాల్లోనూ ఇదే ముప్పు ఉండనే ఉంటుంది మరి. అగ్నిప్రమాదాలను నియంత్రించి ప్రజల ప్రాణాలు, ఆస్తిపాస్తులను కాపాడేందుకు కొన్నిచోట్ల దళ అధిపతులుగా వనితలే ఉన్నారు! మన దేశానికి చెందినంత వరకు తొలి ఉద్యోగిని హర్షిణి. రెండు దశాబ్దాల కిందట ఓనాడు విధి నిర్వహణలో భాగంగా ఆమె బరిలోకి దిగారు. ప్రాణాల్ని పణంగాపెట్టి మరీ ప్రమాదాన్ని నియంత్రించ గలిగారు.

**ధీరచరిత లెందరో**

తమిళనాడులోని 'ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్' పేరొందిన ప్రభుత్వ సేవా బృందం. మంటల వంటి విపత్తుల్ని ఎదుర్కోవడం, బాధితులకు అన్ని విధాలా సహాయం అందించడం దాని ప్రధాన విధి. ఆ రాష్ట్రంలో, అదీ మన భారత్‌లోనే తొలిసారిగా ఒక మహిళా ఫైర్ ఆఫీసరుగా నియమితులయ్యారు. ఆమె పేరు మీనాక్షి. ఒక సందర్భంలో రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి, రాష్ట్రపతి పతకాన్ని అందుకున్న ధీరోదాత్త. అటు తర్వాత నియమిత అధికారిణి ప్రియ. కోయంబత్తూరులో బాధ్యత వహించినవారు. అదే రాష్ట్ర రాజధాని నగరంలోనూ తరువాతి కాలంలో పనిచేసి శక్తి సామర్థ్యాల్ని మరింతగా నిరూపించుకున్నారు. ముంబయి దళంలోకి పుష్కర కాలం క్రితమే వనితల్ని తీసుకోవడంతో, ఆ మేర సేవా సహాయాలు మరింతగా విస్తరించాయి. విస్తృతంగా చూస్తే, అత్యున్నత స్థాయిలో



తాన్యా

కమిషనర్ ఉండటమనేది విదేశాల్లో కనిపిస్తుంది. అదే పెద్ద శ్రేణి కార్యనిర్వాహక హోదా, కమాండింగ్ అధికారత్వం. ఫైర్ చీఫ్ ఆఫీసర్, ఫైర్ మాస్టర్... ఇలా ఎందరెందరో. అలనాడు అమెరికాలో మొదటి మహిళా అధికారి మోలీ. యునైటెడ్ కింగ్‌డమ్‌లో మేరీ. న్యూజిలాండ్‌లో అన్నేబారీ కెనడాలో వీరోచిత అతివలు మరెంతోమంది కనిపిస్తారు. క్వీన్స్‌లాండ్‌లో ప్రథమ అధికారిణి మిచెల్ అక్కడి స్టేషన్ ఆఫీసర్. జపాన్‌లో కవాసకి, పాకిస్థాన్‌లో షాజియా పరీవన్, టర్కీలో తులుంబాకే బహియ్రే.

**బాధ్యత ప్రభుత్వాలదే**

ప్రధానంగా అమెరికాకు చెందిన 'ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫైర్ ఫైటర్స్' ఉద్యోగినుల సంక్షేమానికి పలు సూచనలు చేసింది. ఇక ఆస్ట్రేలియాలో 'విమెన్ ఇన్ ఫైర్ ఫైటింగ్' పేరిట బోధక, శిక్షక, ప్రసార బ్లాగ్‌ల నిర్వహణ చేపట్టారు. అక్కడ స్వచ్ఛంద రీతిన కార్యకర్తల సేవలూ లభ్యమవు తున్నాయి. ఆసియాలో యువతులు అగ్నిమాపక పనిని వృత్తిగా ఎంచుకుంటూనే ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిన ఇంకా కొన్నిదేశాల్లో మే తొలివారంలో సిబ్బంది సంక్షేమ ఉత్సవాలు జరుపుతుంటారు. భారత్‌లో విమానాశ్రయాల వద్ద ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసులు నడుపుతుంటారు. వాటిల్లోని



మీనాక్షి



ప్రియా రవిచంద్రన్

# అతివల ప్రతిభ

ప్రథమ వనితా ఫైర్ ఫైటర్ తాన్యా. రోజూ పొద్దున్నే నిద్రలేచి, జాగింగ్ తదితర వ్యాయామాలు చేసి, డ్రిల్ –పెరేడ్ ముగించి, అతిపెద్ద నీటి పంపులూ నిచ్చెనల వాడకంపైన సమగ్ర శిక్షణ పొందే సాహసికురాలు. నిత్య సాధన, నిరంతర అప్రమత్తత వల్లనే అగ్ని నివారణ సులభ సాధ్యమవుతుందని చెప్తుంటారు. పోలీసు ఉద్యోగాలు సైతం నిర్వహించే లలనలకు ఆ శాఖలోని అంతర్భాగమైన అగ్ని మాపకంలో ఎందుకు ప్రోత్సాహం లభించడం లేదన్నది తెలుగు రాష్ట్రాలలో ప్రశ్న. ప్రోత్సాహకం అటుంచి, అసలు ప్రవేశం ఏ మేర అన్నదీ ప్రశ్నార్థకంగానే మిగిలి పోతోంది. తమిళనాడు సహా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఉన్నంత ప్రాతినిధ్యం ఇక్కడ ఎందుకు కనిపించడం లేదన్నదే గమనించాల్సిన అంశం. పొరుగు రాష్ట్రంలో ఫైర్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీగా కూడా స్త్రీ పనిచేస్తుంటే, ఈ రాష్ట్రాల్లో అసలు ప్రవేశాల ఊసే ఎందుకు ఉండదన్నది చర్చనీయం. గుజరాత్‌లోని పలు జిల్లా కేంద్రాలలో ఫైర్ విమెన్ ఉన్నారు. రాజస్థాన్‌లో ఒకేసారిగా వందల సంఖ్యలో నియామకాలు జరిపారు. ముంబయి ఫైర్ బ్రిగేడ్‌లో ఇన్‌స్పెక్టర్లుగా పడుతులనే నియమించారు. మరి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో విభిన్న పరిస్థితి ఎందుకన్నది ఆయా ప్రభుత్వాలే ఆలోచించుకోవాలి.

**సంకల్ప శక్తికి ఎదురేముంది?**

వనితా సాధికారత గురించి మాట్లాడనివారు లేరు. ఆడవారికి సమాన అవకాశాలివ్వాలన్న ప్రసంగాలకూ కొదవలేదు. తెలుగు రాష్ట్రాలు అందునా తెలంగాణ రాజధాని హైదరాబాద్ ప్రాంతంలో అగ్నిమాపక పరంగా కొద్దిమంది మహిళా సిబ్బంది కనిపించినా, ఆ కేటాయింపు సరిపోదు. ఉదాహరణకు ముంబయిని చూడండి... అక్కడి రెండు ఫైర్ స్టేషన్లకు సునీత, శుభాంగి నేతృత్వం వహిస్తున్నారు. గోవాలో కూడా శిక్షణ, కమ్యూనికేషన్ కర్తవ్య నిర్వహణల్లో మహిళలే కనిపిస్తారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలోను అగ్ని మాపక విభాగంలో పడతుల పాత్ర, ప్రాతినిధ్యం, ప్రశస్తిని ప్రభుత్వాలు పెంచాలని పరిపాలనా సంస్కరణల ప్రతిపాదనల వేదిక ఏనాడో సూచించింది. కర్ణాటక, ఇతర రాష్ట్రాల స్థితి గతులపైనా అధ్యయనాలు జరిపింది.

*మనం స్త్రీని భావించాలే కానీ–*
*వీరభరిత విస్ఫారిత*
*విజయ శౌర్య వాహిని*
*ఆమెను... చతుశ్శతము సుధాత్త*
*చంద్రకిరణ సముద్భూతగా*
*చూసివారే శౌర్యవాహినిగానూ*
*తిలకించగలరు.*
*గగనాంగణ మొక్క మహత్*
*కాంతికలితమై వెలిగెను!*
*అవనీ స్థలి నవ చైత*
*న్యాంకితమై విలసిల్లెను.*

అన్నట్లు – మధుర హృదయిని అయినా, ఆపద్బాంధవి అయినా, సమయ సందర్భాలను అనుసరించి ధీరచిత్తంతో సేవాంగణంలోకి దూకే సాహసి అయినా స్త్రీ మూర్తే. ఆ స్థిర సంకల్పం ముందు అగ్నిప్రమాదాల నివారణా సాధ్యమే! అంతటి మానసిక కాంతిని, సామాజిక చైతన్యాన్ని పాలకులే పరిరక్షించాలి. వనితా శక్తిని విస్తృతీకరించాలి. ★






# ప్రజాశ్రేణులను కదిలిం

భారత స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు నిర్వహించిన పాత్రకు సరైన స్థానం దక్కకుంటే ఆ మహా పోరాట చరిత్ర సమగ్రమని చెప్పడం సాధ్యం కాదు. కానీ నిజాం రాజ్యంలో తెలుగుపత్రిక పుట్టుకే ఒక చరిత్ర అని చెప్పుకోవచ్చు. ఆ సంస్థానంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు స్థానం లేదు. అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే తెలుగుకు విలువ లేదు. తెలుగుతో పాటు ఆ సంస్థానంలో భాగాలు కన్నడ, మరాఠీ జిల్లాలలోను ఆ భాషలకు గౌరవం లేదు. కేవలం 10 శాతం ప్రజలు మాట్లాడే ఉర్దూ రాజభాషగా చెలామణి అయింది. అలాంటి నేపథ్యంలో తెలుగు భాషా పత్రికలు పంటి బిగువున ప్రయాణం సాగించాయి. అటు బ్రిటిష్ ఇండియాలోను ఆంక్షల మధ్యనే భారతీయ భాషా పత్రికలు, భారతీయులు స్థాపించుకున్న ఆంగ్ల పత్రికలు మనుగడ సాగించవలసి వచ్చింది. అయినా అక్కడ ఆధునిక రాజకీయ తాత్వికతకీ, పరాయిపాలన ఫలితంగా జాతి కోల్పోయినదేమిటో తెలుసుకునేందుకూ ఉపయోగపడిన పునరుజ్జీవనోద్యమం మద్రాస్ ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంతంలో 19వ శతాబ్దం మధ్యలోనే ఆరంభమైంది. ఇందులో పత్రికల పాత్ర చరిత్రాత్మకమైనది. కానీ నిజాం అధీనంలోని తెలుగు ప్రాంతాలు లేదా తెలంగాణలో పునరుజ్జీవనోద్యమం 20వ శతాబ్దం తొలి రెండు దశకాలలోనే అంకురించగలిగింది. నిజాం సంస్థానంలో తెలుగు పత్రికల జననం అలా వెనుకపడిపోయింది.

ఇంత నిర్బంధంలోను పత్రికా రచనను నిబద్ధతతో నిర్వహించిన వారు ఎందరో ఉన్నారు. సువవరం ప్రతాపరెడ్డి, ఒద్దిరాజు సోదరులు, దేవులపల్లి రామానుజరావు, వీహెచ్ దేశాయ్, ఎంజె గోపాలనాయుడు, ఎంపీ స్వామి, అనంత, వి. భాస్కరరావు, ఏఆర్వీ చారి, కేవీస్ వైద్య వంటి వారు ఆ కోవలోని వారే. నిజాం సంస్థానంలో తెలుగు పత్రికల మీద ముస్లిం పాలకుడి అణచివేత ఉంటే, అతడిని సమర్థించే ఉర్దూ పత్రికల మీద ఆంగ్ల ప్రభుత్వం అజమాయిషీ ఉండేది. తెలుగు పత్రికల మీద 1947 వరకు నిజాం విధించిన ఆంక్షలు పాటిస్తే పత్రికలు వెలువడవు. ఆ నిబంధనలు ఇవి–


- బ్రిటిష్ ప్రభుత్వం మీద విమర్శ, తిరుగుబాటుకు రెచ్చగొట్టే వార్త, వ్యాఖ్య ఏదీ ప్రచురించరాదు.
- ఇస్లాం మీద, నిజాం ప్రభుత్వం మీద రాతలు కనిపించకూడదు.
- ప్రాథమిక హక్కుల గురించి అడగడం, అందుకు సంబంధించిన ఉద్యమాల వార్తలు నిషిద్ధం.
- భారత్ యూనియన్‌లో నిజాం సంస్థానాన్ని విలీనం చేయాలన్న ఏ డిమాండ్ గురించి ప్రచురించకూడదు.
- దొరల గురించి కూడా ఏమీ రాయకూడదు.

ఇలాంటి ఆంక్షల మధ్యనే 1948 వరకు నిజాం సంస్థానంలో భాషా పత్రికలు మనుగడ సాగించాయి.

నిజాం వ్యతిరేకోద్యమంలో పత్రికల పాత్ర అంటే నాలుగు భాషల పత్రికల పాత్ర గురించి సమీక్షించుకోవాలి. నిజానికి ఆరు భాషల పత్రికలు. తెలుగు, కన్నడ, మరాఠీ, ఉర్దూలతో పాటు; హిందీ, ఆంగ్ల పత్రికల గురించి కూడా తెలుసుకోవాలి.

తెలుగు ముద్రణ బెంగాల్‌లోని శ్రీరాంపూర్‌లో క్రైస్తవ మిషనరీల చొరవతో ఆరంభమైంది. తొలితరం తెలుగు పత్రికలన్నీ మద్రాస్ నగరంలోనే పురుడు పోసుకున్నాయి. నిజాం సంస్థానంలో తెలుగులో తొలిసారిగా అచ్చు పుస్తకాలు వేసిన ఘనత గద్వాల, వనపర్తి సంస్థానాలకు చెందుతుంది. ఇక్కడ పురాతన తెలుగు సాహిత్య గ్రంథాలు అచ్చువేశారు. 'విస్మృత రాజకవులు' వంటి అముద్రిత గ్రంథాలు అలా వెలుగు చూశాయి. మద్రాస్ ప్రెసిడెన్సీలో వెలువడిన తొలి తెలుగు పత్రిక 'వృత్తాంతి'. మండిగల వేంకట రాయశాస్త్రి అనే కడప ప్రాంత పండితుడు దీనికి సంపాదకుడని తెలుగు పత్రికా రంగ పరిశోధకులు చెబుతున్నారు. 1838–39 ప్రాంతంలో ఇది వెలువడిందని పరిశోధకుల అభిప్రాయం. 1887 సంవత్సరంలో మధ్యలో వెలువడిన 'సేద్యచంద్రిక' తెలంగాణలో వెలువడిన తొలి తెలుగు పత్రిక అన్న వాదన ఉంది. కానీ ఇది 1883లో ఆరంభమైన పుసూన్ అనే ఉర్దూ పత్రిక తెలుగు అనువాదమే. కాబట్టి 1913లో వెలువడిన 'హితబోధిని'కి తొలి పత్రిక గౌరవం దక్కాలి. దీని సంపాదకుడు శ్రీనివాసశర్మ. ఈ పత్రిక కొద్దికాలం మాత్రమే మనుగడ సాగించింది (ఈ వివరాలు 'జర్నలిజం ఇన్ ఆంధ్రప్రదేశ్: ఏ బ్రీఫ్ సర్వే' అనే పుస్తకంలో దేవులపల్లి రామానుజరావు నమోదు చేశారు. ఆ వ్యాసం ది తెలుగు ప్రెస్ ఇన్ తెలంగాణ). అంటే దాదాపు ఎనిమిది దశాబ్దాల తరువాతనే నిజాం రాజ్యంలో తెలుగు పత్రికలు ఉనికిని చాటుకోగలిగాయి. తొలితరం పత్రికలలో ఎక్కువ చిరకాలం ప్రచురణకు నోచుకోలేకపోయిన మాట వాస్తవం. అందుకు కారణం అక్షరాస్యత తక్కువ. ఆనాడు మొత్తం హైదరాబాద్ సంస్థానంలో అక్షరాస్యులు 3.9 శాతం. ఇక ఉర్దూ కాకుండా ఇక్కడి భాషా ప్రాంతాలలో అక్షరాస్యులు 2.4 శాతం.

'జర్నలిజం ఇన్ ఆంధ్రప్రదేశ్' కోసం దేవులపల్లి రామానుజరావు రాసిన వ్యాసంలోని కొన్ని వాక్యాలు ఇక్కడ గుర్తు చేసుకోవాలి. తెలంగాణలో నాడు ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసినట్టయితే, ఆ వాతావరణంలో పత్రికలు నిర్వహించిన పాత్రను మనం ప్రశంసించకుండా ఉండలేం అన్నారాయన. ఇది సత్యం. అయినా పునరుజ్జీవనోద్యమానికి తెలంగాణ ప్రాంతం మరీ దూరంగా ఏమీ ఉండి



డా. దేవులపల్లి రామానుజరావు

# చిన పత్రికలు



కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం

పోలేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్ర ప్రాంతంలో మొదట పత్రికలు జనించి, తరువాత గ్రంథాలయోద్యమం ఆరంభమైంది. నిజాం రాజ్యంలో మాత్రం మొదట గొప్ప గ్రంథాల యోద్యమం జ్వలించింది. తరువాతే పత్రికలు జనించాయి. కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం (1901, హైదరాబాద్), రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషా నిలయం (1904, హనుమకొండ), ఆంధ్ర సంవర్ధిని లైబ్రరి (1905, సికింద్రాబాద్), విజ్ఞాన చంద్రికా మండలి (1906, హైదరాబాద్) ఆవిర్భావం పత్రికల స్థాపనకు అనువైన ఒక వాతావరణాన్ని నిర్మించింది. అంతిమంగా ఇదే 1921లో ఆంధ్ర జనసంఘ ఆవిర్భావానికి దోహదపడింది. ఏడేళ్ల తరువాత ఇదే ఆంధ్ర మహాసభగా అవతరించింది. దానితోనే చరిత్ర నిజాం రాజ్య చరిత్రలో మలుపు తప్పలేదు. ఆ విధంగా నిజాం విముక్తి ఉద్యమంలోను పత్రికలు సముచిత స్థానాన్ని సాధించుకున్నాయి.

తెలుగు భాషకే గుర్తింపు లేని నిజాం రాజ్యంలో తెలుగు పత్రికల స్థాపన, మనుగడ అసిధారావ్రతమే అయింది. అధికారుల అనుమతి మేరకే కొన్ని సభలు, ఉత్సవాలు జరుపుకుంటున్నా కూడా, ప్రజా చైతన్యం వెల్లువెత్తుందని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భయపడ్డాడు. బహిరంగ సభలను నిషేధిస్తూ 1921లో ప్రత్యేక ఫర్మానాను విడుదల చేశాడు. అందులోనే గస్తి నం. 53 కూడా ఉంది. భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు తొడిగిన నిబంధన ఇదే. నిజాం ప్రభువు పతనం కావడానికి ఒక్క సంవత్సరం ముందు కూడా అంటే 1947 సంవత్సరం జూలై 29, సెప్టెంబర్ 18న కూడా ఆంక్షలతో ఫర్మానాలను విడుదల చేస్తూనే ఉంది. అంటే నిజాం రాజ్య పత్రికల చరిత్ర మొత్తం వాటి అణచివేత చరిత్రే.

ఇలాంటి నిషేధాజ్ఞలకు నిజాం వ్యతిరేక పోరులో ఆర్య సమాజం క్రియాశీలకంగా ఉన్నప్పుడు జరిగిన పత్రికా సమరం కూడా కారణం కావచ్చు. 'వైదిక ఆదర్శ' ఆర్య సమాజ్ పత్రిక. రహబరే దక్కన్, సబహే దక్కన్ నిజాం సర్కారు పోషణలోని పత్రికలు. ఈ రెండూ ఆర్య సమాజ్ మీద, ఇది నిర్వహిస్తున్న శుద్ధి ఉద్యమం మీద విమర్శలు గుప్పించేవి. ఆ విమర్శలను వైదిక ఆదర్శ ఖండిస్తూ ఉండేది. అలాంటి నిషేధాజ్ఞలను 1921లోనే తేవడానికి మరొక స్పష్టమైన కారణం కనిపిస్తుంది. అదే సంవత్సరం నవంబర్ 12న హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయవాది టేకుమాల రంగారావు ఇంట్లో జరిగిన సమావేశం. ఆయన ఇంట్లో పదకొండు మంది తెలుగు పెద్దలు సమావేశం కావడమే ఆంధ్రోద్యమానికి అంకురార్పణ. ఈ సమావేశంతోనే ఏర్పాటు చేసుకున్న ఆంధ్ర జనసంఘ వ్యాప్తికి నాలుగు సాధనాలను ఎంచుకున్నారు. బహిరంగ సభలు, ప్రదర్శనలు, పత్రికల ద్వారా ఉద్యమ ప్రచారం అందులో ఉన్నాయి. అందుకు అనుగుణంగా వెలువడినదే 'నీలగిరి' (ఆగస్ట్ 22, 1922) పత్రిక (ఆంధ్రజాతి అక్షర సంపద తెలుగు పత్రికలు, పొత్తూరు వెంకటేశ్వరరావు). స్థాపకులు– షబ్నవీసు వెంకట రామనరసింహారావు. 1920– 1930 మధ్య కాలంలో దాదాపు 45 పత్రికలు వెలువడినాయి. షబ్నవీసు అంటే చీకటిలో కూడా రాయగలిగినవాడు అని అర్థం. అదే ఇంటిపేరు కలిగిన ఇతరుల విషయం ఎలా ఉన్నా, రామనరసింహారావు విషయంలో మాత్రం ఇది సార్థకమే. ఏ దీపమూ కనిపించని కాలంలో పత్రికారంగంలో చిరుదివ్వెను వెలిగించారు.

నల్లగొండ నుంచి వెలువడిన 'నీలగిరి' ఆంధ్ర మహాసభ విశేషాలను నిర్భీకతతో ప్రచురించింది. ఆంధ్రోద్యమానికి ప్రేరణ ఇచ్చే వ్యాసాలు ప్రచురించింది. రామనరసింహారావు స్వయంగా తెలుగు, ఉర్దూ భాషలలో నిష్ణాతులు. బూర్గుల రామకృష్ణరావు, మాడపాటి హనుమంతరావు వంటివారు ఈ పత్రికలలోనే వ్యాసాలు వెలువరించేవారు. ఇది ఐదేళ్లు నడిచింది.

నీలగిరి ఆరంభమైన మూడు రోజుల తరువాత ప్రచురణ ప్రారంభించిన పత్రిక 'తెనుగు పత్రిక'. డాక్టర్ ఒద్దిరాజు సీతారామచంద్రరావు (సంపాదకుడు), ఆయన తమ్ముడు రాఘవ రంగారావు (ఉపసంపాదకుడు) ఈ పత్రికను వరంగల్ జిల్లాలోని ఇనుగుర్తి నుంచి వెలువరించారు. వీరే ఒద్దిరాజు సోదరులు. ఇది కూడా ఆంధ్రోద్యమానికి సహకారం అందిస్తూ ఉండేది.


సురవరం ప్రతాపరెడ్డి


షోయబుల్లా ఖాన్





“ఓరుగల్లు సామ్రాజ్యమంతరించిన తరువాత 600 సంవత్సరములు గాఢ నిద్రలోనున్న తెలంగాణను మేలుకొలిపి వైజ్ఞానిక, సాంఘిక, రాజకీయ చైతన్యమును కలిగించుటలో ఈ పత్రిక చేసిన సేవ అపారము” ఇది గోలకొండ పత్రిక గురించి కొండా వెంకటరంగారెడ్డి స్వీయ చరిత్రలో రాసుకున్న విషయం. మే 10, 1925న ఈ పత్రికను తన మిత్రుల సహకారంలో సురవరం ప్రతాపరెడ్డి హైదరాబాద్‌లో స్థాపించారు. తెలంగాణ పత్రికారంగ చరిత్రలో ఇదొక మైలురాయి. అధికారుల నుంచి హెచ్చరికలు వస్తున్నా వాటిని ఖాతరు చేయకుండా పత్రికను నడిపిన ధీశాలి ప్రతాపరెడ్డి. రాజకీయ చైతన్యంతో పాటు, తెలంగాణ ప్రాంత కవుల మీద కూడా ఈ పత్రిక ప్రత్యేక దృష్టిని పెట్టింది గోలకొండ. నిజాం రాజ్యంలో స్థితిగతులను వాస్తవంగా వెల్లడించ డానికి ఆవిర్భవించిన ఈ పత్రిక సంపాదకీయాలు నిజాంను కంగారు పెట్టేవన్న పేరు ఉంది.

మరొక రెండు వారపత్రికలు కూడా తెలంగాణ పత్రికారంగ చరిత్రలో కీలకమైనవి. అవే దివ్యవాణి, భాగ్యనగర్. ఇందులో దివ్యవాణిని చివుకుల అప్పయ్యశాస్త్రి , భాగ్యనగర్ పత్రికను ప్రసిద్ధ సంస్కర్త భాగ్యరెడ్డి ఆరంభించారు. చాలాపత్రికల కంటే భిన్నంగా భాగ్యనగర్ పదిహేనేళ్లు వెలువడింది.


1938 ప్రాంతంలో నిజాం రాష్ట్ర కాంగ్రెస్ బలపడడం, హక్కుల పట్ల చైతన్యం పెరగడంతో రాజకీయ పత్రికల స్థాపనకు చొరవ కూడా పెరిగింది. హైదరాబాద్‌కు చెందిన బీఎన్ శర్మ విజయవాడ వెళ్లి ఆంధ్రవాణి అన్న పత్రిక ప్రారంభించారు. 1938 నాటి సత్యాగ్రహోద్యమాన్ని ఈ పత్రిక సమర్థించింది. కానీ ఇది ఆర్థిక ఇబ్బందులతో అనతికాలంలోనే మూతపడింది.

1940 దశకం నాటి తెలంగాణ పత్రికారంగ చరిత్రలో విశిష్టమైన ఘట్టం ‘మీజాన్’ పత్రిక. అప్పటికి నిజాంకు మద్దతుగా వెలువడుతున్న ఏకైక పత్రిక ఇదొక్కటే. బొంబాయికి చెందిన కలకత్తావాలా అనే నిజాం సన్నిహితుడు మూడు భాషలలో అదే పేరుతో పత్రిక ఆరంభించారు. 1943-44 ప్రాంతంలో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషలలో దీనిని వెలువరించారు. ఇది పూర్తిగా నిజాంను సమర్థించ డానికి ఉద్దేశించిన పత్రిక. కానీ తెలుగు మీజాన్‌లో మాత్రం నిజాం వ్యతిరేకోద్యమ వార్తలు వచ్చేవి. తెలుగు మీజాన్ సంపాదకుడు ప్రఖ్యాత నవలాకారుడు, గాంధేయవాది అడవి బాపిరాజు. ఇందులో పనిచేసిన వారంతా తరువాత తెలుగు పత్రికారంగంలో మణిపూసలుగా చరిత్రకెక్కారు. విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర, శ్రీనివాస శిరోమణి, రాంభట్ల కృష్ణమూర్తి అందులో పనిచేశారు. మీజాన్ పత్రిక గురించి రాంభట్ల రాసిన మాటలు గమనించదగినవి (జర్నలిజం ఇన్ ఆంధ్రప్రదేశ్). క్విట్ ఇండియా ఉద్యమ సమయానికి చాలామంది సంస్థానాధీశులు వాస్తవికతను గుర్తించారు కాని, నిజాం మాత్రం స్వాతంత్ర్య భావనలను అర్థం చేసుకోవడానికి నిరాకరించాడు. పైగా శ్వేతజాతి




ప్రభుత్వం వైపు మరింతగా మొగ్గడం ఆరంభించాడు. ఆ సమయంలోనే అధిక సంఖ్యాకులైన తెలుగు మాట్లాడేవారిలో వేధావుల కోసం మీజాన్ ప్రారంభమైందని రాంభట్ల అన్నారు. ఆ క్రమంలోనే కలకత్తావాలా బొంబాయి నుంచి హైదరాబాద్ వలస వచ్చాడు. మిగిలిన రెండు భాషలలో వెలువడిన మీజాన్ కంటే తెలుగు మీజాన్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడానికి కూడా కారణం అదేనంటారు రాంభట్ల. మూడేళ్లు పనిచేసిన అడవి బాపిరాజు రజాకార్ల దౌర్జన్యాలు చూసి మనస్తాపంతో రాజీనామా చేసి వెళ్లిపోయారు. 1944లో పాములపర్తి సదాశివరావు స్థాపించిన పత్రిక ‘కాకతీయ’. ఇది ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాల వ్యాప్తికి కృషి చేసింది. కానీ ఆ సంవత్సరమే మూతపడింది.

ఈ వ్యాసం మొదట్లోనే చెప్పుకున్న రయ్యత్ పత్రిక అందించిన మరొక గొప్ప జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్. అందులో పనిచేసిన అనుభవంతో షోయబుల్లా ‘ఇమ్రోజ్’ పేరుతో ఒక పత్రిక ప్రారంభించారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని కోరుతూ ఏడుగురు ప్రముఖులు తయారు చేసిన వినతిపత్రాన్ని షోయబ్ తన పత్రికలో ప్రచురించారు. దీనిని ప్రచురించిన ఆ చేయి నరికేస్తామని ఆగస్ట్ 19, 1948న రజాకార్ నేత ఖాసిం రజ్వీ ప్రకటించి, అన్నంత పనీ చేశాడు. కాచిగూడలోనే ఆయన పత్రికా కార్యాలయం ప్రాంగణంలోనే ఈ దురాగతం జరిగింది. ఆ మరునాడే షోయబ్ కన్నుమూశారు. ★


నీలగిరి

చక్కని తెలుగు వార పత్రిక

ఇది

నైజాము రాష్ట్రమునుండి మొట్టమొదట వెలువడి 12 పుటలపై ముద్రింపబడి క్రమముగా నడుప బడుచున్నది

ప్రతి శుక్రవారమున ప్రకటింప బడును.

ప్రతిసంవత్సరమనేక రూపపటములతో సంవత్సరాది పంచాంగములో వివిధ వ్యాసములతో మూడురంగుల ముఖపత్రముతో గూడుకొనిన నీలగిరి [illegible] ప్రకటింపబడుచున్నది

సం॥ చందా॥ రూ 4-8-0 [illegible] ముందుగా మనిఆర్డరు పంపవలెను

“నీలగిరి” [illegible]

నల్లగొండ

(నిజాము)


మీజాన్

(13-6-47)

హైదరాబాదు సంస్థానం స్వాతంత్ర్యము వహిస్తుంది

ఈరాజ్యము ముస్లింలకు హిందువులకు అవిభాజ్యపు హక్కు

భారతదేశము రెండవపుటవల్ల ఇట్లు నిశ్చయించినాము



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

# పేరు మారినా... ఉనికి మారునా...





**చైనా, టిబెట్ సరిహద్దు సమస్య మీద 1914లో బ్రిటిష్ ఇండియాలో జరిగిన సమావేశానికి సర్ హెన్రీ మెక్‌మహన్ బ్రిటిష్ ప్రతినిధిగా వ్యవహరించాడు. నార్త్-ఈస్టర్రన్ ఫ్రాంటియర్ ఏజన్సీ (నేఫా)కి, చైనా టిబెట్ సరిహద్దును నిర్దేశించి దానికే 'మెక్‌మహన్ రేఖ'అని పేరు పెట్టారు. మార్చి 24, 1914న సిమ్లా సమావేశంలో ఇండియా, టిబెట్ ఆ రేఖ సరిహద్దుగా అంగీకరించాయి. 1949లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆవిర్భవించడంతో సమస్య మొదలయింది. 1954 నుంచి చైనా వాస్తవాధీన రేఖ వెంబడి దురాక్రమణ చర్యలు ప్రారంభించింది. 'మెక్‌మహన్' ఒప్పందం గురించి తాను ఎన్నడూ వినలేదనీ, టిబెట్ అలా అంగీకరించే హక్కే లేదని వితండవాదన ప్రారంభించింది. నేఫా ప్రాంతంలో 32 వేల చదరపు మైళ్ల భూభాగాన్ని ఆక్రమించే యత్నాలను ముమ్మరం చేసింది.**

1958లో రెండు దేశాల మధ్య తలెత్తిన 'బారాహోటీ' (చైనాలో వూజె) వివాదాన్ని పరిష్కరించుకోవడానికి కూడా చైనా సహకరించలేదు. పైగా 1959లో వాస్తవాధీన రేఖ వెంబడి లద్దాఖ్ సరిహద్దులు తమవేనంటూ వాదించి, పాత మ్యాప్‌లను తిరస్కరించింది. భారత్ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954 అక్టోబర్‌లో చైనా పర్యటన సందర్భంగా, శతాబ్దాల కాలం నాటి మ్యాప్‌ల ప్రకారం, సరిహద్దు పరిస్థితిని వివరించి, ధ్రువీకరించినా చైనా వెనక్కి తగ్గలేదు. 1950లో మెక్‌మహన్ గురించి ఏమీ మాట్లాడని చైనా, 1959లో ఆక్రమణల వ్యూహం ఎత్తుకుంది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగం కాదని, రహదారుల నిర్మాణం నిలిపివేయాలని గగ్గోలు ప్రారంభించింది. మాస్కోలో వెలువరించిన కొత్త పంచశీలపై భారత్, చైనా తరపున నెహ్రూ, చౌఎన్‌లై చేసిన సంతకాల తడి ఆరక ముందే ఆక్రమణల వివాదాలకు తెరలేపింది. 1960లో నెహ్రూ ఆహ్వానంపై చౌఎన్‌లై ఢిల్లీ వచ్చారు. 1962 మే నాటికి లద్దాఖ్‌లో చైనా సైన్యం మోహరించింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో ఆక్రమణలకు పాల్పడింది. ఒక నెలలో చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీతో, ఇండో–చైనా యుద్ధంలో చైనా 14,700 చదరపు మైళ్లు (38 వేల చ.కి.మీ.) స్వాధీనం చేసుకోగలిగింది. భారత్ అక్సాయ్‌చిన్ కోల్పోయింది.

మిలటరీ పరిభాషలో 'సలామీ స్లైస్'అనే యుద్ధ వ్యూహం ఉంది. చుట్టు పక్కల దేశాలతో మిత్రత్వం నటిస్తూ, శాంతివచనలు వల్లెవేస్తూ, అదను చూసుకుని వారి భూభాగాలను కొద్దికొద్దిగా కబళించే వ్యూహం అది. ఆ కుటిల సమర తంత్రం కమ్యూనిస్టు చైనాకు వెన్నతో పెట్టిన విద్య. 'ఇదేమిటి?' అని ప్రశ్నించే ఇరుగు పొరుగు దేశాలతో గిల్లికజ్జాలు, తగవులు, సంఘర్షణలు, కబ్జాలు, ఎత్తుగడలతో బెదిరించిన తర్వాత, సైనిక చర్యలతో యుద్ధానికి తలపడడం అందులో భాగం. ఆక్రమించుకున్న ప్రాంతాలలో ఈలోగా రహదారులు, వంతెనలు, రైలు మార్గాలు, జలవిద్యుత్ ఉత్పత్తులు వంటి నిర్మాణాలు ప్రారంభించి, క్రమేపీ ఆధిపత్యాన్ని ఖరారు చేస్తూ రెచ్చగొడుతుంది. 1962 నుంచి ఇవాళ్టి వరకు (2023) అరవై ఏళ్లయినా చొరబాట్లు, రెచ్చగొట్టడాలు, ఆక్రమణలకు పాల్పడుతూనే, యుద్ధానికి సిద్ధమవుతూనే, సంప్రదింపులు, చర్చల నాటకాన్ని కొనసాగిస్తోంది. 1962 తర్వాత నాథులా, ఛోలా (1967), తులుంగ్ లా (1975), సుమ్ దొరాంగ్ చు (1986–87) యుద్ధ విరామాల మధ్య కొంత ప్రశాంతతకు తావిచ్చింది. ఆపై మిలిటరీ సన్నద్ధం, చొరబాట్లు ప్రారంభం మామూలే. 1993లో శాంతి ఒప్పందాలు కుదిరినా, 2013 నాటికి డెస్పాంగ్ లోయలో 19 కి.మీ.లు చొచ్చుకు వచ్చింది. 2020 ఏప్రిల్, మేలలో గల్వాన్ సమరం ద్వారా దురాక్రమణకు పాల్పడింది. ఒప్పందాలను అతిక్రమించి వెనక్కి తగ్గకుండా సాధ్యమైనంతగా దురాక్రమణ పర్వం కొనసాగించడాన్ని ప్రపంచం మొత్తం చైనాను 'జియోపొలిటికల్' విపత్కర దేశంగా పరిగణిస్తోంది.

1993, 1996, 2005, 2013, 2020 సంవత్సరాలలో ఆసియా దిగ్గజాలు సరిహద్దుల సమర సంఘర్షణలు, సంప్రదింపులు, చర్చలు, విరామ సమావేశాలు నిర్వహించాయి. అయినా యుద్ధ సన్నాహం నిరంతరం కనిపిస్తూనే ఉంది. ఈ మధ్య 11 రౌండ్‌ల చర్చల తర్వాత చైనా–ఇండియా సరిహద్దు వ్యవహారాలపై బీజింగ్‌లో ఫిబ్రవరి 22, 2023న 26వ 'వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్టేషన్ అండ్ కో ఆర్డినేషన్ (డబ్ల్యుఎంసీసీ) వీడియో సమావేశం నిర్వహించింది. ఫలితం ఏమిటి? ప్రస్తుత 4 వేల కిలోమీటర్ల వాస్తవాధీన రేఖ వెంట సరిహద్దు ప్రాంతాలలోని సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రథమ ప్రధాని నెహ్రూ నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకు చేసిన ప్రతిపాదనలు ఏవీ చైనా ఎన్నడూ అంగీకరించదు.

అరుణాచల్‌ప్రదేశ్ భారత్ అంతర్భాగం. ఫిబ్రవరి 20, 1987న రాష్ట్రంగా ఏర్పడింది. చైనా, భూటాన్, మయన్మార్‌లు సరిహద్దులుగా గల ఈ రాష్ట్రానికి 1863 కి.మీ. పొడవున చైనా సరిహద్దు ఉంది. ఈ మొత్తంలో 1126 కి.మీ.లు టిబెట్‌తో ఉంది. 'జంగ్నాన్' లేదా సౌత్ టిబెట్ తనదంటూ 11 స్థావరాలకు మేండరిన్, టిబెటిన్, ఇంగ్లీష్ పేర్లు ప్రామాణికం అంటూ, పాత పేర్లు మార్చినట్టు ఏప్రిల్ 2, 2023న చైనా ప్రభుత్వ పౌర మంత్రిత్వ వ్యవహారాల ప్రకటించింది. వాటిలో ఐదు పర్వత శిఖరాలు, రెండు జనావాస ప్రాంతాలు, రెండు భూప్రాంతాలు, రెండు నదులు ఉన్నాయి. ఇదంతా తూర్పు సెక్టార్‌లో 90 వేల చ.కి.మీ.లు ఆక్రమించే కుటిల పన్నాగానికి సన్నాహక వ్యూహం. పైగా చైనా సార్వభౌమ దేశ పరిరక్షణ, జాతీయ భద్రత, రక్షణకు జనవరి 1, 2022న చేసిన బోర్డర్ చట్టం ప్రకారం, ఆ ప్రాంతాలన్నీ తమవిగా ప్రకటిస్తోంది. ఇటీవల, అంటే ఈ ఏప్రిల్ 10వ తేదీన భారత్ హోం శాఖ మంత్రి అమిత్ షా అరుణాచల్‌లో పర్యటించి 'సూది మొన మోపినంత ప్రదేశం కూడా వదిలే ప్రసక్తి లేదు'ని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. యథాప్రకారం చైనా, భారత హోం మంత్రి అరుణాచల్‌లో అడుగు పెట్టడాన్ని నిరసించింది. ★



**జయసూర్య**, సీనియర్ జర్నలిస్ట్

కథ

# సహవాసం

పెనుమాక నాగేశ్వరరావు

**‘అక్కడ ఏం దాచిపెట్టారూ! నాకు తెలీక అడుగుతానూ” కోపంగా అన్నాను అమ్మానాన్నలతో.**

**ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు తప్ప నాకేం సమాధానం చెప్పలేదు.**

**‘ఇక్కడ పిల్లలతో కాలక్షేపం చేయవచ్చు. మీకు ఒంట్లో నలతగా ఉంటే నేను, రాధిక ఉన్నాం. మాకూ మీ ఇద్దరూ ఇంట్లో ఉంటే అదో ధైర్యము, సంతోషము. అందరం కలసి ఉంటే బాగుంటుంది కదా? మీరెందుకు వారానికోసారి వెళ్తామంటారు?’ నా మాటల్లో అసహనం ధ్వనించకపోలేదు.**

‘మళ్లీ నీ దగ్గరికే వస్తాంగా నాన్నా......... కాకపోతే ఓ నెల రోజులు అక్కడ ఉండి, అక్కరలేని సామానంతా అవతల పారేసి, ఉపయోగపడేవాటిని సర్దుకుందామని, తెలిసిన వాళ్ల కందరికి చెప్పి వద్దామని వెళ్లటం.. అంతే’ క్లుప్తంగా చెప్పింది అమ్మ.

‘పదో పరకో ఇవ్వాల్సిన వాళ్లకి ఇచ్చి, మనకి రావలసినవి ఏమైనా ఉంటే తీసుకుని రావచ్చు గదా అని కూడా ఆలోచిస్తున్నా’ ఆచితూచి అన్నాడు నాన్న.

“మీ ఇద్దరికీ అక్కడికి వెళ్లాలని మహా ఆరాటంగా ఉందని నాకు తెలుసు. అందుకు ఏవేవో సాకులు చెబుతున్నారనీ తెలుసు. పిల్లలు మీరున్నన్ని రోజులూ సంతోషంగా ఉన్నారు. నేనూ రాధిక కూడా చాలా సార్లు అనుకున్నాం మీరు ఉంటే ఇల్లు గలగలమంటూ కళకళ లాడుతున్నదని. తాను కూడా మిమ్మల్ని ఇక్కడే ఉండమని కోరుకుంటున్నది. ఈ రోజుల్లో ఏ కోడలు అలా కోరుకుంటున్నది చెప్పండి. మిమ్మల్ని వెళ్లమని మేమెవ్వరం కోరుకోవటంలేదు.” మనస్ఫూర్తిగా అన్నాను.

“నువ్వింతగా చెప్పాలా గోపాలా....... నిన్ను కన్నవాళ్లం, నీ మనసేమిటో మాకు తెలీదా? నీ



చేత ఇన్నిసార్లు అడిగించుకోవటం మాకూ చిన్నతనంగానే ఉంది. ఇవ్వాళ కాకపోతే రేపైనా నీ దగ్గరకు రావాల్సిన వాళ్లమేగా నాయనా. వస్తాం, ఉంటాం. కాకపోతే మీ నాన్న చెప్పినట్లు అక్కడి పనులన్నీ చక్కబెట్టుకుని ఓ నెల రోజుల్లో తిరిగి వద్దామని ఆలోచన" సున్నితంగా చెప్పింది అమ్మ.

"సరే మీ ఇష్టం. కానీ ఎంత తొందరగా తిరిగి వస్తే అంత మంచిది. మీ ఆరోగ్యం కూడా చూసుకోవాలి కదా. నాకు అక్కడికి వచ్చి ఉండటం కుదరని పని అని మీకు తెలిసిందే. నన్నూ, పిల్లల్నీ ఇక్కడ ఉంచి రాధిక రావటమూ కుదరదు. మీరు ఇక్కడ ఉంటేనే మీకూ, నాకూ అనుకూలం. ఇల్లు కొంచం ఇరుకే......కాదనను. కానీ ఎలాగోలా ఇక్కడే సర్దుకుందాం. సరిపుచ్చుకుందాం కొన్నాళ్లు. కొంత ఇబ్బంది ఉన్నా సంతోషంగా ఉందాం." మనసులో మాటల్ని బయట పెట్టాను.

వారి ప్రయాణానికి ఒప్పుకున్నాననే ఆనందం వాళ్ల ముఖాల్లో స్పష్టంగా కనిపించింది. ఒకర్నొకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకున్నారు. వారి సంతోషం చూసి నాకు ముచ్చటేసింది. "రేపు ఆదివారం బయలుదేరండి మరి.. మిమ్మల్ని దింపి వెనక్కి వస్తాడు మానస్. నాకు కుదరకపోవచ్చు" అన్నాను వాళ్లనే చూస్తూ.

మరీ మర్నాడే ప్రయాణం అనుకోగానే వాళ్ల ముఖాలు మరింతగా వెలిగిపోయినై. పైగా మనవడితో అంటే మరీ ఆనందం. అమ్మా వాళ్లని మాతోనే ఉంచుకోవాలని నాకు, మా ఆవిడకు గట్టి కోరిక. కానీ వాళ్ల కోరిక వేరేగా ఉంది.

* * *

"ఏంది మూర్తిగారూ రోజుకంటే ముందే బయలుదేరినావు... పైగా మనవడ్ని వెంటపెట్టుకుని మరీ కదిలావు. ఏంది కథ? రాత్రి సరిగా నిద్ర పట్టలేదా ఏంది" నవ్వుతూ పలకరించాడు రాజు.

'అదేం లేదయ్యా...శుభ్రంగా నిద్రపోయాను. ఓ పదినిమిషాలు అటు ఇటు అంతే" అంటూనే అడుగులు ముందుకు వేశాడు మూర్తి.

"ఆయన ఎవరు తాతయ్యా" అడిగాడు మనవడు మానస్.

"అతను రాజు. గత పాతికేళ్లుగా ఇక్కడే బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ ఉంటున్నాడు. అతని భార్య, కొడుకు, కోడలు కూడా ఇదే పని. ఈ చుట్టుపక్కల వారందరూ ఇతని దగ్గరే బట్టలు ఇస్త్రీ చేయించుకుంటారు" ఓపిగ్గా చెప్పాడు.

"ఏం మాష్టారూ మనవడా...... పెద్దబ్బాయ్ కొడుకేగా...వాళ్లు రాజమండ్రి లోనేనా ఉండటం"

"అవును సుబ్బయ్యా... పెద్దబ్బాయ్ కొడుకే. వచ్చే ఏడు పదో తరగతి చదవాలి"

"మీ ఇంట్లో చదువులకేంలే మాష్టారూ..... మీ ఇంట్లో అందరూ టీచర్లయ్యే!" అంటూనే ఇడ్లీ పాత్రని పొయ్యిపై పెట్టాడు సుబ్బయ్య. అంతలోనే ఆయన భార్య అనసూయ ఇంట్లో నుంచి వచ్చి చెట్నీ గిన్నె బల్ల మీద పెట్టింది.

"ఈ అబ్బాయ్ పేరు మానస్ కదూ పంతులుగారూ" పళ్లు ఇకిలిస్తూ అడిగిందామె.

"అవునమ్మా.. పేరు బాగా గుర్తుందే నీకు" అంటూ మనవడి వీపు నిమిరాడాయన

"నాకెందుకు తెలీదు. మీ మనవరాలి పేరు చైత్ర కదూ. నాకు మీ ఇంట్లో వాళ్లందరి పేర్లూ గుర్తే"

"అవున్నిజమే. ఎప్పటినుంచో కలసిమెలసి ఉంటున్నాం కదా. అవును గాని, ఓ గంట అయ్యాక వీడ్నే పంపిస్తాను. నాలుగు ప్లేట్లు ఇడ్లీ కాస్త గట్టి చెట్నీ వేసి కట్టి పంపించమ్మా"

"అలాగే. నాకు ప్రత్యేకంగా చెట్నీ గురించి చెప్పాలా . అలాగే పంపిస్తాను. రా అబ్బాయ్. నువ్వు ఎప్పుడు వచ్చినా వేడి వేడి ఇడ్లీ కట్టి ఇస్తాలే"

తల గుండ్రంగా ఊపి తాతయ్య వెంట నడిచాడు మానస్.

"అవును తాతయ్యా వాళ్లందరూ ఎందుకలా చిన్ని విషయాన్ని అంతంత సేపు మాట్లాడతారు?"

"రోజూ చూసుకునే మనుషులే అయినా, కలిసే మనుషులే అయినా ఆ పలకరింపులో ఓ ఆత్మీయత ఉంటుందిరా. వాళ్లకు నేను వెళుతున్నది పాల ప్యాకెట్, పేపరు తెచ్చుకునేందుకని తెలుసు. అయినా అడుగుతారు. అలా పలకరించటం మాకు తెలిసిన మర్యాద, ఓ రకం అభిమానం. రోజూ వాట్సాప్‌లో గుడ్ మార్నింగులు, గుడ్‌నైట్‌లు అని మెసేజ్‌లు పంపిస్తున్నారే, అంతకన్నా మించిన ఆత్మీయమైన పలకరింపులు ఇవి. తెలిసిన విషయాలే అయినా అలా అడగటం మా అందరి అలవాటు."

"వీళ్లతో నువ్వు కూడా ఇలాగే మాట్లాడతావా అయితే"

"అవును ఇలాగే మాట్లాడుతాను. ఇలాగే అడుగుతాను." అంటుండగానే ఓ సందులో నుంచి మోటార్ సైకిల్ మీద పోలీసాయన కనిపించాడు.

"డ్యూటీకి బయలుదేరారా" అడిగాడు మూర్తి.


"అవును మాష్టారు. కులాసానా" అనడిగి వెళ్లిపోయాడు అతగాడు.

"నాకు ఇప్పుడు అర్థం అయింది. నువ్వు కూడా అందర్నీ ఇలాగే అడుగుతావని. ఆయన పోలీసు డ్రెస్సులో వెళుతుంటే నువ్వు డ్యూటీకేనా అని అడిగావే.. అప్పుడే అనుకున్నాను" అని నవ్వేశాడు మానస్.

మానవ సంబంధాలు మంట గలుస్తున్నాయని బాధపడే మనసున్న మనుషులు నిత్యం మనకి ఎదురవుతూనే ఉంటారు. అయితే మధురాతి మధురమైన మానవ సంబంధాలు ఎందుకు మృగ్యమవుతున్నాయని ఆలోచిస్తున్న వారి సంఖ్య తక్కువే. జీవితాన్ని గురించి, జీవిత గమనాన్ని గురించి కాస్త నింపాదిగా ఆలోచించే తీరిక ఎవరికి ఉంది?

మనని ఎవరూ పట్టించుకోనప్పుడు మాత్రమే మానవ సంబంధాల గురించి ఆలోచిస్తున్నాం. శరీరంలో జవం, జేబులో జీవం ఉన్నంతవరకూ, ఒకరితో నాకేం పని అని మనుషులు విర్రవీగుతున్నారు. వారికి డిపెండెన్సీ అవసరం లేదు. ఇండిపెండెన్స్ కావాలి.

మనుషులు మనసుపెట్టి పనిచేసే రోజులు పోయినై. పని అంతా యంత్రాలతోనే. మనల్నీ, మన



నైపుణ్యాలను, మన భావుకతను అమాంతంగా మనల్నే మింగేసింది సాంకేతికత. మరుగున పడిపోతున్నది నైతికత. మాయమై పోతున్నది మానవత. అసలైన మనిషే లేనప్పుడు మానవ సంబంధాలెలా ఉంటై! యంత్రాలు మనల్ని మనకీ, మనవారికీ దూరం చేస్తూనే, దగ్గర చేస్తున్న భ్రమ కల్పిస్తున్నై. యంత్రాలకి అలవాటుపడ్డ మనిషి యంత్రమే అయిపోతున్నాడు. యంత్రాల మధ్యన యాంత్రిక సంబంధాలే ఉంటాయి కానీ మానవ సంబంధాలుంటాయా? ఇది మన ఐడెంటిటీని పోగొట్టుకోవడం. మనం మనం కాకుండా పోవటం. పడమటి గాలి బలంగా వీస్తున్నది. అందులో కొట్టుకుపోతున్నాం మనం. కానీ స్వధర్మే నిధనం శ్రేయః పర ధర్మో భయావహః అని మరచిపోతున్నాం.

మనసు నిండా ఏవేవో ఆలోచనలు.

“ఏం పంతులుగారూ ఈ మధ్యన అసలు రావటమే లేదు” సెలూన్ చిమ్ముకుంటూ అడిగాడు కృష్ణ.

“అవును కృష్ణా. ఊళ్లో లేం. రేపు నేనూ, మా మనవడు ఇద్దరం వస్తాంలే. ఇద్దరికీ క్రాపు చేయాలి” అంటూ ఇంటి దారి పట్టాడు మూర్తి.

“ఏంటి తాతయ్యా, నాకు ఇక్కడ క్రాప్ చేయిస్తావా” వేళాకోళంగా అన్నాడు మనవడు.

“మీ ఊళ్లో కన్నా బాగా చేస్తాడు కృష్ణ. ఓ సారి చేయించుకుని చూడు తెలుస్తుంది.”

“నేను చేయించుకోను గాక చేయించుకోను. అయినా నా క్రాప్ ఏమీ పెరగలేదు. నువ్వు చేయించుకో. కావాలంటే నేను నీకు తోడుగా వస్తాలే”

“సరే నీ ఇష్టం. ఇదిగో ఈ పాల ప్యాకెట్ మీ బామ్మకిచ్చి త్వరగా కాఫీ పెట్టమను” అంటూ కాళ్లు కడుక్కుని వరండాలో ఉన్న వాలు కుర్చీలో



ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడ ఉండటమే ఓ ఆనందం. తిన్నా, తినకపోయినా, ఆ గొంతులు వినబడుతుంటే సగం బలం. అలాగని మేం పస్తులుండాల్సిన పరిస్థితులేమీ లేవు. ఏమిటో మరి ఆ ఊరిని వదిలిపెడితే మా ఉనికిని కోల్పోయిన భావన. మా అస్తిత్వాన్ని పోగొట్టు కున్నామన్న దిగులు. వాళ్లెవ్వరూ కనబడకుండా, వాళ్లకి దూరంగా వెళ్లి ఉండలేని ఓ అసహాయత, ఓ బలహీనత. దీన్ని ఎవ్వరికీ చెప్పుకోలేం. చెప్పకుండా దాచుకోలేం. ఇదో అవస్థ. అంతే.

కూర్చుని పేపర్ చదవసాగాడు మూర్తి.

పక్కింటి శంకరం గారు వచ్చారు. చూస్తున్న పేపర్ మడిచేసి “ఏం శంకరం గారు ఎలా ఉన్నారు?” అడిగాడు మూర్తి.

“మేం బాగానే ఉన్నాం మాష్టారూ....మీరు అబ్బాయి దగ్గరకు వెళ్లారని, ఇక అక్కడే ఉందామనుకుంటున్నారని విన్నాను. అందుకే ఓ సారి పలుకరించి వెళ్దామని వచ్చాను”

“అవును. మా అబ్బాయి, కోడలు మమ్మల్ని అక్కడికి వచ్చేయమని ఒకటే గొడవ చేస్తున్నారు. కాదనలేక వెళుతున్నాం. వెళ్లలేక వెళుతున్నాం”

“అయ్యో, పుట్టిన ఊరు, తిరిగిన నేల వదలటం ఎంత కష్టమో మనకు తెలిసిందే. అయినా ఓ వయసు వచ్చాక పిల్లల మాట వినాల్సిందే. వాళ్ల అనుకూలతని గురించి ఆలోచించాల్సిందే”

ఆయనతో మాట్లాడుతుండగానే ఇద్దరికీ కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది మూర్తి భార్య రాజేశ్వరి.

ఆమెను కూడా పలకరించి మరో అయిదు నిమిషాలు కూర్చుని వెళ్లిపోయాడు శంకరం. పేపరు తెరిచాడు మూర్తి. కళ్లు అక్షరాలను చూస్తున్నాయే కానీ మనసు కుదరటం లేదు. పేపరు పక్కన పెట్టాడు. కళ్లు మూసుకుని పడక కుర్చీలో పడుకున్నాడు.

‘ఊపిరి ఉన్నంతవరకు ఊరితో స్నేహం” అని నానుడి. ఇక్కడి మనుషులతోనే కాదు, గుడులతో, బడులతో, గోడలతో, చెట్లతో, కరెంటు స్తంభాలతో....ఇలా అన్నింటితో ఏదో మనకే తెలియని ఓ అనుబంధం ఏర్పడిపోతుంది. ఆ చలనం లేనివి కూడా మనతో ఏమిటేమిటో మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంటుంది ఆ రోడ్ల వెంట వెళుతుంటే. ఈ పరిసరాలని చూస్తుంటేనే ఓ పరవశం. ఈ మనుషులతో మాట్లాడుతుంటే ఓ పులకరింత, ఓ మైమరపు. ఇవన్నీ ఒదులుకొని ఎక్కడో నిస్తేజంగా, నిర్లిప్తంగా బతకటంలో ఏం అర్థం ఉంది?

మనసు నిండా ఆలోచనలే. ఆలోచనలన్నీ ఊరు చుట్టే. అక్కడి మనుషుల చుట్టూనే. అక్కడినుంచి ఎక్కడికి వెళ్లటానికీ మనసు అంగీకరించటం లేదు. కొడుకు, కోడలి దగ్గరికే కావచ్చు, వాళ్లు మా రాకని ఇష్టపడుతున్నారు నిజమే. మనవడు, మనవరాలు మా కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న మాటా నిజమే. అయినా సరే ఊరు వదిలి వెళ్లటానికి ససేమిరా అంటున్నది మనసు. ఈ సున్నితమైన విషయాన్ని ఎలా చెప్పటం? ఎలా చెప్పి ఒప్పించటం? కొడుక్కి కోపం రాకుండా ఎలా సమాధానపరచాలి? పిల్లల్ని ఎలా సముదాయించాలి? ఈ ప్రశ్నల్ని తనలో తానే వేసుకుంటున్నాడు మూర్తి.

మేముంటున్నది సొంత ఇల్లేమీ కాదు. అద్దె ఇల్లే. అయితేనేం నాలుగు దశాబ్దాలుగా ఆ ఇంట్లోనే ఉంటున్నాం. అంతగా ఆ ఇంటి మీద మమకారం. మా అంతట మేం వెళితే తప్ప ఇంటివాళ్లు మమ్మల్ని ఇల్లు ఖాళీ చేయమనరు. ఆ భయం లేదు. ఊళ్లో ఎటు వెళ్లినా ఎవరో ఒకరు తెలిసిన వాళ్లు కనబడతారు. పలకరిస్తుంటారు.

ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడ ఉండటమే ఓ ఆనందం. తిన్నా, తినకపోయినా, ఆ గొంతులు వినబడుతుంటే సగం బలం. అలాగని మేం పస్తులుండాల్సిన పరిస్థితులేమీ లేవు. ఏమిటో మరి ఆ ఊరిని వదిలిపెడితే మా ఉనికిని కోల్పోయిన భావన. మా అస్తిత్వాన్ని పోగొట్టుకున్నామన్న దిగులు. వాళ్లెవ్వరూ కనబడకుండా, వాళ్లకి దూరంగా వెళ్లి ఉండలేని ఓ అసహాయత,



ఓ బలహీనత. దీన్ని ఎవ్వరికీ చెప్పుకోలేం. చెప్పకుండా దాచుకోలేం. ఇదో అవస్థ. అంతే. అర్ధరాత్రి నిద్ర పట్టక నా భార్య రాజేశ్వరిని నిద్ర లేపాను. నా కేమైనా ఒంట్లో నలతగా ఉందేమోనని భయపడింది ఆమె.

"ఏంటండీ.....ఏమైంది" గాబరాగా అడుగుతూ లేచి కూర్చుంది.

"ఏం కాలేదు. కంగారుపడకు. ఏమిటో నిజం చెప్పాలంటే నాకు ఈ ఊరు వదిలి వెళ్లాలంటే చాలా దిగులుగా ఉంది రాజేశ్వరి" అన్నాను బాధగా. ఏం మాట్లాడలేదు ఆమె.

"అక్కడికి వెళితే పిల్లల మధ్యన ఉంటాం నిజమే. కానీ ఈ ఊరిని, ఈ నేలని, ఈ మనుషుల్ని, ఈ పరిచయాల్ని వదిలి వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది రాజేశ్వరి" అన్నాను. అప్పటికే నా గొంతు జీరా బోయింది. నా తలను ఆమె ఒడిలో పెట్టుకుని పడుకున్నాను. ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆగలేదు. చిన్నగా మొదలయిన ఏడుపు వెక్కిళ్ల వరకు వెళ్లింది.

"అయ్యో ఊర్కోండి. పిల్లవాడు లేస్తాడు, భయపడతాడు. రేపు ప్రశాంతంగా ఆలోచిద్దాం, మాట్లాడుకుందాం, పడుకోండి" అనునయంగా అన్నదామె.

"కాదు రాజేశ్వరి. నాకు నిద్ర రావటం లేదు. నా ఆలోచనలు నన్ను నిద్రపోనీయటం లేదు. మనసంతా దిగులుగా ఉంది. ఎవ్వరితో చెప్పుకోలేక నిన్ను నిద్రలేపాను. నాకు వ్యాకులతగా ఉంది. ఈ బాధతోనే అక్కడికి వెళ్లి మనోవేదనతో మంచం పడతానేమో.. భయంగా ఉంది రాజేశ్వరీ. ఉన్నన్ని రోజులు సంతోషంగా ఉండాలని ఎవరైనా కోరుకుంటారు కదా. ఆ సంతోషమే కరవైపోతే, ఇక బతికి ఉండి మాత్రం ఉపయోగం ఏముంటుంది?" నా మనసులోని దిగులును, గుబులును నా అర్ధాంగితో పంచుకున్న తర్వాత కొంచం ఉపశమనంగా అనిపించి తరువాత ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారింది. మానస్‌ని నిద్ర లేపాను. ఇద్దరం కలిసి పాల ప్యాకెట్ కోసం బయలుదేరాం. తరువాత సెలూన్‌కి వెళ్లి వచ్చాం. టిఫిన్ తిని మానస్ తిరుగు ప్రయాణంఅయ్యాడు. బస్‌స్టాండ్ దాకా వెళ్లి మనవడిని బస్ఎక్కించి ఇంటికి చేరాను.

పదిరోజుల తర్వాత ఇంటిముందు కారు ఆగితే నేనూ, రాజేశ్వరి బయటకు వచ్చాం. కొడుకు, కోడలు, పిల్లలు కారు దిగి లోపలికి వచ్చారు. మా కళ్లని మేమే నమ్మలేకపోయాం. ఆప్యాయంగా ఎదురెళ్లి కోడల్ని పొదివిపట్టుకుని లోపలికి తీసుకువచ్చింది నా భార్య. ఏం మాట్లాడాలో తెలీని ఆనందంలో మనవడ్ని, మనవరాల్ని దగ్గరకు తీసుకున్నాను. డ్రైవర్‌కి డిక్కీలో సామాను తీసుకురమ్మని చెప్పి లోపలికి నడిచాడు నా కొడుకు.

"నాన్నా.. మీరూ, అమ్మా మీ ఇష్టప్రకారం హాయిగా ఇక్కడే ఉండండి. మేమే వీలయినప్పుడల్లా వచ్చి మిమ్మల్ని చూసి వెళుతుంటాం. మీకు రావాలనిపించినప్పుడు మా దగ్గరికి వచ్చి మీకు ఎంతకాలం ఉండాలనిపిస్తే అన్నీ రోజులుండి మళ్లీ ఇక్కడికే వచ్చేద్దురు గాని. మీ మనసులో ఎంత దిగులు పెట్టు కున్నారో మానస్ నాకు చెప్పాడు. అంతేకాదు, మీరు ఇక్కడ ఉంటే సంతోషంగా ఉన్నారని, మీ ముఖంలోని వెలుగే వాడికి తెలిసిపోయిందట" చెప్పాడు మధు.

మానస్‌ని దగ్గరకు తీసుకుని ముద్దాడాను. వెయ్యి ఏనుగుల బలం వచ్చింది నాకు. ఆ ఊరు వదిలి వెళ్లటం లేదనే విషయం నన్ను ఆనంద డోలికల్లో ముంచేస్తున్నది. కొత్త ఉత్సాహం చోటు చేసుకున్నది.

నాలుగు రోజులు మా దగ్గరే ఉండి మాకు కావలసినవన్నీ కొని తెచ్చి వెళ్లిపోయారు పిల్లలు.

రాజేశ్వరి నన్ను సంతోషంగా కౌగిలించుకుంది. ప్రేమగా ఆమెను చుట్టేశాను. నిజం చెప్పొద్దూ.. మా ఊరు నన్ను కౌగిలించుకున్న అనుభూతికి లోనయ్యాను. ★



# రాహుల్ పొగ వలసల సెగ

**వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న తరుణంలో గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ నుంచి ఇటీవలి కాలంలో ముఖ్యమైన నేతల వలసలు పార్టీని కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాదిలో వేళ్లూను కోవడానికి యత్నిస్తున్న బీజేపీకి తక్షణ ఫలితాలివ్వకపోయినా సానుకూల పరిణామాలను మాత్రం సృష్టించగలవు. ముఖ్యంగా పార్టీకి కేరళ, తమిళనాడుల్లో ఎంపీలు లేరు. తెలంగాణలో నలుగురు, కర్ణాటకలో మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో 25 మంది పార్టీ తరఫున ఎంపీలుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. మరో అంశమేమంటే దక్షిణాదిలో కాంగ్రెస్ నాయకులు బీజేపీ వైపు మరలుతున్నారన్న సందేశాన్ని దేశవ్యాప్తంగా పంపడానికి ఈ చేరికలు ఉపయోగ పడవచ్చు. ముఖ్యంగా కర్ణాటకలో ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఇవి బీజేపీకి మంచి ప్రాచుర్యం కలిగిస్తాయి.**

ఈ ఏడాది చివర్లో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఒక్క తెలంగాణలో తప్ప మిగిలిన రాష్ట్రాల్లో కాంగ్రెస్– బీజేపీల మధ్య ముఖాముఖీ పోరు జరగనున్న నేపథ్యంలో, కాంగ్రెస్ నుంచి నాయకుల వలసలు మొద లయ్యాయన్న సందేశాన్ని పంపే వ్యూహం ఇందులో ఉంది. మొదటిది తమిళ నాడుకు చెందిన సి.ఆర్. కేశవన్ బీజేపీలో చేరారు. ఈయన భారతదేశ తొలి గవర్నర్ జనరల్ చక్రవర్తుల రాజగోపాలచారి ముని మనుమడు. ఇక రెండవది కాంగ్రెస్‌కు వీర విధేయుడు, కేరళలో నిష్కలంక రాజకీయవేత్తగా పేరున్న మాజీ రక్షణమంత్రి ఎ.కె.ఆంటొనీ పుత్రుడు అనీల్ ఆంటొని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్‌లో ఇమడలేక బయటకు వచ్చి 2022 ఆగస్ట్‌లో 'డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ' పేరుతో కొత్త పార్టీని నెలకొల్పారు. కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల గాఢమైన అనుబంధం ఉన్న ఈయన జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు జరిగితే బీజేపీతో కలిసి అధికారాన్ని పంచుకునే అవకాశాలను




బీజేపీలో చేరిన అనిల్ ఆంటోని

కొట్టిపారేయకపోవడం గమనార్హం.

**దుమారం రేపిన ఆజాద్ వ్యాఖ్యలు**

రాహుల్ గాంధీకి 'అవాంఛనీయ వ్యాపార వేత్తల'తో సంబంధాలున్నాయంటూ గులాంనబీ ఆజాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపాయి. గౌతమ్ ఆదానీతో సన్నిహిత సంబంధాలున్న వారిలో గులాంనబీ ఆజాద్ కూడా ఒకరంటూ వాయనాడ్ (కేరళ) మాజీ ఎంపీ రాహుల్ గాంధీ ట్వీట్ చేసిన నేపథ్యంలో ఆజాద్ మలయాళం న్యూస్ ఛానల్ ఆసియానెట్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పైవిధంగా తిప్పికొట్టారు. నిజానికి ఆదానీ గ్రూపుపై అమెరికన్ పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిన దగ్గరి నుంచి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లినవారిని, బీజేపీలో చేరినవారిని లక్ష్యంగా ఆదానీ వివాదంలోకి లాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆజాద్ ఎదురుదాడికి ప్రాధాన్యం ఏర్పడింది. రాహుల్ గాంధీ 3500 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రను సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి ప్రారంభిస్తారన్న ప్రకటన వెలువడి పక్షంరోజులు కాకముందే అంటే 2022, ఆగస్టు 22న పార్టీలో సీనియర్ నేత గులాంనబీ ఆజాద్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు బాంబు పేల్చారు. ఆయన ప్రకటన పార్టీని ఐదు విధాలుగా దెబ్బతీసిందనే చెప్పాలి. మొదటగా ఆగస్టు 29న కాంగ్రెస్ దేశవ్యాప్తంగా 22 ప్రెస్ కాన్ఫరెన్స్‌లను నిర్వహించాలని తలపెట్టింది. కానీ ఆజాద్ రాజీనామా సందర్భంగా రాహుల్‌పై, కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలు ఈ కార్యక్రమాల ప్రభావశీలతను తీవ్రంగా దెబ్బ తీశాయి. రెండోది ఆజాద్ కొత్త పార్టీ పెడుతున్నానని ప్రకటించడం కాంగ్రెస్‌కు రెండో దెబ్బ. అంతకు ముందు పార్టీని వీడిన జితేంద్రప్రసాద్, ఆర్‌పీఎన్ సింగ్‌లు బీజేపీలో చేరగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుష్మితా దేబ్ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు తప్ప ఆజాద్ లాగా సొంత పార్టీని ఎవరూ ప్రకటించలేదు. ఆయనతో పాటు జమ్ము కశ్మీర్‌లో జి.ఎం.సురానీ, హాజీఅబ్దుల్ రషీద్, మొహమ్మద్ అమీన్ భట్, గుల్జార్ అహ్మద్ వాని, చౌదరి అహ్మద్ అక్రమ్ వంటివారు కూడా పార్టీకి రాజీనామా చేయడం రాష్ట్రంలో పార్టీకి తీరని దెబ్బగా పరిణమించింది. ఇది బీజేపీకి బలం చేకూర్చే అంశం. మూడోది జమ్ముకశ్మీర్‌లో 370 అధికరణం రద్దు సమయంలో, త్రిపుల్ తలాక్ విషయంలో, జమ్ముకశ్మీర్‌ను రెండుగా విడగొట్టినప్పుడు పార్లమెంట్‌లో, బయటా కాంగ్రెస్ తరపున గట్టిగా వాణిని వినిపించిన నేతగా ఆజాద్ పేరుపడ్డారు. అదీ కాకుండా అఖిలేష్‌యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీ, లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్‌లు ముస్లింల ఓట్లపైనే ఆధారపడి మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో, ఆజాద్ నిష్క్రమణతో ముస్లింలను తనవైపు తిప్పుకోవడం కాంగ్రెస్‌కు మరింత కష్టం కాగలదు. ఇక నాల్గవది రాహుల్ గాంధీని 'ఛైల్డిష్', 'నాన్ సీరియస్ పొలిటీషియన్' అంటూ విమర్శించారు. కాంగ్రెస్‌లో పటిష్టమైన నిర్మాణ క్రమాన్ని ధ్వంసం చేశారని కూడా ఆరోపించారు. సోనియాగాంధీ కేవలం తన పిల్లలను ఎల్లప్పుడూ వెనకేసుకొచ్చే 'సాధారణ తల్లి' మాదిరిగానే ప్రవర్తిస్తున్నారని కూడా విమర్శించారు. ఐదవది అక్టోబర్ 17న పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయని అప్పట్లోనే కాంగ్రెస్ ప్రకటించినప్పుడు ఎన్నికల ప్రక్రియ కేవలం నామమాత్రమే. గాంధీ-నెహ్రూ కుటుంబం ఎంపిక చేసిన వ్యక్తి మాత్రమే పార్టీ అధ్యక్షుడవుతారంటూ తేల్చి పారేశారు. ఈవిధంగా ఆయన తన రాజీ నామాతో పాటు పార్టీ విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీశారు.



**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

**కేశవన్, అనీల్ ఆంటోనీల చేరికలు**

తమిళనాడుకు చెందిన సి.ఆర్. కేశవన్ ఫిబ్రవరి 23న కాంగ్రెస్ పార్టీకి తన రాజీనామాను సమర్పించారు. మాజీ కేంద్ర మంత్రి ఎ.కె. ఆంటోని పుత్రుడు అనిల్ ఆంటోనీ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన నెల రోజుల తర్వాత కేశవన్ రాజీనామా చేయడం గమనార్హం. అనిల్ ఆంటోని ఏప్రిల్ 6న బీజేపీలో చేరగా, కేశవన్ అదే నెల 8వ తేదీన బీజేపీ తీర్థం పుచ్చుకోవడం విశేషం. వీరు గత 22 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఈ విధంగా పార్టీలో చేరిన కొత్త సభ్యులను 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రంగంలోకి దించే అవకాశాలున్నాయి. సి.ఆర్. కేశవన్ చేరిక వల్ల బీజేపీకి ఒరిగేదేమీ లేదు. కాంగ్రెస్ దాదాపు అంపశయ్య దశలో ఉన్న స్థితిలో ఈయన చేరిక బీజేపీ ఒక వర్గం ఓటర్ల వద్దకు వెళ్లేందుకు ఉపకరించవచ్చు.

కేరళకు చెందిన అనీల్ ఆంటోనీ చేరిక వల్ల కూడా బీజేపీకి తక్షణ లాభం ఉండదు. కాకపోతే దీర్ఘకాలంలో క్రైస్తవ ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఉపయోపడవచ్చు. అనీల్ ఆంటోనీ బీజేపీలో చేరిక కాంగ్రెస్ వర్గాల్లో ఆగ్రహం కలిగించడం సహజమే. అయితే ఈ నిష్క్రమణ కాంగ్రెస్ కంటే, ఆ పార్టీకి విధేయుడిగా కొన సాగుతున్న ఆయన తండ్రి ఎ.కె. ఆంటోనీని బాగా బాధించిందనే చెప్పాలి. 2019 నుంచి కాంగ్రెస్ సైబర్ మీడియా సెల్‌కు అఖిల భారత సమన్వయ కర్తగా కొనసాగుతున్న అనీల్ ఆంటోనీ గత జనవరిలో తన పదవికి రాజీనామా సమర్పించగానే, అతని నిష్క్రమణను కాంగ్రెస్ అంచనా వేసింది. అనీల్ ఈ పదవిలో కొనసాగడానికి తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ఆశీస్సులున్నాయి. మరి లెఫ్ట్ పార్టీలు ఈ పరిణామాలను ఏవిధంగా చూస్తాయనే ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. ప్రస్తుతం కాంగ్రెస్ బీజేపీకి ఒక రిక్రూటింగ్ ఏజెంట్‌గా మారుతున్నదని, 'నేటి కాంగ్రెస్సే రేపటి బీజేపీ' అంటూ అవి ప్రచారం మొదలుపెట్టవచ్చు. అంతేకాదు కమలానికి వ్యతిరేకంగా పోరాడలేక, తన నాయకులనే కోల్పోతున్నదంటూ కూడా ప్రచారం చేసి రాజకీయాన్ని తమకు అనుకూలంగా మలచుకోవడానికి యత్నించవచ్చు.


**క్రైస్తవులకు దగ్గరయ్యేందుకు..**

కేరళలోని క్రైస్తవ కమ్యూనిటీకి చేరువ కావాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. ఇప్పుడు అనీల్ ఆంటోనీ చేరిక తమకు ఆ అవకాశాన్ని కల్పిస్తుందని పార్టీ అంచనా వేస్తోంది. కాకపోతే ఎ.కె. ఆంటోనీ మాదిరిగా అనీల్‌కు కేరళలో పెద్దగా ఫాలోయింగ్ లేదు. అనీల్ తల్లి రాష్ట్రంలోని వివిధ చర్చ్ కార్యకలాపాల్లో పాల్గొంటుంటారు. ఇటీవల ఈస్టర్ డే సందర్భంగా ప్రధాని మోదీ న్యూఢిల్లీలోని చర్చ్‌ను సందర్శించిన నేపథ్యంలో, కేరళ బీజేపీ నాయకత్వం రాష్ట్రంలో క్రైస్తవ వర్గ ప్రజలను నేరుగా కలుసుకోవాలని నిర్ణయించింది. అయితే ఈ కార్యాచరణకు దిగడానికి ముందు నెలల తరబడి క్రిస్టియన్ నేతలతో చర్చలు కొనసాగాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి

పినరయి విజయన్ ముస్లిం వర్గాల్లోకి ఏవిధంగా చొచ్చుకొని వెళ్లగలిగారో అదే పంథాను ఇప్పుడు కమలం అనుసరించేందుకు యత్నిస్తోంది. కేరళలో కాంగ్రెస్ ఇంకెంతో కాలం తన బేస్‌ను నిలుపుకో లేదన్న నమ్మకానికి తోడు, చర్చ్ వర్గాలనుంచి సానుకూల స్పందన రావడం బీజేపీ నాయకుల్లో ఆనందాన్ని నింపుతోంది. తిరువనంతపురం, త్రిస్సూర్ జిల్లాల్లో క్రైస్తవ జనాభా అధికంగా ఉండటంతో ఈ రెండు లోక్‌సభ స్థానాల్లో పాగా వేయాలని ప్రణాళికలు మొదలుపెట్టింది. తిరువ నంతపురంలో ఈస్టర్ గ్రీటింగ్స్ లక్ష వరకు ప్రచు రించగా, విపరీతమైన డిమాండ్ నేపథ్యంలో మరో 50వేలు ప్రింట్ చేశామని ఇక్కడి నాయకత్వం చెప్పడం క్రైస్తవుల్లో పెరుగుతున్న బీజేపీ బలానికి సంకేతం. ఇక్కడ ఎల్.డి.ఎఫ్., యు.డి.ఎఫ్‌ల పట్ల ప్రజల్లో వ్యతిరేకత మాత్రమే కాదు, యు.డి.ఎఫ్., ముఖ్యంగా కాంగ్రెస్‌కు రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్తు లేదన్న బలమైన అభిప్రాయం ఉంది. ఇక ఎల్.డి.ఎఫ్. బుజ్జగింపు రాజకీయాలు నడుపుతున్న కారణంగా ముస్లిం ఛాందసవాదులు సి.పి.ఎం. లో చేరిపోయారని వీరు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్రైస్తవ గ్రూపులు తమను కేవలం మైనారిటీ మోర్చాకే పరిమితం చేయకుండా, పార్టీకి సంబంధించిన వివిధ గ్రూపుల్లో భాగస్వాములను చేయాలని బీజేపీ నేతలను కోరుతున్నాయి. కేరళలో క్రైస్తవ, ముస్లిం కమ్యూనిటీలు సంప్ర దాయికంగా కాంగ్రెస్ నేతృత్వం లోని యు.డి.ఎఫ్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారు. కేరళలో ముస్లిం, క్రిస్టియన్ కమ్యూనిటీలు 45శాతం. వీరిలో క్రిస్టియన్లు 18 శాతం. ఇప్పుడు బీజేపీ క్రైస్తవుల్లో ముఖ్యంగా కేథలిక్ వర్గాలను ఆకట్టుకునేందుకు ప్రయత్ని స్తోంది.

**కాంగ్రెస్ దీనస్థితి**

నిజానికి గత ఏడాది నుంచి కాంగ్రెస్ నుంచి కీలక నేతల వలసలు బీజేపీలోకి కొనసాగుతున్నా ఆ పార్టీ అడ్డుకోలేకపోతోంది. 2015లో ఈశాన్య ప్రాంతానికి చెందిన పార్టీ కీలకనేత, హిమంత్ బిశ్వశర్మ తన 23 ఏళ్ల పార్టీ అనుబంధాన్ని తెంచుకొని బీజేపీలో చేరారు. ఇప్పుడాయన ఈశాన్య రాష్ట్రాల్లో



గులాంనబీ ఆజాద్



కమలం గూటికి కేశవన్

అత్యంత క్రియాశీలక పాత్ర పోషించడమే కాదు, అస్సాం ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. మధ్య ప్రదేశ్ నుంచి జ్యోతిరాదిత్య సింధియా 2021లో, కేంద్ర మాజీ మంత్రి జితేంద్ర ప్రసాద 2022లో, అదే ఏడాది తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని పద్రౌనా రాజ కుటుంబానికి చెందిన కున్వర్ రత్నజిత్ ప్రతాప్ నారాయణ్‌సింగ్ (కేంద్ర మాజీ మంత్రి, రాహుల్ అనుయాయుడిగా గుర్తింపు పొందారు), గత ఆగస్టులో కాంగ్రెస్ అధికార ప్రతినిధి జయ్‌వీర్ షేర్‌గిల్‌లు బీజేపీలో చేరారు. గత ఏడాది సెప్టెంబర్ 28న హిమాచల్ ప్రదేశ్ నుంచి హర్ష్ మహాజన్, అదే నెలలో పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి అమరేంద్ర సింగ్, ఝార్ఖండ్‌లో ఆర్.పి.ఎన్. సింగ్ గత ఏడాది బీజేపీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ బల హీనపడటం ఒక్క రాత్రిలోనో జరగలేదు. ఈ పతన ప్రస్థానం మూడు దశాబ్దాలుగా కొనసాగు తోంది. గాంధీ– నెహ్రూల కుటుంబం పట్టు క్రమంగా కోల్పోవడమే ఇందుకు కారణం. సోనియాగాంధీ అనారోగ్య సమస్యలు, 19 ఏళ్లు గడిచినా రాహుల్ ఛరిష్మాటిక్ నేతగా రాణించలేకపోవడం, ప్రియాంకా వాద్రాను ఎంతగా ఆకాశానికెత్తినా ఆమెలో ఆ సామర్థ్యం కొరవడటం వంటివి పార్టీపై కుటుంబ పట్టుపోవడానికి ప్రధాన కారణం. పార్టీ నౌక మునిగి పోయే స్థితిలో ప్రధాన నేతలు తమ దారి తాము చూసుకోవడంతో వెన్నెముకలేని నాయకులతో 'గ్రాండ్ ఓల్డ్' పార్టీ 'వృద్ధాప్య సమస్యలతో' సత మతవుతోంది. 1991–96 మధ్యకాలంలో పి.వి. నరసింహారావు పార్టీకి నేతృత్వం వహించిన తర్వాత, మరే ఇతర నేతకు అంతటిస్థాయి ఆత్మవిశ్వాసం లేకపోవడం పార్టీకి పెద్దదెబ్బ. ఇందుకు పర్యవసానమే పార్టీ వేగంగా క్షీణపథంలో పయనించడం!

**పట్టు బిగించినా ఫలితం శూన్యం**

పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఏక కాలంలో పార్టీపై పట్టుబిగింపును కొనసాగిస్తున్నారు. విచిత్రమేమంటే పార్టీపై వీరిపట్టు ఎంతగట్టిగా ఉన్నా కాంగ్రెస్ పతనం మాత్రం అప్రతిహతంగా సాగిపోతూనే ఉండటం విషాదం. ఫలితంగా ఈ ముగ్గురు 'గాంధీలు' క్రమంగా ఏకాకులవుతున్న పరిస్థితి! 2020 ఆగస్టులో 23 మంది సీనియర్ నేతలు (వీరినే జి– 23 అని పిలుస్తారు) జమ్ము కశ్మీర్‌లో సమావేశమై పార్టీని ప్రక్షాళన చేయాలంటూ సోనియాగాంధీకి లేఖరాయడం సంచలనం సృష్టించింది.

పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఏక కాలంలో పార్టీపై పట్టుబిగింపును కొనసాగిస్తున్నారు. విచిత్రమేమంటే పార్టీపై వీరిపట్టు ఎంతగట్టిగా ఉన్నా కాంగ్రెస్ పతనం మాత్రం అప్రతిహతంగా సాగిపోతూనే ఉండటం విషాదం. ఫలితంగా ఈ ముగ్గురు 'గాంధీలు' క్రమంగా ఏకాకులవుతున్న పరిస్థితి! 2020 ఆగస్టులో 23 మంది సీనియర్ నేతలు (వీరినే జి– 23 అని పిలుస్తారు) జమ్ము కశ్మీర్‌లో సమావేశమై పార్టీని ప్రక్షాళన చేయాలంటూ సోనియాగాంధీకి లేఖరాయడం సంచలనం సృష్టించింది.

'బాధ్యతాయుత నాయకత్వం' అవసర మని కూడా వీరు పేర్కొనడం తల్లిచాటున బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న రాహుల్‌కు చెక్‌పెట్టే ఉద్దేశమే. విచిత్రంగా ఈ నాయకులనే క్రమంగా పార్టీలో పక్కనపెట్టడం మొదలైంది. నిజానికి రాహుల్‌కు సీనియర్ నేతలంటే పడదు. ఆయనది ఒంటరి వ్యవహారశైలి. ఇక సోనియా ఆరోగ్యం దెబ్బతినడంతో పార్టీకి, గాంధీ కుటుంబా నికి మధ్య అగాధం పెరిగిపోయింది. ఈ విధంగా పుట్టి మునుగుతున్న కాంగ్రెస్ దుస్థితిలో కొట్టుమిట్టాడు తుంటే, బీజేపీ రోజురోజుకు బలపడుతోంది. ★

కథ

# కలల ప్రపంచం

వెంకట శివకుమార్ కాకు

**నందుకి పాతికేళ్లు ఉంటాయి. ఆనందం వెతుక్కుంటూ బయలుదేరాడు. ఏంటి ఈ విడ్డూరం.... తను ముందుకు వేస్తున్న ప్రతీ అడుగు ఆశ్చర్యం కలిగిస్తోంది. జీవితంపై కొత్త ఆశల్ని రేకెత్తిస్తోంది. చిత్రంగా తను నడుస్తున్న దారి పొడవునా చెట్లున్నాయి. విచిత్రంగా జనం ఫుట్ పాత్ మీదనే నడుస్తున్నారు. అడ్డదిడ్డంగా అస్సలు పోవడం లేదు. నమ్మలేని విషయం ఏంటి అంటే... వాహనాలన్నీ ఒకే వరుసలో పోతున్నాయి. ఎవ్వరూ కూడా వంకర టింకర డ్రైవింగ్ చెయ్యడం లేదు. మొత్తం మారిపోయింది. ఆనందుకు ఇదంతా నమ్మశక్యంగా లేదు.**

కొన్నాళ్ల క్రితం...

ఆనందు ఉండే కాలనీలో ఎవరో చెట్లు కొట్టేస్తున్నారు. "బాబు... ఎందుకయ్యా అలా మంచి మంచి చెట్లు నరికేస్తున్నారు?" ఆపుకోలేనంత బాధతో అడిగాడు. "చెట్లు అడవిలో ఉండాలి. మనుషులు ఉండే చోటు అడ్డంగా ఎందుకు సార్?" అన్న ఆ అజ్ఞాని సమాధానం విని దిమ్మ తిరిగింది. ఆ మాటలు విన్నాక ఆనందుకి నీరసం నెత్తిన ఎక్కింది. "చెట్లు మనుషులకి అడ్డం ఏంటి? మతి ఉండే మాట్లాడుతున్నాడా?'' అని మనస్సులోనే అనుకున్నాడు.

ఇక చేసేది లేక అత్యవసర పని మీద మోటారు బండి మీద బయలుదేరాడు. ఆ రోజు ఎందుకో ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. బండి వెనుక బండి ఆగిపోయి ఉన్నాయి. అదేం పట్టనట్టు.... ఒక బడుద్ధాయి వెనుక నుంచి ఆగకుండా హారన్ కొడుతూ ఉన్నాడు. ఇంకో బడుద్ధాయి చిన్న కుదుపుతో తనని దాటేసి కోపంగా చూసి వెళ్లాడు. ముందున్న మరో బడుద్ధాయి ఫోన్లో ముచ్చట్లు పెడుతూ డ్రైవింగ్. వీళ్లందరినీ చూసి ఆనందుకి ముచ్చెమటలు పట్టాయి.

ఒక కూడలిలో ఎర్ర సిగ్నల్ పడింది. అయిన ఒక ట్రక్ నడిపేవాడు ఆగకుండా వెళ్లిపోయాడు. అనుకోని ఈ సంఘటన వలన అటు నుంచి పచ్చ సిగ్నల్ నుంచి వస్తున్న ఒక జంట దాదాపు ట్రక్ క్రింద పడినంత పనైపోయింది. ఇదంతా చూసి ఆనందుకి పిచ్చెక్కింది. అంతే కాదు.... ఇవేమీ పట్టించుకోకుండా ట్రాఫిక్ పోలీసు దూరంగా, ఒక చాయ్ కొట్టు దగ్గర ఆరాంగా చాయ్ తాగుతున్నాడు. ఎవ్వరూ ఆగడం లేదు. ఆరెంజు సిగ్నల్ పడి పచ్చ సిగ్నల్ వచ్చే లోపే ముందున్న చాలా మంది రయ్ అంటూ సిగ్నల్ దాటేసారు. పచ్చ సిగ్నల్ కోసం చూస్తున్న ఆనందుని మిగతావాళ్లు పిచ్చోడిలా చూసారు. ఆనందువల్ల అరసెకను ఆలస్యం అయ్యింది అని ఒకడైతే కొట్టడానికి కూడా సిద్ధం అయ్యాడు.

అలా గతం గుర్తు చేసుకుంటూ మళ్లీ సిగ్నల్ దగ్గర ఆగాడు.

ఈ సారి జనంలో మార్పు చూసి ఆశ్చర్యం ఆకాశాన్ని తాకింది. ఇప్పుడు తన వెనుక అందరూ వరుసలో నిలబడ్డారు. అసలు ఎవ్వరూ ఫోన్ చూడ్డం లేదు. అందరి ముఖంపై చిరునవ్వు. ట్రాఫిక్ పోలీసు జంక్షన్ మధ్యలో నిలబడి తన బాధ్యత నిర్వర్తిస్తున్నాడు. రోడ్ దాటే వాళ్లు కూడా తమ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎవ్వరూ తొందర పడ్డం లేదు.

ఇదంతా నమ్మలేని ఆనందు మళ్లీ గతంలోకి వెళ్లాడు.

ఒక రోజు సిగ్నల్ దగ్గర నిలబడినప్పుడు బిచ్చగాళ్లు తన పైన దాడి చేసారు. ఎర్ర సిగ్నల్ పడింది అంటే బిచ్చగాళ్ల హడావిడి మొదలవుతుంది. అంతే కాదు పచ్చ సిగ్నల్ పడిన కూడా.... కొందరైతే దారి వదలకుండా అడ్డం వస్తారు.

ఇదంతా గుర్తు చేసుకుంటూ ఉండగా గ్రీన్ సిగ్నల్ పడ్డంతో మళ్లీ ప్రస్తుతంలోకి వచ్చాడు.

ఒక్క బిచ్చగాడు కూడా కనిపించ లేదు. తనని తాను గట్టిగా గిల్లుకొని ఇది నిజమే అని నమ్మకం తెచ్చుకున్నాడు. అమితమైన ఆశ్చర్యంతో ముందుకు వెళ్లాడు. కొంచెం దూరంలో ఏదో ప్రమాదం జరిగింది. అది చూసి ఆనందు ఆగిపోయాడు. తను సాయం చేద్దాం అని ముందుకు కదిలాడు. తన కన్నా ముందు పదిమంది వచ్చారు. ఈ సారి ఎవ్వరూ కూడా మొబైల్ ఫోన్లో వీడియోలు తీయడం లేదు. అవి సోషల్ మీడియాలో పోస్ట్ చెయ్యడంలో బిజీగా లేరు.


గుంపులో ఒకరు అతన్ని లేపి పక్కన నీడలో కూర్చో పెట్టారు. మరొకరు మంచి నీళ్లు తాగిస్తున్నారు.

"హలో! ఇక్కడ ట్రంక్ రోడ్ జంక్షన్‌కి కొంచెం ముందు యాక్సిడెంట్ అయ్యింది. త్వరగా రండి" అని ఫోన్‌లో అంబులెన్స్‌కి ఒకతను కాల్ చేసాడు. ఇదంతా ఆనందుకి నమ్మబుద్ధి కావడం లేదు. ఎందుకంటే....?

గతం ఎంత విషాదంగా ఉండేది... తలచుకుంటేనే ఒళ్లంతా గగుర్పాటు కలిగింది.

ఒక రోజు ఆనందు వెళ్తున్న బైక్‌ని ఒక కారు అడ్డంగా వచ్చి గుద్ది ఆగకుండా వెళ్లిపోయింది. క్రింద పడిన ఆనందుకి బాగా దెబ్బలు తగిలాయి. అసలు కదలలేక పోతున్నాడు. పదిమంది ముందుకు వచ్చారు. ఆనందు సాయం కోసం చెయ్యి ముందుకు చాపాడు. వాళ్లు చేతులు జేబులో పెట్టి ఫోన్ బయటకి తీసారు. ఆనందు బాధని వీడియో తీయడం మొదలు పెట్టారు.

ఆనందు చెయ్యి పట్టుకొని సెల్ఫీ తీసుకొని "మనిషికి మనిషి సాయం చెయ్యాలి" అని ఫేస్‌బుక్‌ల్లో పోస్టులు పెట్టేసారు. ఆనందు నొప్పితో బాధ పడుతున్నాడు. స్పృహ పోతోంది. ఈ లోపు ఒకడు దగ్గరగా వచ్చి ప్యాంట్ జేబులో చెయ్యి పెట్టి పర్స్ లాగేసాడు.



ఎప్పటికో వచ్చాడు మహానుభావుడు... "ఎవరైనా అంబులెన్స్‌కి కాల్ చేసారా లేదా?" అని అందరినీ అడుగుతున్నాడు. తాను కాల్ చెయ్యొచ్చు కదా... అది చెయ్యడం లేదు. ట్రాఫిక్ ఎక్కువ అవ్వడంతో... ఎప్పటికో నిదానంగా పోలీసు జీప్ వచ్చింది. ఒక కానిస్టేబుల్ అంబులెన్స్‌కి కాల్ చేసారు. అలా దేవుడి దయ వల్ల ఆనందు బ్రతికి బయట పడ్డాడు.

గతం చేసిన గాయం నుంచి బయటకి వచ్చాడు ...

ఇదేదో మాయలా ఉంది.... ఇప్పుడు అందరూ కలిసి దగ్గరుండి ప్రమాదం జరిగిన అతన్ని అంబులెన్స్ ఎక్కించారు. "నేను కూడా తోడుగా వెళ్తాను" అని ఒకడు అంబులెన్స్ ఎక్కి కూర్చున్నాడు. "నేను వెనుక నా బండిలో వస్తాను" అని మరొకడు అన్నాడు. "నేను వాళ్ల ఇంట్లో వాళ్లకి ఇన్ఫార్మ్ చేస్తాను" అని ఇంకోతను అన్నాడు. అలా అందరూ సాయాన్ని పంచుకొంటున్నారు.


ఇదంతా నమ్మలేని ఆనందు.... ఆత్రుత ఆపుకోలేక అంబులెన్స్ వెనుకనే వెళ్లాడు. ఎవరో ముందే ఇన్ఫార్మ్ చెయ్యడంతో.... హాస్పిటల్ స్టాఫ్ సిద్ధంగా ఉన్నారు. అతన్ని జాగ్రత్తగా దించుకొని లోపలికి తీసుకొని వెళ్లారు. "ఇతని మొబైల్ తీసుకొని తన ఫ్యామిలీకి ఇన్ఫార్మ్ చేయండి" అని ఒక డ్యూటీ డాక్టర్ అన్నాడు. "పోలీసులకి ఇన్ఫార్మ్ చేయండి" అని హాస్పిటల్ అడ్మిన్‌ని పురమాయించాడు. "ఆల్రెడీ ఇన్ఫార్మ్ చేసాం సర్" అని పక్కనే ఉన్న అతను అన్నాడు. అందరూ ఎవరి పనులు వాళ్లు ఎంతో నిబద్ధతతో చేస్తున్నారు.

అంబులెన్స్‌లో తను హాస్పిటల్‌కి వచ్చిన రోజు గుర్తుకు వచ్చింది. గతం గుర్తొచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆ రోజు అంబులెన్స్ హాస్పిటల్ ముందు ఆగింది. ఆనందుని ఆదుకోవడానికి అక్కడ ఎవ్వరూ లేరు. సెక్యూరిటీ దగ్గర వదిలి అంబులెన్స్ వాడు వెళ్లిపోయాడు. చాలా సమయానికి తీరిగ్గా ఒక నర్స్ వచ్చింది. "బ్రతికున్నాడా? పోయాడా?" అని రిసెప్షన్ వాడితో జోక్‌వేసింది. ఆ మాట విని అప్పటిదాకా కదలకుండా పడి ఉన్న ఆనందులో కూడా చలనం వచ్చింది. "గట్టి ప్రాణమే...." అనుకుంటూ లోపలికి తీసుకెళ్లింది.

"పోలీసులు వచ్చి చూడనివ్వండి. అప్పుడు ట్రీట్మెంట్ మొదలు పెడదాం" అని డ్యూటీ డాక్టర్ అన్నాడు. "సార్, సార్ ఇతని జేబులో పైసా కూడా లేదు" అని జేబులు వెతుకుతూ నర్స్ బాధగా అంది. ''చూస్తుంటే డబ్బున్న వాడిలా ఉన్నాడు. బిల్ కడితే ఓకే. తన కోసం ఎవ్వరూ రాలేదంటే అనాథ శవం లెక్కే.. తన శరీరంలో ఉన్న అవయవాలే మన బిల్ పే చేస్తాయి" అని చెప్పి నవ్వాడు. ఆ మాటతో నర్స్ కూడా నవ్వింది.

ఆ గతం గుర్తుకు వచ్చి శరీరం ఒక్కసారిగా వణికింది. తనని తాను తడిమి చూసుకుంటూ ప్రస్తుతంలోకి వచ్చాడు.




ఒంట్లో ఏవైనా అవయవాలు మిస్ అయ్యాయేమో అని.... కానీ ఇప్పుడు హాస్పిటల్ వాతావరణం చూసి చాలా ఆనందం కలిగింది.

చాలా ఆనందంతో ఇంటి వైపు కదిలాడు. తమ ఇంటి పక్కనే ఉండే రామయ్య గుర్తుకు వచ్చాడు.

రామయ్యకి డెబ్బై యేళ్లు ఉంటాయి. తన పొలం మీదుగా హైవే వెయ్యడంతో ఉన్న ఒక్క ఆధారంపోయింది. పొలం తీసుకొని డబ్బులు ఇస్తాను అని చెప్పిన ప్రభుత్వం మారిపోయింది.

కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఏవేవో లెక్కలు అడుగుతోంది. పొలం పోయింది. డబ్బులు రాలేదు. జీవితం అల్లకల్లోలం అయ్యింది. గవర్నమెంట్ ఆఫీసర్లు మళ్లీ రా.... మళ్లీ రా.... అంటూ తిప్పుకుంటున్నారు.

ఆ ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి తన కాళ్లకున్న చెప్పులు అరిగిపోయాయి. పాలిపోయిన వదనంతో బయటకి వస్తున్న రామయ్యతో "పదివేలు ఉంటే పనైపోతుంది" అని డోర్ బయట ఉన్న బ్రోకర్ ఆశ పెడుతున్నాడు. "ఈ సర్కారు వాళ్లే నాకు బోలెడు డబ్బివ్వాలి. అలాంటిది.... నేను పదివేలు కాదు పది పైసలు కూడా ఇవ్వను" అని రామయ్య గట్టిగా కూర్చున్నాడు.

అధికారులు లంచం కంచంలో తిని మంచంలో హాయిగా నిద్రపోతున్న రోజులు అవి... అనుకుంటూ గతం నుంచి ప్రస్తుతంలోకి అడుగేసాడు.

అప్పుడే ఒక ప్రభుత్వ ఆఫీసు ముందు జన సందోహం కనిపించింది. ఆనందు అటువైపు వెళ్లాడు. ఆ జనం మధ్యలో దూరాడు. "మాష్టారు ఏంటి సంగతి? ఎందుకు ఇంత జనం ఉన్నారు?" అని ఆనందు ఆత్రం ఆపుకోలేక పక్కనే ఉన్న వాడిని అడిగాడు. "ఒక్క పైసా లంచం తీసుకోకుండా అన్నీ ఫైల్స్ క్లోజ్ చేసారు.. ఇక్కడ పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు. అందుకే జనం వాళ్లని సత్కరిస్తున్నారు" అని చెప్పాడు. ఆ మాటతో ఆనందుకి కళ్లు తిరిగాయి. భయంతో చెమట్లు కూడా పట్టాయి. "ప్రభుత్వ ఆఫీసులు లంచం తీసుకోకుండా పని చేస్తున్నాయా? ప్రజలు వాళ్లని సత్కరిస్తున్నారా" అనే నిజం నమ్మడానికి చాలా సమయం పట్టింది.

"ఇదంతా ఏంటి?" అని దేవుడిని అడగాలి అనుకున్నాడు. హడావిడిగా గుడి వైపు కదిలాడు. గుడి రూపు రేఖలు మారిపోయాయి. "సార్.... సార్.... టెంకాయ మా దగ్గర తీసుకోండి" అని ఎవ్వడూ మీద పడిపోవడం లేదు. "ఉచితంగా పాదరక్షలు ఇక్కడ ఉంచుకోండి" అని రాసి ఉన్న దగ్గర ఉన్న అతను డబ్బులు అడగడం లేదు.

మళ్లీ గతం వెంటాడింది...

పోయిన సారి పుట్టినరోజు నాడు గుడికి వచ్చాడు ఆనందు. గుడి దగ్గరకి రాగానే ముగ్గురు మీద పడిపోయారు. "సార్ టెంకాయ పాతిక...." అని ఒకడు. "టెంకాయ ఇరవై..." అని ఇంకోడు. "నా దగ్గర టెంకాయ కొంటే చెప్పులు ఉచితంగా పెట్టుకోవొచ్చు" అని మరొకడు. వాళ్లని ఎలాగో దాటుకొని "ఉచితంగా పాదరక్షలు ఉంచుకోండి" అని బోర్డు ఉన్న వైపు నడిచాడు. "జతకి పది...." అని అన్నాడు. "ఉచితం అని రాసి ఉంది" అని ఆనందు ఆవేశంగా అన్నాడు. ఆ మాటకి వాడి కోపం చూసి.... ఆనందు పది రూపాయలు వాడి చేతిలో పెట్టాడు.

గుడి చుట్టూ మూడు ప్రదక్షిణాలు చేసి వచ్చే సరికి క్యూ లైన్ ఆగిపోయింది. "మాష్టారు? ఎందుకు క్యూ లైన్ ఆగిపోయింది?" అని వినయంగా పక్కనే ఉన్న ఇంకో భక్తున్ని అడిగాడు. "మన ఎమ్మెల్యే గారి తమ్ముడు ఒక్కగానొక్క రెండో భార్య పుట్టిన రోజు. వాళ్లకి లోపల స్పెషల్ పూజ జరుగుతోంది" అని అతను సమాధానం చెప్పి భజన చేసుకుంటూ ఉన్నాడు. "గుడిలో కూడా ఈ రెకమెండేషన్లు ఏంటి? దేవుడి దగ్గర అందరూ ఒక్కటే కదా...." అని మనస్సులో మాట బయటకి అనేసాడు. "అరే వీడెవడో మన ఎమ్మెల్యేని అనరాని మాటలు అంటున్నాడు" అని లైన్‌లో ఉన్న కార్యకర్త ఆవేశంగా అరిచాడు. ఏదో తేడా కొట్టి "ఎమ్మెల్యే జిందాబాద్... జిందాబాద్...." అని అరుస్తూ తెలివిగా తప్పించుకున్నాడు ఆనందు.



పోయిన సారి పుట్టినరోజు నాడు గుడికి వచ్చాడు ఆనందు. గుడి దగ్గరకి రాగానే ముగ్గురు మీద పడిపోయారు. "సార్ టెంకాయ పాతిక...." అని ఒకడు. "టెంకాయ ఇరవై...." అని ఇంకోడు. "నా దగ్గర టెంకాయ కొంటే చెప్పులు ఉచితంగా పెట్టుకోవొచ్చు" అని మరొకడు. వాళ్లని ఎలాగో దాటుకొని "ఉచితంగా పాదరక్షలు ఉంచుకోండి" అని బోర్డు ఉన్న వైపు నడిచాడు.

ఎమ్మెల్యే అనుచరుల నుంచి ఆ రోజు తప్పిన అపాయం గుడి లోపలికి వెళ్తూ ఉంటే గుర్తుకు వచ్చింది. అలా ప్రస్తుతంలోకి....

ఇప్పుడు గుడిలో క్యూ ఏ తోపులాట లేకుండా ముందుకు వెళ్తూ ఉంది. తన వెనుకే ఒక పెద్ద మనిషి క్యూలో ఉన్నాడు. "మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది ...." అని ఆనందు అనుమానంగా అన్నాడు. "ఆయన తెలీదా? మన ఏరియా ఎమ్మెల్యే గారు...." అని పక్కన ఉన్న పెద్ద మనిషి చెప్పిన మాట విని శిలలా నిలబడి పోయాడు ఆనందు. "ముందుకు పదండి...." అని ఎమ్మెల్యే అన్నాడు.

"సార్.... మీరు ఇలా క్యూలో ఏంటి?" అని ఆనందు ఆపుకోలేక అడిగాడు. "ఆ భగవంతుని ముందు అందరం ఒక్కటే...." అని ఎమ్మెల్యే చెప్పిన మాటలు విని తన మాట పడిపోయింది. ఆ లైన్‌లో అలా దేవుడిని తలచుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు. "కానుకలు హుండీలో వెయ్యండి. హారతి పళ్లెంలో ఎవ్వరూ వెయ్యకండి" అని పూజారి అంటున్నాడు. పొరపాటున హారతి పళ్లెంలో పడిన కానుకలు పూజారి స్వయంగా హుండీలో వేస్తున్నాడు. ఇదంతా చూసి ఆనందు మతి భ్రమించేలా ఉంది.

పరవశంతో ఆ దేవుడికి దణ్ణం పెట్టుకున్నాడు. ఈ సారి తీర్థం అమృతంలా అనిపించింది. చిటికెడు ప్రసాదంతో కడుపు నిండిపోయింది. అసలు తను చూస్తున్న మార్పుతో మనస్సు నిండిపోయింది. తనని తాను గట్టిగా గిచ్చుకున్నాడు. చాలా నొప్పి కలిగింది. "మాష్టారు! నన్ను ఒకసారి గట్టిగా గిల్లండి లేదా కొట్టండి" అని పక్కనే ఉన్న పెద్దాయనని అడిగాడు. "ఎల్లప్పుడూ తోటి మనిషికి సాయం చెయ్యాలి. ఇలా అపకారం ఎవరైనా చెయ్యగలరా? తోటి మనిషిని కొట్టడం? గిల్లడం? ఎంత పాపం...." అని అతను చెప్పి గిల్లకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

"ప్రపంచం నిజంగా మారిపోయిందా?" అని ఆశ్చర్యపోతూ ముందుకు కదిలాడు. అడుగడుగునా మారిన ప్రపంచం ఎదురవుతోంది... జంతువులు జూలో లేవు. అడవిలో మాత్రమే ఉన్నాయి. రైతు పంటని ఎవ్వరూ దోచుకోవడం లేదు. రైతు ఆత్మహత్య అనేది అసలు జరగడం లేదు. అలాగే రైతులు కూడా పొలాల్లో రసాయనాలు కలపడం లేదు. పొలల్లో నీళ్లు కూడా.... దొంగతనాలు లేనే లేవు... పోలీసులు సరిగ్గా పని చేస్తున్నారు. అసలు జనం ఓటుకి అమ్ముడు పోవడం లేదు. రాజకీయ నాయకులు కూడా ఓట్లు అడుక్కోవడం లేదు. మద్యం కొట్లు ఊరి చివరకి విసిరివేయపడ్డాయి. యువకులు అమ్మాయిలను గౌరవిస్తున్నారు. ప్రేమించి మోసం చెయ్యడం లేదు. పెళ్లి చేసుకొని విడాకుల పేరుతో ఎవ్వరూ విడిపోవడం లేదు.

ఇదంతా నమ్మలేక గిలగిల కొట్టుకుంటున్న ఆనందు... అలారం మ్రోగడంతో ఒక్కసారిగా ఉలిక్కి పడి లేచాడు. తను చూసిన కలల ప్రపంచం నుంచి బయటకి వచ్చాడు. "ఇదంతా కలా? నిజం కాదా?" అనుకుంటూ నిట్టూర్చాడు.

"ఇదంతా కొంతవరకైనా నేను నిజం చేసి చూపిస్తాను...." అని లేచి ఇంటర్వ్యూ కోసం రెడీ అయ్యాడు. తనకి ఈ రోజు ఐఏఎస్ ఫైనల్ ఇంటర్వ్యూ ఉంది. కలెక్టర్‌గా ఒక జిల్లాని, కొందరిని అయిన తన కలలోలా... ఇలలో మార్చి.... తన కలల ప్రపంచాన్ని కొంతవరకైనా నిజం చేసుకోవాలి.... అని మనస్సులో గట్టిగా అనుకున్నాడు. ఆ నిర్ణయంతో ఆనందు ముఖంలో ఆనందం మళ్లీ తిరిగి వచ్చింది.

★

ప్రపంచ టీ-20 లీగ్‌లకే తలమానికంగా నిలిచే ఐపీఎల్‌లో జార్ఖండ్ డైనమైట్ మహేంద్రసింగ్ ధోనీ ఓ మేరునగధీరుడు. గత 16 సంవత్సరాలుగా తన రికార్డులను తానే తిరగరాస్తూ వయసుతో ఏమాత్రం అడ్డం కాదని చెప్పకనే చెబుతున్నాడు.

20 ఓవర్లు.. 60 థ్రిల్స్‌గా సాగిపోయే ధూమ్ ధామ్ టీ-20 క్రికెట్ అంటే కుర్రాళ్ల ఆట అనుకుంటే అంతకు మించిన పొరపాటు మరొకటి లేదు. ఐపీఎల్‌లో చెన్నై ఫ్రాంచైజీ సారథి, సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ నాలుగు పదుల వయసులోనూ నవతరం ఆటగాళ్లతో పోటీపడి ఆడుతున్నాడు. 2008 సీజన్లో బీసీసీఐ ప్రారంభించిన ఐపీఎల్‌లో వివిధ దేశాలకు చెందిన ఎందరో ఆటగాళ్లు వచ్చారు.. వెళ్లారు.. తెరమరుగైపోయారు.. అయితే మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్థానం మాత్రం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది.




# మిస్టర్ ఐపీఎల్ ధోనీ

ప్రారంభ ఐపీఎల్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు తిరుగులేని నాయకుడుగా కొనసాగుతూ వచ్చిన ధోనీ ప్రస్తుత 16వ సీజన్లో మరే ఆటగాడికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పాడు. 2008 నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో పేరుగా నిలిచిన ధోనీ గత 16 సంవత్సరాలుగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తిస్తూ వస్తున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌ను నాలుగు సార్లు (2010, 2011, 2018, 2021 సీజన్లలో) విజేతగా నిలపడంతో పాటు రెండో అత్యంత విజయవంతమైన జట్టుగా తీర్చిదిద్దాడు. చెన్నై జట్టుకు మరో ఐదుసార్లు రన్నరప్ ట్రోఫీలు అందించాడు.

## 200 మ్యాచ్‌ల తొలి కెప్టెన్

2023 సీజన్ మూడో రౌండ్ పోరులో రాజస్తాన్ రాయల్స్‌తో తలపడడం ద్వారా ధోనీ కెప్టెన్‌గా 200 మ్యాచ్‌ల రికార్డును అందుకున్నాడు. 120 విజయాలు, 80 పరాజయాల రికార్డు నమోదు చేశాడు. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ధోనీ కెప్టెన్‌గా, మిడిలార్డర్ బ్యాటర్‌గా, అత్యుత్తమ ఫినిషర్‌గా 5 వేలకు పైగా పరుగులు సాధించాడు. ధోనీ బ్యాటింగ్ సగటు 39.09గా ఉంది. స్ట్రయిక్ రేటు 135. ఐపీఎల్‌లో ధోనీ మొత్తం 24 అర్ధ శతకాలు బాదాడు.

గత 16 సీజన్లలో జట్టు సస్పెన్షన్‌కు గురైన రెండు సీజన్లు మినహా మిగిలిన 14 సీజన్లలోనూ చెన్నైకి ధోనీ కెప్టెన్‌గా సేవలు అందించాడు. చెన్నై సూపర్ కింగ్స్, పుణే సూపర్ జెయింట్స్ జట్లకు ధోనీ ఐపీఎల్‌లో 214 మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందులో 125 విజయాలు, 88 పరాజయాల రికార్డు ఉంది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు. కెప్టెన్‌గా ధోనీ విజయశాతం 58.96గా ఉంది. రెండు సీజన్ల పాటు పుణే జట్టు ధోనీ నాయ కత్వంలో 14 మ్యాచ్‌లు ఆడింది. టీ-20 క్రికెట్ లీగ్ చరిత్రలోనే ఒకే జట్టు తరపున 200 మ్యాచ్‌లు ఆడటంతో పాటు నాయకత్వం వహించిన తొలి ఆటగాడిగా ధోనీ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

## కెప్టెన్‌గా అత్యధిక పరుగులు

ఐపీఎల్ చరిత్రలో ఓ ఫ్రాంచైజీకి కెప్టెన్‌గా అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా ధోనీ నిలిచాడు. 200 మ్యాచ్‌ల్లో 5000 పరుగులు సాధించాడు. ఇందులో 23 అర్ధ శతకాలతో సహా 84 పరుగుల నాటౌట్ అత్యధిక స్కోరుగా ఉంది. 137.67 స్ట్రయిక్ రేట్ సైతం నమోదు చేశాడు. అంతేకాదు, సిక్సర్ల బాదుడులో మూడో అత్యుత్తమ బ్యాటర్‌గా ధోనీ కొనసాగుతున్నాడు. క్రిస్ గేల్ 333 సిక్సర్లతో ఐపీఎల్ టాపర్‌గా నిలిస్తే, 235 సిక్సర్లతో ఏబీ డివిలియర్స్ రెండో స్థానంలో నిలిచాడు. ధోనీ 231 సిక్సర్లతో మూడోస్థానంలో కొనసాగుతున్నాడు.

టీ-20 ఫార్మాట్లో 300కు పైగా మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన అరుదైన రికార్డు సైతం ధోని పేరుతోనే ఉంది. 2017లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్ సారథిగా తన జట్టును ఫైనల్ చేర్చాడు. దీంతోపాటు టి-20ల్లో కెప్టెన్‌గా ఎక్కువ విజయాలు అందుకున్న కెప్టెన్‌గా కూడా ధోని అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్‌లో స్వదేశం, విదేశీ వేదికలుగా జరిగిన వివిధ ఐపీఎల్ టోర్నీలలో 216 మ్యాచ్‌ల్లో నాయకత్వం వహించిన ధోని 132 విజయాలు సాధించాడు. ధోని తర్వాత ఐపీఎల్‌లో కెప్టెన్‌గా ఎక్కువ విజయాలు అందుకున్న వారిలో రోహిత్ శర్మ రెండు, విరాట్ కోహ్లీ మూడో స్థానాలలో ఉన్నారు. ఐపీఎల్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌ల డెత్ ఓవర్లలో 2500కు పైగా పరుగులు సాధించిన తొలి బ్యాటర్ ధోని మాత్రమే. గత 15 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఈ ఘనతను మరే ఆటగాడూ సాధించలేక పోడం విశేషం.

## సంపాదనలోనూ మొనగాడు

ఐపీఎల్‌లో పాల్గొనడం ద్వారా అత్యధికంగా 200 కోట్ల రూపాయలు ఆర్జించిన ఒకేఒక్కడుగా ధోనీ నిలిచాడు. చెన్నై ఫ్రాంచైజీ ఐకాన్ ప్లేయర్‌గా ధోనీ సీజన్‌కు సగటున 15 కోట్ల రూపాయల చొప్పున అందుకొంటూ వస్తున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సూపర్ స్టార్లు సంపాదనలో ధోనీ తర్వాతి స్థానంలోనే ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లలోనూ భారత్‌ను అసలు సిసలు విజేతగా నిలపడం ద్వారా ధోనీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకొన్నాడు. 42సంవత్సరాల వయసులోనూ ఐపీఎల్ ఆడుతూ తన ఉనికిని కాపాడుకొంటున్న ధోనీ దేశవిదేశాలలోని ఎందరో నవతరం క్రికెటర్లకు మార్గదర్శిగా నిలుస్తున్నాడు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

## మనసానపల్లిలో డా॥అంబేద్కర్ జయంతి





**మహేశ్వరం :** మహేశ్వరంభాగ్‌లోని మనసానపల్లిచౌరస్తాలో డా॥ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14న జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్. అఖిలభారత కార్యకారిణి సదస్యులు బాగయ్య, ప్రాంత సహసంఘచాలక్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అఖిల భారత సామాజిక సమరసత సంయోజకులు శ్యాంప్రసాద్ రచించిన 'దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలా? పర్యవసానాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు - ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం





**కామారెడ్డి :** ఏప్రిల్ 15న కామారెడ్డిలోని పార్శిరాములు కల్యాణ మండపంలో ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లావణ్య (తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధిపతి), వక్తగా తెలంగాణ ప్రాంతప్రచారక్ లింగం శ్రీధర్, జిల్లా సంఘచాలక్ బొద్దు శంకర్, సమితి గౌరవాధ్యక్షులు పి. వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు ఏ.ప్రతాప్‌గౌడ్, విశిష్ట అతిథి న్యాయవాది బోరెడ్డి దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





**కరినగర్ :** నైజాం విముక్త స్వాంతంత్ర్య అమృతోత్సవాల జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం ఏప్రిల్ 11న కరీంనగర్‌లో వి కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాట్న హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహ్మారెడ్డి, ఉత్సవసమితి రాష్ట్ర అధ్యక్షులు డా. వంశీ తిలక్, రాష్ట్ర కార్యదర్శి నిరంజనాచారి పాల్గొన్నారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన వీరుల కుటుంబసభ్యులకు ఉత్సవసమితి ఆధ్వర్యంలో సన్మానం చేశారు.

### నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

# వారి సేవలు నిరుపమానం



**నెల్లూరు :** సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సమతామూర్తుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5 న నెల్లూరులోని పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం జరిగింది. ఈ కార్మికుల సేవలు నిరుపమానమైనవని వక్తలు కొనియాడారు.

# పోస్టుమన్‌కు ఘనంగా సన్మానం



**ఇందూరు :** జాగృతి కేవలం మీకు సంబంధించినది మాత్రమే కాదని ఇది మా పత్రిక కూడా అని పలువురు పోస్టుమెన్లు కొనియాడారు. జాగృతి, మాధవస్మారక సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 12 న ఇందూరులోని మాధవ సేవాసమితి భవనంలో పోస్ట్‌మెన్ల సన్మానం , పాఠకుల సమావేశం జరిగింది. పోస్ట్‌మన్‌లు చెప్పిన విషయాలు పాఠకులను హృద యాలకు హత్తుకున్నాయి. ముఖ్యంగా మహమ్మద్ ఇక్బాల్ అనే సీనియర్ పోస్ట్‌మెన్ మాట్లాడుతూ జాగృతి వల్లే మేము అందరికీ దగ్గరవుతున్నాం, ఇటువంటి పత్రికకు చందాదారులు ఇంకా పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో మమ్మల్ని గుర్తించి గౌరవిస్తున్న జాగృతిని మా ఇంటి పత్రికగా గౌరవిస్తామని" అన్నారు. గోపి అనే మరో పోస్టుమెన్ మాట్లాడుతూ జాగృతిపాఠకులు మాకు చక్కని గౌరవాన్ని ఇస్తున్నారని తద్వారా మాకు గుర్తింపుకలిగిందన్నారు. పోస్టుమన్లు అభిప్రాయం వెలిబుచ్చిన అనంతరం సన్మానంతో కార్యక్రమం ముగిసింది. ఇందులో 40మంది పోస్టుమెన్లు పాల్గొన్నారు. సమావేశంలో సమితి సభ్యులు డా॥ బి.ఎన్.రెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎల్.ఐ.సి.డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగ శ్రీనివాస్, తెలంగాణ ఉపాధ్యాయసంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, ఇందూరు జిల్లా పత్రికా ప్రముఖ్ ఇప్పకాయల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# భైంసా, నిర్మల్‌లో కుటుంబాల సమ్మేళనం







**నిర్మల్ :** ఏప్రిల్ 16న స్వయంసేవక కుటుంబాల కార్యక్రమం నిర్మల్‌లో జరిగింది ఈ కార్యక్రమానికి సామాజిక సమరసత ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్, విరించి హాస్పిటల్స్ ఛైర్ పర్సన్ మాధవిలత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 425 కుటుంబాల నుండి 1425 మంది పాల్గొన్నారు. అదే రోజున భైంసాలో కూడా కుటుంబాల కార్యక్రమం జరిగింది. దీనిలో 100 కుటుంబాల నుండి 300 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ విలువల గురించి వక్తలు మాట్లాడటం జరిగింది.

# కరీంనగర్‌లో సమరసతా సంచలన్



**కరీంనగర్ :** అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న కరీంనగర్ ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో సమరసత సంచలన్ జరిగింది అనంతరం సభా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాంత వ్యవస్థాప్రముఖ్ గంటా తిరుమల్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.

విభాగ్ సంఘచాలక్ మల్లోజుల కిషన్‌రావు, జిల్లా సంఘచాలక్ డా॥రమణా చారి, జిల్లా సహ సంఘచాలక్ ఎలగందుల సత్యనారాయణ, డాక్టర్ కన్నం దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో

# పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**మదనపల్లె :** సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న మదనపల్లెలోని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.

# బాల జాగృతి



## తెలుసుకుందాం

## కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం- పొనుగుపాడు



శ్రీగంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, పొనుగుపాడు గ్రామంలో నెలకొన్న శైవాలయం. దీనికి 'జంపనోరి గుడి' అనే మరో పేరు వాడుకలో ఉంది. ఈ ఆలయంలో ప్రతిష్ఠించిన సాలగ్రామం (శివలింగం) వారణాసి (కాశీ) నుండి తీసుకువచ్చారు. అప్పటినుండి దీనిని 'శ్రీగంగా అన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం'గా పిలుస్తున్నారు.

## కథ | మారని బుద్ధి!



ఒక గ్రామంలో జోగయ్య అనే పాల వ్యాపారి ఉండేవాడు.

అతన్ని వాడకందార్లు ఎన్నిసార్లు కోప్పడినా, హెచ్చరించినా పాలల్లో నీళ్లు కలపడం మానలేదు.

పైగా రోజురోజుకి అతని పాలల్లో నీళ్ల శాతం పెంచసాగాడు.

చివరికి గ్రామ పెద్దలు అతని వద్ద నుంచి గేదెల్ని లాగేసుకున్నారు. అంతేకాదు, ఆ గ్రామం నుంచి కూడా అతన్ని తరిమివేశారు.

జోగయ్య మరెక్కడైనా బతుకు తెరువు చూసుకుందామనుకుంటూ ఒక కొండ మార్గాన పోతున్నాడు.

మార్గమధ్యంలో అతనికి ఒక కొలను పక్కన ఉన్న గుహ ముందు ధ్యానంలో ఉన్న ఒక యోగి కనిపించాడు.

జోగయ్య ఆ యోగికి నమస్కరించి తన కథంతా చెప్పాడు.

'స్వామి ఇప్పుడు నాకు బుద్ధి వచ్చింది. నాకు పాల వ్యాపారం తప్ప, మరేం చేతకాదు. మీరే కరుణించాలి' అని ఆ

## పద్యము

**ప్రేమను గూర్చి యల్పునకుఁబెద్దతనంబును దొడ్డవానికిం**
**దామతి తుచ్ఛపుంబని నెదం బరికింపగా యీయరాదుగా**
**వామకరంబుతోడ గుడువం గుడిచేత నపానమార్గయుం**
**దోమగవచ్చునే మిగులఁదోచని చేతులుగాక భాస్కరా!**

**భావం :** భాస్కరా! లోకంలో నీచునకు గొప్ప పదవిని, గొప్పవానికి చిన్న పదవినిచ్చి పనులు చేయించుచో ఆ పాలనమంతయు ఆలోచన లేక ఎడమ చేతితో భుజించుటయును, కుడి చేతితో మల మూత్రములు శుభ్రపరచుటయును యగును.

## సూక్తిరత్నం

'విద్యాముఖ్యస్తు పండితః'

**వస్త్ర ముఖ్య మలంకారం ఘృత ముఖ్యంతు భోజనమ్!**
**గుణ ముఖ్యంతు నారీణాం విద్యాముఖ్యస్తు పండితః!!**

**భావం:** వస్త్రమే మనిషికి అందానిచ్చే అలంకారం. ఆహారం రుచిగా ఉండేందుకు నెయ్యి అవసరం. స్త్రీలకు శీలమే గౌరవానిచ్చే గుణం. పాండిత్యానికి ఆధ్యాత్మిక విద్యే వన్నె తెస్తుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| సహనం | బలం |
| కేతనం | రంగు |
| శౌర్యం | ఓపిక |
| సత్యం | జెండా |
| వర్ణం | నిజం |

జవాబులు : సహనం-ఓపిక, కేతనం-జెండా, శౌర్యం-బలం, సత్యం-నిజం, వర్ణం-రంగు.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ధన్‌సింగ్ గుర్జర్



ప్రముఖ భారత స్వాతంత్ర్య సమరయోధుడు. ఈయనను ధున్నాసింగ్ అని కూడా పిలిచేవారు. మీరట్‌లో కొత్వాల్‌గా విధులు నిర్వహించేవారు. 1857 మే 10న మీరట్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. ఒక కొత్వాల్‌గా దాన్ని అణిచివేయడం ధున్నాసింగ్ బాధ్యత. కానీ ఈయన కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమానికి నాయకత్వం వహించి 1857 ఉద్యమానికి మూలకర్తగా పేర్గాంచారు. 1857 జూలై 4న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రముఖ వేసవి విడిదైన కొడైకెనాల్ ఏ రాష్ట్రంలో ఉంది?
2. ఇటీవల సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణిస్తుంది?
3. గోవా రాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరు?

సమాధానాలు : 1. తమిళనాడు; 2. సికింద్రాబాద్ నుంచి తిరుపతి; 3. ప్రమోద్ సావంత్.



యోగిని ప్రాధేయపడ్డాడు.

యోగికి జోగయ్య మీద జాలి కలిగింది.

అక్కడున్న కొలనును జోగయ్యకు చూపుతూ "ఇక నుంచి, ఆ కొలనులో నీళ్లకు బదులు పాలుండబోతున్నవి. వాటిని అమ్ముకొని సుఖంగా బతుకు" అన్నాడు.

జోగయ్య యోగికేసి రెండు చేతులూ జోడించి, నమస్కరించాడు.

'అయ్యా! ఈ పాలకొలను పక్కనే రెండు నీటి కొలనులు కూడా సృష్టించి ఇవ్వండి" అని కోరాడు. ★

## మెదడుకు మేత

కడవంతటి వళ్లు,
వంటినిండా ముళ్లు,
కడుపంతా మధురమైన
గుళ్లు? ఏమిటది?

జవాబు : పనసపండు

## మంచిమాట

ఓడిపోతున్నామని
తెలిసిన క్షణంలోనూ
ఉత్సాహాన్ని
కోల్పోనివారే నిజమైన
ధైర్యవంతులు




# వారఫలాలు

24-30 ఏప్రిల్ 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆరోగ్యభంగం. కుటుంబ సభ్యుల నుంచి విమర్శలు పెరుగుతాయి. నిర్ణయాలు మార్చుకుంటారు. వాహనాలు, గృహం కొనుగోలులో ప్రతిబంధకాలు. ఆస్తుల విషయంలో అగ్రిమెంట్లు రద్దు చేసుకుంటారు. ఉద్యోగులు విధుల పట్ల అప్రమత్తంగా మెలగాలి. రచయితలు, క్రీడాకారులకు చికాకులు ఎదురవుతాయి. 26, 27 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనలాభం. విందువినోదాలు. విష్ణుధ్యానం చేయండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆదాయం ఆశాజనకం. కార్యక్రమాలలో ప్రతిబంధకాలు తొలగి ముందుకు సాగుతారు. ఆస్తి వివాదాలను పరిష్కరించుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఆరోగ్య సమస్యల నుంచి ఊరటలభిస్తుంది. వ్యాపారులకు లాభాలు. పారిశ్రామికవేత్తలకు సంతోషకర సమాచారం. కళాకారులు, వైద్యులకు విశేష లబ్ధి. 29,30 తేదీల్లో ఊహించని ఖర్చులు. సోదరులతో అకారణంగా తగాదాలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

శుభకార్యాల నిర్వహణలో మీ సలహాలు అందిస్తారు. రాబడి సంతృప్తికరం. స్నేహితులతో సంతోషంగా గడుపుతారు. ఎటువంటి కార్యక్రమాలైనా చకచకా పూర్తి చేసి సత్తా చాటుకుంటారు. ఉద్యోగులు ఆశించిన విధంగా అవకాశాలు పొందుతారు. రచయితలు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 24,25 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. కుటుంబంలో ఇబ్బందులు. కనకధారా స్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులు, స్నేహితుల సాయంతో ముందుకు సాగుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. ముఖ్య నిర్ణయాలకు తగిన సమయం. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. గృహ,వాహనయోగాలు. ఉద్యోగాలలో ఉన్నత పోస్టులురావచ్చు. వైద్యులు, సాంకేతిక నిపుణుల శ్రమ కొలిక్కి వస్తుంది. 25,26 తేదీలలో ఆస్తి వివాదాలు, మానసిక అశాంతి. దేవీఖడ్గమాల పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు ప్రారంభించి హుషారుగా పూర్తి చేస్తారు. రాబడి అనూహ్యమైన రీతిలో పెంచుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం కాగలవు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు లభించవచ్చు. 27,28 తేదీల్లో సోదరులతో కలహాలు. వ్యయప్రయాసలు. స్వల్ప అనారోగ్యం. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

రాబడి మరింత సంతృప్తికరంగా ఉంటాయి. నూతన కార్యక్రమాలు చేపడతారు. కొత్త కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు పనిభారం చాలావరకూ తగ్గుతుంది. రచయితలు, క్రీడాకారులకు శ్రమ ఎట్టకేలకు ఫలించే సమయం. 25,26 తేదీల్లో మానసిక ఆందోళన. బంధువులతో విరోధాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఉత్సాహంగా అనుకున్న కార్యక్రమాలను కొలిక్కి తెస్తారు. ఆదాయానికి ఇక ఇబ్బందులు తొలగినట్టే. ఇంటాబయటా అనుకూల వాతావరణం నెలకొంటుంది. శుభకార్యాలరీత్యా కొంత ఖర్చులు ఉంటాయి. విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలు సాధిస్తారు. పారిశ్రామివేత్తల కృషి ఫలించే సమయం. కళాకారులు, రచయితలకు శుభవార్తలు అందుతాయి. 24,25 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

రుణఒత్తిడుల నుంచి బయటపడతారు. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో ముఖ్య విషయాలపై చర్చలు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. గృహనిర్మాణ యత్నాలు కార్య రూపం దాలుస్తాయి. ఒక సమాచారం మిమ్మల్ని ప్రభావితం చేస్తుంది. ఆస్తి వివాదాల పరిష్కారం. కీడాకారులు, వైద్యులకు విదేశీ పర్యటనలు. 26,27 తేదీల్లో కుటుంబ సమస్యలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొన్ని వివాదాలు, సమస్యలు కొంత మేర పరిష్కారమవుతాయి. సమయానికి కార్యక్రమాలు పూర్తి చేసి సమర్థతను చాటుకుంటారు. విద్యార్థులు ఫలితా లపై సంతృప్తి. ఎంతోకాలంగా మిమ్మల్ని వేధిస్తున్న వ్యతిరేకులు కొందరు తిరిగి స్నేహహస్తం అందిస్తారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. 27,28 తేదీల్లో ఆరోగ్యం సహకరించదు. బంధువులతో తగాదాలు. దుర్గాదేవిని పూజించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలు మరింత సాఫీగా సాగుతాయి. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. రాజకీయవర్గాలకు విదేశీ పర్యటనలు తప్పనిసరి. రచయితలు, వైద్యులు సత్తా చాటుకుంటారు. 24,25 తేదీల్లో ఆరోగ్యభంగం. కుటుంబంలో చికాకులు. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

రాబడి గతం కంటే మెరుగుపడుతుంది. సన్నిహితులతో వివాదాలు పరిష్కారం. శుభకార్యాలలో పాల్గొంటారు. జీవిత భాగస్వామి ద్వారా ఆస్తి లాభ సూచనలు. గతంలోని సంఘటనలు కొన్ని గుర్తుకు వస్తాయి. వ్యాపార లావాదేవీలు మెరుగు. ఉద్యోగులకు చికాకులు తొలగి ఊరట. క్రీడాకారులు, వైద్యులకు కొత్త అవకాశాలు దక్కవచ్చు. 26,27 తేదీల్లో వృథాఖర్చులు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

రాబడి మరింత మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి స్నేహితులతో ఉత్తరప్రత్యుత్తరాలు. ప్రముఖులతో పరిచయాలు. పోటీపరీక్షల్లో విజయం. శుభవార్తలు వింటారు. సమాజసేవ. వాహనయోగం. తీర్థయాత్రలుచేస్తారు. వ్యాపారస్తులకు లావాదేవీలు మరింత పుంజుకుంటాయి. 25,26 తేదీల్లో కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు. శ్రమ పెరుగుతుంది. రాఘవేంద్రస్వామి స్తోత్రాలు పఠించండి.

# పదరసం-412

## ఆధారాలు

**అడ్డం**

1. ఎల్లప్పుడూ, సదా (3)
3. వీచిక (2)
4. సైనిక విన్యాసము (3)
6. నాగమాత (3)
7. మేకు, కాలిమండ (2)
8. నిగమశర్మ చివరకు మాయం !(4)
10. కష్టము (3)
12. మోము (2)
14. అబద్ధము (2)
15. విష్ణువు భర్తగా! (4)
18. బడాయి, స్థితికి మించిన వేషం (2)
20. విస్మృతి (3)
22. అగడ్త (3)
24. ఎడము (2)
27. అటుగా ముసలితనం (2)
28. భోజనపాత్ర (2)
30. ఇది బలీయం! (2)
32. ఆభరణం నగరంలో వుంది (2)
34. లక్ష్మి (2)
36. వ్యాజము దావానలంలో వుంది (2)
38. వాతాయనము (3)
39. ఇది కుదిరితేగానీ నిష్ఠ కుదరదట! (2)
40. భవభూతి పేర్కొన్న రసం (3)

**నిలువు**

1. సుధ (3)
2. సాంబుడు (4)
3. భూమి (3)
4. కుండ, పాత్ర (4)
5. మంచు (4)
7. పిపీలికం (2)
9. దేహళి (3)
10. అత్తవారింటి శాశ్వతవాసం (4)
11. చంద్రగుప్తుని తల్లి (2)
13. ముక్కు, భూభాగం (2)
14. నీటి కాకి (2)
16. పాండురాజు చిన్న భార్య (2)
17. పంచాంగములో మొదటిది (2)
19. శకటము (2)
21. చీల్చుట
23. చిన్నడబ్బు (3)
25. సూర్యుడు (2)
26. సీత (3) 29. విరాళం (2)
31. పాండిత్యము, మేధ (3)
33. ఎల్ల, దుర్గము (2) 35. బుద్ధి (2)
37. ఏరు (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✠ | 3 | | ✠ | 4 | | 5 |
| | ✠ | 6 | | | ✠ | 7 | | ✠ | |
| | ✠ | | ✠ | 8 | 9 | | | ✠ | |
| ✠ | 10 | | 11 | ✠ | | ✠ | 12 | 13 | ✠ |
| 14 | | ✠ | 15 | 16 | | 17 | ✠ | 18 | 19 |
| 20 | | 21 | ✠ | | ✠ | | ✠ | ✠ | |
| ✠ | 22 | | 23 | ✠ | ✠ | ✠ | 24 | 25 | ✠ |
| 26 | ✠ | 27 | | ✠ | 28 | 29 | ✠ | 30 | 31 |
| 32 | 33 | ✠ | 34 | 35 | ✠ | 36 | 37 | ✠ | |
| 38 | | | ✠ | 39 | | ✠ | 40 | | |

**పదరసం – 412**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మే 16 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 408 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 శ్రీ | భ | 2 కృ | తు | ✠ | 3 సం | 4 వ | త్స | 5 రం |
| 6 ఊ | క | ✠ | త | ✠ | 7 పం | ✠ | న | ✠ | గ |
| ✠ | 8 ము | రి | యు | ✠ | చాం | ✠ | 9 ము | 10 జ | భూ |
| 11 బా | బా | ✠ | 12 గ | ర | గ | లు | ✠ | 13 కా | మి |
| ✠ | 14 పు | 15 ర | ము | ✠ | ము | ✠ | 16 కు | ర్రా | ✠ |
| 17 వ | ✠ | మ్యా | ✠ | 18 సిం | ✠ | 19 స | క్క | ✠ | 20 కో |
| 21 సం | భ | వ | ✠ | 22 ధూ | 23 పం | ✠ | ✠ | 24 కా | కి |
| త | ✠ | 25 లో | ల | ✠ | 26 చ | ర | ఖా | ✠ | ల |
| 27 ము | 28 న | క | ✠ | 29 నా | నా | ✠ | ✠ | 30 తా | ✠ |
| ✠ | 31 గ | సం | అ | ✠ | 32 మా | మి | డి | పం | డు |

**విజేతలు:** ఎస్.పూర్ణకుమారి, వి. మమత, జి.ద్వారకానాథ్, ఎన్.వి.యస్.శర్మ, కన్నెకంటి విష్ణుప్రసాద్, కోన్నె ప్రశాంత్, ఆర్.అంజనీదేవి, నేమాన సత్యనారాయణ, మత్స్యరాజ విజయలక్ష్మి, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, ఉదాలి భా స్కరయ్య, కె.సత్యనారాయణ, కొండుపర్తి కాంతామణి, వెల్లాల ఉమా మహేశ్వరరావు, టి.ఎస్.ఆర్. ఆంజనేయులు,మైత్రీసోమ, టి.వి. యస్.శర్మ, దావులూరి శివరామయ్య, ఎస్.వికాసచౌదరి, వనమాల రామలింగాచారి, పెద్ది పుష్పాశేషశాస్త్రి, జమ్మభరత్, కె. రమణమూర్తి, పులికంటి రాజేశ్వరరావు

**ఈవారం విజేత :**

**మంత్రిప్రగడ శ్రీహరిరావు, ఏలూరు**




అరుణ

# నిరాశకు గురిచేస్తున్న దక్షిణాది పాన్ ఇండియా చిత్రాలు

*పాన్ ఇండియా చిత్రాలకు కొత్త కళను తీసుకొచ్చింది దక్షిణాదికి చెందిన చిత్రాలే! 'బాహుబలి'తో మొదలైన ఈ హవా 'కేజీఎఫ్'తో బాగానే ఊపందుకుంది. ఈ రెండు సినిమాల సీక్వెల్స్ సైతం ఘన విజయాలను సాధించడంతో అది మరింత బలపడింది. అయితే ఆ తర్వాత వచ్చిన 'ఆర్.ఆర్.ఆర్.' తప్పితే మరే దక్షిణాది చిత్రమూ జాతీయ స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. కొంతలో కొంత 'కార్తికేయ -2' ఫర్వాలేదనిపించింది. ఇదిలా ఉంటే... 'బాహుబలి'ని చూసి తెలుగు నిర్మాతలు, 'కేజీఎఫ్'ను చూసి కన్నడ నిర్మాతలు పాన్ ఇండియా టార్గెట్‌గా వరుసగా సినిమాలు చేస్తున్నారు. అలానే మలయాళీలు సైతం పాన్ ఇండియా స్థాయిలో తమ చిత్రాలను నిలిపి, విజయం అందుకోవాలని తాపత్రయపడుతున్నారు.*




ఇక తెలుగువారైతే మరో అడుగు ముందుకేసి, పెద్ద చిన్న అనే తేడా లేకుండా పాతిక పైగా పాన్ ఇండియా చిత్రాలను ఈ యేడాది విడుదల చేయ డానికి రెడీ అవుతున్నారు. ఇందులో కొన్ని సినిమాల కథాంశాలను గమనిస్తే వీళ్లు తెలుగు సినిమా తీసి




పర భాషల్లోకి డబ్ చేస్తున్నారు తప్పితే మరొకటి కాదనిపిస్తుంది. ఎందుకంటే ప్రాంతాల సరిహద్దులతో సంబంధం లేకుండా జాతీయ స్థాయిలో ప్రేక్షకులు ఆమోదించే కొన్ని కథలు ఉంటాయి. వాటిని ఏ భాషలోకి అనువదించినా ప్రేక్షకులు ఆదరిస్తారు. త్వరలో రాబోతున్న తొలి ఇండియన్ సూపర్ మ్యాన్ స్టోరీ 'హను-మాన్' అలాంటిదే. దీనికి జాతీయ స్థాయిలోనే కాదు అంతర్జాతీయ స్థాయిలోనూ విశేష ఆదరణ లభించే ఆస్కారం ఉంది. కానీ కొందరు దర్శక నిర్మాతలు నేలవిడిచి సాము చేస్తూ, గతంలో విజయవంతమైన కొన్ని సినిమాల ప్యాటర్న్‌లోనే భారీగా చిత్రాన్ని తీసి ఐదుభాషల్లో విడుదలచేసి ప్రతికూల ఫలితాన్ని అందుకుంటున్నారు. దానికి తాజా ఉదాహరణ ఇటీవల కన్నడ నుండి వచ్చిన ఉపేంద్ర 'కబ్జా' మూవీ. 'కేజీఎఫ్' ఫార్మట్‌లో యాక్షన్ డ్రామాను తెరకెక్కించిన దర్శకుడు చంద్రు ఏ రకంగానూ మెప్పించలేకపోయాడు. అది చాలదన్నట్టు దీనికి సీక్వెల్ కూడా చేయబోతున్నట్టు ప్రకటించాడు. అలానే విపరీతమైన యాక్షన్‌తో వచ్చిన సందీప్ కిషన్ తమిళ్ పాన్ ఇండియా మూవీ 'మైఖేల్', నృత్యదర్శకురాలు బృంద తెరకెక్కించిన మరో తమిళ పాన్ ఇండియా చిత్రం 'థగ్స్' సైతం పరాజయం పాలయ్యాయి.

చిత్రం ఏమంటే తెలుగు నుండి వచ్చిన పాన్ ఇండియా చిత్రాలదీ ఇదే పరిస్థితి. భారీ అంచనాలతో వచ్చిన నాని 'దసరా' తెలుగులో గట్టెక్కింది కానీ ఉత్తరాదిన ఘోర పరాజయాన్ని అందుకుంది. నాని దీనిని పాజిటివ్‌గానే తీసుకున్నాడు. తానేమీ అమితాబ్ బచ్చన్‌ను కాదని కాబట్టి భారీ విజయాన్ని ఉత్తరాదిన తాను ఊహించలేదని వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి. అలానే యువ కథానాయకుడు విశ్వక్‌సేన్ చేసిన 'దాస్ కా ధమ్కీ'దీ ఇదే పరిస్థితి. ఈ సినిమా అయితే తెలుగులోనూ విజయం సాధించలేదు. ఈ రెండు సినిమాలను పక్కన పెడితే, తాజాగా గుణ శేఖర్ తెరకెక్కించిన 'శాకుంతలం' పరాజయం మాత్రం పాన్ ఇండియా చిత్రాల నిర్మాతలకు అశని పాతం లాంటిది. ఈ యేడాదిలో ఇప్పటికే 'వారసుడు, బలగం' వంటి చిత్రాలను నిర్మించి విజయాన్ని పొందిన 'దిల్' రాజు తాను సమర్పకుడిగా ఉన్న 'శాకుంతలం'ను మాత్రం గట్టెక్కించలేకపోయాడు.




కాళిదాసు విరచితమైన 'అభిజ్ఞాన శాకుంతలం'ను భారీ స్థాయిలో నిర్మించడానికి సాహసించిన గుణశేఖర్ నటీనటుల ఎంపిక విషయంలో జాగ్రత్త పడలేదనే విమర్శ సర్వత్రా నెలకొంది. మరీ ముఖ్యంగా సమంతను శకుంతల పాత్రకు ఎంపిక చేయడం ఘోరమైన తప్పిదం అనిపిస్తోంది. జాతీయ స్థాయిలో 'ఫ్యామిలీ మ్యాన్-2'తో సమంతకు పేరు రావడంతో ఆమెకు ఉన్న క్రేజ్‌ను బేస్ చేసుకుని వ్యాపార పరంగా లబ్ధి పొందవచ్చునని గుణశేఖర్ భావించారు తప్పితే అందం, అమాయకత్వానికి ప్రతీక అయిన శకుంతల పాత్రకు ఆమె ఎంతవరకూ నప్పుతుందనే ఆలోచన చేయలేదనిపిస్తుంది. అలానే ఇతర ప్రధానపాత్రధారుల ఎంపిక కూడా అలానే జరిగింది. దుష్యంతుడిగా నటించిన దేవ్ మోహన్, దుర్వాసుడిగా నటించిన మోహన్‌బాబు తప్పించి మిగిలినపాత్రధారులు ఎవరూ తమ పాత్రలకు న్యాయం చేకూర్చలేకపోయారు. ఈ చిత్రాన్ని త్రీడీ లోకి కన్వర్ట్‌చేసి మరో ఘోరమైన తప్పును దర్శక నిర్మాతలు చేశారనిపిస్తుంది. వి.ఎఫ్.ఎక్స్. వర్క్ పరమ నాసిరకంగా ఉండటం ఒకటైతే, దానిని త్రీడీ లోకి మార్చడంతో మరింత దారుణంగా సినిమా తయారైంది. ఓ అందమైన దృశ్యకావ్యాన్ని తెరపై చూడవచ్చని ఆశపడిన వారందరినీ 'శాకుంతలం' నిరాశకు గురిచేసింది. పైగా దీనిని ఆర్.ఎస్.ఎస్. అధికారులకు చూపించడం విచిత్రం. ఎంచుకున్న కథ మంచిదే అయినా దానిని ఎంత ప్రభావవంతంగా తెరకెక్కించారనేది ప్రధానం. ఆ విషయంలో అన్ని రకాలుగా గుణశేఖర్ బృందం విఫలమైంది. దాంతో అత్యంత సహజంగా దక్షిణాది నుండే రాబోతున్న పాన్ ఇండియా చిత్రాలపై నీలినీడలు అలము కున్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# నిలువెత్తు స్ఫూర్తి



హైదరాబాద్ నగరానికి ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు ప్రత్యేక ఆకర్షణ. సాగర్ తీరాన ఇప్పుడు మరో చారిత్రక ఘట్టమూ ఆవిష్కృతమైంది.


హక్కుల వారధి, సమానత్వ సారథి, భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహం నగరం నడిబొడ్డున భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా ఠీవిగా దర్శనమిస్తోంది. ఏప్రిల్ 14న అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అంబేద్కర్ విగ్రహం పీఠంలోపల ఆడిటోరియంలో ఆయన జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. మొత్తం రెండు ఎకరాల విస్తీర్ణంలో పీఠం, విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విగ్రహం బరువు 465 టన్నులు. వెడల్పు 45 అడుగులు. వినియోగించిన ఉక్కు 791 టన్నులు. ఇత్తడి 96 మెట్రిక్ టన్నులు. ఈ విగ్రహ నిర్మాణంలో రోజూ పనిచేసిన కార్మికులు 425 మంది. ఈ విగ్రహ రూపశిల్పి రామ్ వి సుతార్. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహంగా ఇది ఇప్పటికే రికార్డుల్లో కూడా చేరిపోయింది.


From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 27



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు











వెల : ₹.200/- వెల : ₹.200/- వెల : ₹.390/- వెల : ₹.300/- వెల : ₹.200/-




















వెల : ₹.200/- వెల : ₹.200/- వెల : ₹.200/- వెల : ₹.250/- వెల : ₹.250/-




వెల : ₹.599/- వెల : ₹.695/- వెల :₹.799/- వెల : ₹.799/- వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244